SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 11
APRIL - 2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక
ఏప్రిల్ 2022 వెల రూ.5/-
పుటలు-56

10-04-2022 నుండి 18-04-2022 వరకు

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం



కరుణానిధి రామ కౌసల్యానందన రామ !
పరమపురుష సీతాపతిరామ !
శరధిబంధన ! రామ ! సవన రక్షక రామ !
గురుతర రవివంశ కోదండరామ !

వ్యక్తికన్నా సమాజశ్రేయస్సే ముఖ్యమని చాటిన మానవతావాది, తిరుమల శ్రీవారి కైంకర్యాలను ఒక పద్ధతిలోకి తెచ్చిన మహాపురుషుడు, తిరుపతి నగర రూపకర్త అయిన శ్రీరామానుజాచార్యుల సహస్రాబ్ది సమారోహ ఉత్సవాలను తెలంగాణా రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ముచ్చింతల్ క్షేత్రంలో 02-02-2022 నుండి 14-02-2022 వరకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి వారి ఆధ్వర్యవంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంతో సహా 216 అడుగుల ఎత్తున్న శ్రీరామానుజాచార్యుల సమతామూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు.



ఈ మహోత్సవంలో తి.తి.దే. ఛాయాచిత్రాలు మరియు పుష్పఆధారిత ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రంలోనే ఏర్పాటు చేసిన 108 దివ్యదేశాల ప్రతిరూపాలలో తిరుపతి దివ్యదేశంలో ప్రతిష్ఠించిన శ్రీవారికి తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్. జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., తి.తి.దే. ఎక్స్-అఫిషియో సభ్యులు, ప్రభుత్వ చీఫ్‌విప్ అయిన డా॥ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మరికొంతమంది తి.తి.దే. పాలకమండలి సభ్యులు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.













# గీతాశ్లోకార్థసారం

శ్లో : ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధిన స్తథా ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 34వ శ్లోకం)

ప్రతిపదార్థం: ఆచార్యాః= గురువులు; పితరః= పినతండ్రులు, పెదతండ్రులు; పుత్రాః, చ= కుమారులును; తథా, ఏవ= అట్లే, పితామహాః= తాతలు; మాతులాః= మేనమామలు; శ్వశురాః= పిల్లనిచ్చిన మామలు; పౌత్రాః= మనుమలు; శ్యాలాః= బావమరదులు; తథా, సంబంధినః= అట్లే (ఇతర) బంధువులు (చేరియున్నారు).

భావం: గురువులు, తండ్రులు, కొడుకులు, తాతలు, మనుమలు, మేనమామలు, మామలు, బావమరదులు, ఇతర బంధువులు మొదలగువారు అందరును ఇచ్చటికి చేరియున్నారు.

## దేవదేవం భజే దివ్యప్రభావం

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం

రాజవరశేఖరం రవికులసుధాకరం
ఆజానుబాహునీలాభ్రకాయం
రాజారికోదండరాజదీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం

నీలజీమూతసన్నిభశరీరం ఘనవి-
శాలవక్షం విమలజలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపకం
భూలలనాధిపం భోగిశయనం

పంకజాసనవినుతపరమనారాయణం
శంకరార్జితజనకచాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం
వేంకటేశం సాధువిబుధవినుతం

(అధ్యాత్మసంకీర్తన 1-314)





ఈ సంకీర్తనలో శ్రీరామచంద్రుణ్ణి వర్ణించాడు అన్నమయ్య. ఈ సంస్కృత సంకీర్తనలో శ్రీరాముని కల్యాణగుణాలు వర్ణించబడ్డాయి. ఏ ఏ శుభగుణాలతో శ్రీరాముడు విలసిల్లుతున్నాడనేది ఇందులో తెలియజేశాడు. సకలకల్యాణగుణాలు కల్గిన దేవదేవుణ్ణి సేవిస్తున్నానని తన్మయత్వంతో అన్నమయ్య మనకు భక్తితత్త్వాన్ని నూరిపోశాడు. శ్రీరామునకు శ్రీవేంకటేశ్వరస్వామికి అభేదత్వాన్ని పాటిస్తూ అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీరాముణ్ణి స్తుతించాడు.



# ఒమైక్రాన్‌తో జాగ్రత్త!

## ఒమైక్రాన్ సోకితే?



- ఆర్.టి.పి.సి.ఆర్. పరీక్ష చేయించుకోవాలి.
- స్వీయ ఐసోలేషన్ చేసుకోవాలి.
- లక్షణాల ఆధారంగా జ్వరానికి మాత్రలు, దగ్గుమందు, విటమిన్ మాత్రలు తీసుకోవాలి.
- వైద్యులసూచన మేరకు ఇన్‌ఫెక్షన్. తీవ్రతను బట్టి యాంటీవైరల్‌డ్రగ్స్ తీసుకోవాలి.



- పోషకాహారం, ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలి.
- విశ్రాంతి తప్పనిసరి!
- పల్స్ ఆక్సీమీటర్ సహాయంతో రోజుకు రెండుసార్లు ఆక్సిజన్ లెవల్స్ పరీక్షించుకోవాలి.




- ఆక్సిజన్ లెవల్స్ 94కు తగ్గితే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి చేరుకోవాలి.
- వ్యాధినిరోధకశక్తి, తక్కువగా ఉండే వ్యక్తులు (కేన్సర్, హెచ్.ఐ.వి.పాజిటివ్, అవయవమార్పిడి చేయించుకున్నవాళ్లు) ఒమైక్రాన్ ఇన్‌ఫెక్షన్ బారినపడితే ఇంటికి బదులుగా ఆస్పత్రిలో ఐసోలేట్ కావాలి.



## సోకితే ఏం జరుగుతుంది?

- ఒమైక్రాన్ సోకినా లక్షణాల తీవ్రత తక్కువగా ఉండే వీలుంది.
- ఫ్లూను పోలిన దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం లక్షణాలు రెండుమూడురోజులు వేధించి తగ్గిపోవచ్చు.
- అయితే, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స మొదలు పెట్టడం అవసరం.
- వ్యాక్సిన్ తీసుకోని వారిలో ఒమైక్రాన్ తీవ్రత పెరిగిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి.

## బూస్టర్ డోస్‌తో ఉపయోగం ఉందా?



- వాక్సిన్లతో శరీరంలో వృద్ధి చెందే యాంటీబాడీల జీవితకాలం ఆరునెలల మాత్రమే! ఆ తర్వాత నుంచి వీటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది.
- కాబట్టి రోగనిరోధకశక్తిని పెంచుకోవాలంటే బూస్టర్ డోస్ తీసుకోకతప్పదు.
- ముందుందు కూడా వేరియంట్లు మారేకొద్దీ బూస్టర్ దోసులను తీసుకుంటూ ఉండాల్సిందే!



## వ్యాప్తి ఎక్కువ ఇందుకే!

- ఎక్కువశాతంమంది వాక్సిన్ రెండుడోసులు వేయించుకున్నారు. దాంతో ఒమైక్రాన్ సోకి, లక్షణాలు మొదలైనా మేము రెండుడోసులు వేయించుకున్నాం. కాబట్టి, మాకు ఒమైక్రాన్ సోకే వీలు లేదనే నిర్లక్ష్యంతో, ఐసోలేట్ కాకుండా తిరిగేయడం వల్ల వైరస్ ఎక్కువగా వ్యాప్తి అవుతోంది.




50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 ఏప్రిల్, 2022 సంచిక : 11


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| 50 ఏండ్ల తర్వాత... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| తిరుమలేశుడి సన్నిధిలో... ఉగాది! | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 13 |
| శ్రీశుభకృత్‌నామ సంవత్సరంలో మీ యోగక్షేమాలు... | శ్రీతంగిరాలవేంకటకృష్ణపూర్ణప్రసాదసిద్ధాంతి | 16 |
| సూర్యనారాయణా! వేదపారాయణా!! | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 21 |
| రామయ్య కోవెలలో.. రమణీయ శిల్పాలు!! | శ్రీ పవన్‌కుమార్ పంతుల | 22 |
| అందరి బంధువయా! అయోధ్యరామయ్యా! | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖరరావు | 25 |
| శ్రీసీతారాములకల్యాణం చూతమురారండి! | శ్రీ ఎస్.టి.జి.అంతర్వేది కృష్ణమాచార్యులు | 31 |
| వేదాలు రక్షింపగ తరలీ వచ్చితివా... | డా॥ కప్పగంతు రామకృష్ణ | 34 |
| ఇక్కడ తప్ప మరెక్కడా లేదు! | డా॥ చింతకుంట శివారెడ్డి | 36 |
| ఉగాదులన్నీ ఉషస్సులే! | డా॥ జి.వి.పూర్ణచందు | 40 |
| మరో భద్రాద్రి | శ్రీమతి డి.వరలక్ష్మి | 41 |
| నమ్మినోళ్లకు నమ్మినంత.. | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 43 |
| ఈ ఉత్సవంలో ఎన్నో విశేషాలు! | జమదగ్ని | 44 |
| ప్రణీతకు పుష్కరశోభ! | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 47 |
| శ్రీరామరక్ష సర్వజగద్రక్ష (చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు : శ్రీ తుంబలి శివాజీ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 52 |
| అద్దంలో చందమామ | డా॥ గంగిశెట్టి శివకుమార్ | 53 |
| బాలవినోదం | | 54 |


ముఖచిత్రం : శ్రీ సీతాసమేత శ్రీకోదండరామస్వామివారు, ఒంటిమిట్ట
వెనుక చిత్రం : వసంతలక్ష్మికి స్వాగతం...!!


ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# ఇంతకంటే పరమార్థం ఏముంటుంది?

ఒక పక్క ఎండలు మండుతుంటాయి. ఆ ఎండల నుంచి ఉపశమనంగా అన్నట్టు ప్రకృతి పచ్చటి చీరకట్టి చల్లదనాన్ని పంచుతుంది. చెట్లు చిగిర్చి పూలుపూసి కంటికి ఆహ్లాదాన్నిస్తాయి. గున్నమావిగుబురుల్లో చేరి మావిపూతలు తిని కోయిలలు కుహుకుహూరావాలు చేస్తూ చెవులకు ఇంపు కలిగిస్తాయి. జిహ్వాను తట్టిలేపే మామిళ్లు వేసవిలోనే నోటికి పసందు చేస్తాయి. మనిషికేం కావాలో ప్రకృతికి తెలుసు. అందుకు కృతజ్ఞతగానూ.. ప్రకృతిలోని మార్పులకు తగ్గట్టుగా వ్యవహరించడానికీ... ఉగాది వంటి వేడుకలను ఏర్పాటు చేశారు మన పెద్దలు. అందులో భాగంగా ఈ పర్వదినంనాడు విధిగా చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయి. వాటిలో అందరికి తెలిసినవి నాలుగే. అవి– అభ్యంగన స్నానం, నూతన వస్త్రధారణ, ఉగాది పచ్చడి తినడం, పంచాంగశ్రవణం, కానీ ఉగాదినాడు ఆచరించాల్సిన విధులు మరికొన్ని ఉన్నాయి. ధ్వజారోహణం, ఛత్రచామరసేకరణ (గొడుగులు విసనకర్రలూ సమకూర్చుకోవడం), ప్రపాదానప్రారంభం (చలివేంద్రాల స్థాపన), రాజదర్శనం, వసంతనవరాత్రులనిర్వహణ.

ఉగాదినాడు ఆ సృష్టికర్తను దవనంతో పూజించాలని చెబుతారు పెద్దలు. అలాగే... ఉగాది రోజున ఇంటి ముందు ధ్వజారోహణం చేయాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. శుచిగా తలంటుస్నానం చేసి, ఇంటి ముందు ఒక కర్రను నిలిపి దానిని పూలూ పసుపుకుంకుమలతో అలంకరించి పూజిస్తే మంచిదని భక్తుల నమ్మిక. దానిని బ్రహ్మధ్వజం లేదా ఇంద్రధ్వజం అంటారు. మహారాష్ట్రీయులు 'గుడిపడ్వా' పేరుతో ఉగాదినాడు తప్పనిసరిగా ధ్వజారోహణం చేస్తారు.

ఛత్రచామరాల సేకరణ... అంటే గొడుగులూ, విసనకర్రలూ సమకూర్చుకోవడం, వాటిని దానం చేయడంకూడా ఉగాదినాడు చేసేవారు. ఒకప్పుడు. చైత్రంనుంచీ ప్రత్యక్ష నారాయణుడి కిరణాల పదును పెరుగుతుంది. కాబట్టి ముందుజాగ్రత్తచర్యగా వీటిని సేకరించుకునేవారు. వేసవిలో దాహార్తుల దప్పి తీర్చడం మహాపుణ్యప్రదమని అనేక పురాణాలు చెబుతున్నాయి. అందుకే వేసవి పొడుగూతా ఉండే చలివేంద్రాలను ఉగాదినాడు ప్రారంభించడం కద్దు. మనల్ని గురించే కాక ఇతరులను గురించికూడా ఆలోచించడం దీని వెనుక రహస్యం. ఏ పండుగకైనా ఇంతకంటే పరమార్థం ఏముంటుంది?

ఇక.. షడ్రుచులతో ఉండే ఉగాది పచ్చడి గురించి అందరికీ తెలిసిందే. ఋతువుల మార్పు కారణంగా శరీరంలో కలిగే వాత, పిత్త, కఫ దోషాలను నివారించి, ఆరోగ్యాన్నిచ్చే శక్తి ఈ పచ్చడికి ఉంటుంది. అందుకే... ఇంతటి ఆరోగ్యప్రదమైన వేప పువ్వు పచ్చడిని ఒక్క పండగనాడే కాకుండా తొమ్మిదిరోజులపాటు (ఉగాదినుంచి శ్రీరామనవమిదాకా) తింటే మంచిదంటారు.

ఇప్పుడంటే మనకు రాశిఫలాలు తెలుసుకోవడానికే పరిమితం అయింది కానీ... ఆ ఏడాది వాతావరణం ఎలా ఉండబోతోంది, ఏయే పంటలు వేస్తే మంచిది, ఏరువాక ఎప్పుడు సాగాలీలాంటి విషయాలన్నీ రైతులు తెలుసుకోవడానికి పంచాంగశ్రవణం మార్గంగా ఉండేది–ఒకప్పుడు. పాలకులనూ, అధికారులనూ పండుగనాడు కలిసి శుభాకాంక్షలు చెప్పడం ద్వారా వారితో మంచిగా ఉండటం రాజదర్శనం ఆచారం వెనుక పరమార్థం. ఇప్పుడు రాజులు లేరు కాబట్టి ఆ సంప్రదాయం బంధువుల ఇంటికి వెళ్లి, వారి ఆశీస్సులు పొందడంగా మారింది. అయితే, కరోనా మహమ్మారివల్ల బంధువుల రాకపోకలు తగ్గాయి. వసంతనవరాత్రుల నిర్వహణ ఒకప్పుడు పాడ్యమినుంచి నవమిదాకా చేసేవారు. ప్రస్తుతం అది శ్రీరామ నవమికి బదిలీ అయింది. కొన్నిమార్పులూ చేర్పులూ ఉన్నప్పటికీ అన్నిట్లోనూ ఏదో ఒక పరమార్థం. అందుకే... ఆ ఆచారాలన్నింటినీ పండుగలరూపంలో మననిత్యజీవితంలో భాగం చేశారు పెద్దలు.

శుద్ధబ్రహ్మపరాత్మరతత్త్వమే కాలాత్మకపరమేశ్వరతత్త్వమై శ్రీవేంకటరమణస్వరూపమై కలియుగ దైవంగా తిరుమలకొండపై వెలసి, సర్వప్రాణికోటినీ కాపాడుతోంది. ఉగాదిపర్వదినశుభసందర్భంలో మన మంతా ఆచార వ్యవహారసంబంధమైన ప్రతి అంశంలోను త్రికరణాలతో తిరుమలేశుణ్ణి దర్శించుకుంటూ ఆనందస్థితిని అనుభవిద్దాం!


*అందరికీ శ్రీశుభకృత్‌నామసంవత్సరశుభాకాంక్షలు!*

# 50 ఏండ్ల తర్వాత..

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

మన హైందవసంస్కృతికి మూలసిద్ధాంతం "కృతజ్ఞత". ఈ కృతజ్ఞతను ప్రకటించే విధానమే యజ్ఞం. యజ్ఞ మంటే అగ్నిహోత్రంలో నేతిని వేయడం మాత్రమే కాదు, కృతజ్ఞతా ప్రకటన, స్వార్థత్యాగం. వీటినే యజ్ఞం అంటారు. యజ్ఞం వైదికసంప్రదాయానికి ప్రతీక. ఆలయ ఉత్సవాదులలో ప్రత్యేక సందర్భాలలో, విగ్రహప్రతిష్ఠ సందర్భాలలో, లోకకల్యాణార్థం అగ్నిని వేల్చి యజ్ఞాన్ని చేయడం సంప్రదాయంగా వస్తున్న ఆచారం.

**"ఇజ్యతే హవిః దీయతే అత్ర"** (దేవతలకు ఇక్కడ హవిస్సు అర్పింపబడుతుంది), **"యజతే దేవాన్ పూజయతి"** (దేవతలను పూజిస్తారు), **"ఇజ్యతే కర్మ ఫలేన సంగమయతి యాజమానం"** (యజమానుని కర్మఫలంచే కూర్చునట్టి కర్మ) ఈ వ్యుత్పత్తుల్నిబట్టి యజ్ఞంఅనే శబ్దం హోమకర్మగాను, దేవపూజగాను, ఫలప్రదమైనకర్మగాను చెప్పుకోవచ్చు. మానవశరీరంలో ప్రాణానికెంత ముఖ్యస్థానముందో, మానవకర్మల్లో యజ్ఞకర్మకు అంత ప్రాముఖ్యముంది.



**"యజ్ఞకర్మ సమస్త ప్రపంచానికి నాభివంటిది (కృష్ణ యజుర్వేదం)" యజ్ఞాలు ఆచరించడంవల్లే దేవతలు స్వర్గాన్ని పొందారు. రాక్షసులను సంహరించారు. యజ్ఞం చేతనే శత్రువులు మిత్రులౌతున్నారు. సర్వం యజ్ఞమందే కలదు. అంతేగాక, అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి, భూమి నుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నం, అన్నం వల్లనే ప్రజలు సంభవిస్తున్నారు. (తైత్తిరీయోపనిషత్తు)**

"యజ్ఞోవై విష్ణుః" అని వేదవాక్కు. పరమాత్మ యజ్ఞస్వరూపుడు కనుక "యజ్ఞః" అని పిలువబడతాడు– అంటుంది విష్ణుసహస్రనామావళి.

వర్షాలు కురియడానికి, భూమి సర్వశుభాలతో వర్ధిల్లడానికి కారణం యజ్ఞం. యజ్ఞస్వరూపమేగాక ఆ పరమాత్మ యజ్ఞాలచేత ఆరాధింపబడుతున్నాడు. గనుక తాను **'ఇజ్యః'** అని కీర్తింపబడ్డాడు. దేవతలందరికంటే గొప్పగా పూజింపదగ్గవాడై **"మహేజ్యః"**. మోక్షఫలాన్నిస్తున్నాడు. కాబట్టి యజ్ఞాలచే ఆరాధింపబడ్డ విష్ణుమూర్తియే యూప సహిత యజ్ఞమై ఉన్నాడు. (యూపస్తంభంతో కూడిన యజ్ఞంగా ఉన్నాడు) కనుక పరమాత్మ **'క్రతుః'** అని స్తుతించబడ్డాడు. యజ్ఞం ప్రపంచానికే శుభాన్ని కల్గించేదిగాను, పరమాత్మయే యజ్ఞస్వరూపుడిగా కొలవబడుతున్నాడనీ, యజ్ఞంవల్ల దేవతలు ఆనందించి సమస్త ప్రజలకు ఆనందాభివృద్ధులు కలిగిస్తారనీ, యజ్ఞం మానవకర్మల్లో అతిముఖ్యమైందనీ చెప్పబడింది.

వెన్నెలకంటి సూరన రచించిన శ్రీవిష్ణుపురాణంలో యజ్ఞాలు శుభసంకేతాలుగా చెప్పబడ్డాయి.

తే॥ యజ్ఞములచేత నమరు లాప్యాయనంబు
బొందుదురు దేవతలకు నానందమైన
నఖిలమునకు ప్రజావృద్ధి యవనిగల్గు
గాన క్రతువులు కల్యాణకారణములు (1-94)

యజ్ఞాలవల్ల దేవతలు తృప్తి పొందుతారు. వారికి ఆనందం కల్గితే అఖిలలోకాలకు వృద్ధికలిగిస్తారు. కనుక, క్రతువులు శుభకర్మలకు ప్రతీకలు.

## యజ్ఞకర్మాచరణ-దేవతార్చన

దేహం నిలవటానికి ఆహారం కావాలి. ఆహారం వర్షం వల్ల, వర్షం మేఘంవల్ల, మేఘాలు సూర్యునివల్ల ఏర్పడుతాయి. ఆ మేఘాలు ఇంద్రుడిఆజ్ఞతో వర్షాలు కురిపిస్తాయి. ఆ వర్షం వల్ల పంటలు పండుతాయి. ఆ సస్యం సూర్యసోమాది దేవతల వల్ల అభివృద్ధి పొందుతుంది. కాబట్టి ఆయా దేవతలకు మనుష్యులు ఋణపడుతున్నారు. ఆ ఋణం తీర్చుకోవడానికి యజ్ఞయాగాది క్రతువుల్ని చేసి, దేవతలకు అగ్నియందు హవిస్సును వేల్చడం ద్వారా వారిని తృప్తిపరచాలి. అప్పుడు తృప్తి పొందిన దేవతలు పుణ్యాలు కలిగిస్తారు. లోకానికి, యజ్ఞకర్తకు సౌఖ్యాలు కలిగిస్తారు. అంచేత దేవతార్చనకు కారణం యజ్ఞకర్మనే.

### యజ్ఞం వల్ల ఫలితాలు

**యజ్ఞగుండంద్వారా వచ్చే పొగలు వాతావరణంలో పేరుకుపోయిన కాలుష్యాన్ని పోగొట్టి, స్వచ్ఛతకు దారితీస్తాయి. దీనివల్ల అతివృష్టి, అనావృష్టి సమస్యలు ఏర్పడవు. కనుక యజ్ఞ కర్మ చేసే వ్యక్తి మాత్రమే కాదు, ఇల్లు, పరిసరాలు బాగుపడతాయి. చుట్టుపక్కల ప్రజలందరూ లబ్ధి పొందుతారు. పంటలు సమృద్ధిగా పండుతాయి. పశుపక్ష్యాదులు బాగుంటాయి. అంటువ్యాధులు వ్యాపించవు. అనారోగ్యాలు దరి చేరవు. అందుకే మన ఇతిహాసాల్లో, పురాణాల్లో హోమాలు, యజ్ఞాల ప్రస్తావన తరచుగా కనిపిస్తుంది. మనకు హాని చేసే సూక్ష్మక్రిములు నశిస్తాయి. హోమాల్లోని భస్మంతో ఔషధాలు తయారుచేయొచ్చు. యాగాలు చేసిన తర్వాత వచ్చే భస్మాన్ని పంటభూముల్లో చల్లితే ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పొగను మనం పీల్చడంవల్ల లోపలి అనారోగ్యాలు నయమౌతాయి. వర్షాభావం, మితిమీరిన ఎండలు వంటి వాతావరణ అసమతుల్యత లేకుండా పొలాలు సస్యశ్యామంగా**

యజ్ఞకర్మ అంటే పరమాత్మను ఉపాసించడమే. వేదాల్లోని మూడుభాగాలైన, కర్మ, ఉపాసన, జ్ఞానకాండలు యజ్ఞకర్మను వివరిస్తున్నాయి. ఉపాసనాకాండద్వారా పరమాత్మను







దీనరక్షకుఁడఖిల వినుతుడు దేవదేవుడు రాముడు

**ఉండి, దేశం సుభిక్షంగా ఉంటుంది. అందుకే యజ్ఞం జరిగే ప్రదేశం ఉండాలని, యజ్ఞం జరిగాక మిగిలిన బూడిదను తీసుకోవాలని చెబుతారు.**

**ఇటీవల కాలంలో యజ్ఞం చేసేవారు అరుదైపోయారు. ఎప్పుడో నూటికికోటికి ఒకసారి యజ్ఞంమాట వినిపిస్తుంది. కానీ, ఇది సరికాదు. యజ్ఞంవల్ల ఒనగూరే లాభాల గురించి తెలిసిన తర్వాత అయినా యజ్ఞకర్మ నిర్వహించడానికి ముందుకు రావాలి. మనం యజ్ఞయాగాదులు చేయడ మేంటి..? మనం రాజుల కాలానికి వెళ్తున్నామా అనే అపోహ నుంచి బయటపడాలి. యజ్ఞాలు నిర్వహిస్తే, మనం, మన చుట్టూ ఉన్నవాళ్ళు కూడా ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారు. యంత్రాలు, వాహనాలవల్ల పేరుకుపోతున్న కాలుష్యాన్ని కొంతైనా నిరోధించగల్గుతాం. యజ్ఞయాగాదులు నిర్వ హించడంద్వారా దేవఋణం తీర్చుకున్నట్టు అవుతుంది అని పురాణాలు చెబుతున్నాయి. ఒకరకంగా దేవఋణం తీర్చు కోవడం అంటే, మనకు మనం మేలు చేసుకోవడమే అవుతుంది.**

ఉపాసించడమే యజ్ఞకర్మ. గీతాచార్యుడు భగవద్గీతలో **"సకల దేవతాస్వరూపాలు, యజ్ఞస్వరూపం నేనే"** అని చెప్పాడు. కనుక, యజ్ఞకర్మ పరమాత్మను ఆరాధించడమే అవుతుంది.

## సంపూర్ణయజ్ఞం-సంపూర్ణ పరమాత్మ

సంపూర్ణయజ్ఞస్వరూపాన్ని సంపూర్ణమైన పరమాత్మ స్వరూపంగా చెప్పవచ్చును. మహాభారతంలో భీష్ముడు ఈపరమాత్మ స్వరూపాన్ని, సహస్రనామాలను ధర్మరాజుకు తెలియజెప్పాడు.

**1) యజ్ఞో యజ్ఞపతి ర్యజ్వాయజ్ఞాంగో యజ్ఞవాహనః**
**(విష్ణుసహస్రనామస్తోత్రమ్, 104)**

**2) యజ్ఞభృద్ యజ్ఞకృద్ యజ్ఞీ యజ్ఞభుగ్ యజ్ఞసాధనః,**
**యజ్ఞాంతకృద్ యజ్ఞగుహ్య మన్న మన్నాద ఏవ చ॥**
**(విష్ణుసహస్రనామస్తోత్రమ్, 105)**

పై రెండు శ్లోకాలు సంపూర్ణయజ్ఞస్వరూప పరమాత్మకు భాష్యం చెప్తున్నాయి.

**యజ్ఞం:** యజ్ఞస్వభావం పరమాత్మది. యజ్ఞస్వరూపం అతనిది. యజ్ఞస్వరూపుడైన పరమాత్మ "విశ్వరచన" అనే మహాయజ్ఞాన్ని నిర్వహించాడు కనుక పరంధాముడు "యజ్ఞ"మని పిలువబడు తున్నాడు.

**యజ్ఞః=** యజ్ఞస్వరూపుడు. "యజ్ఞో వై విష్ణుః" అని వేదం– "విష్ణువే యజ్ఞమును" అనింది.

**యజ్ఞపతిః=** యజ్ఞాలకు పతి. (నాయకుడు) "నేనే సర్వ యజ్ఞాలకు భోక్తను, ప్రభువును" అని గీతలో గలదు. అనగా





యజ్ఞఫలాన్ని అనుభవించే జీవుడూ, ఆ ఫలాలనిచ్చే దేవుడూ తానేయైనవాడు విష్ణువు.

**యజ్వా=** యజ్ఞం చేయునట్టి యజమాన రూపంలో ఉండేవాడు.

**యజ్ఞాంగః=** యజ్ఞాలే అంగాలుగా గలవాడు. యజ్ఞవరాహ మూర్తి. ఇతనికి వేదాలు పాదాలు, అగ్ని జిహ్వ, దర్భలు రోమాలు, బ్రహ్మ శిరస్సు, రాత్రింబవళ్ళు నేత్రాలు, వేదాంగాలు కర్ణకుండలాలు, నెయ్యి నాసిక– మొదలగురీతిగా హరివంశం వర్ణించింది. ఇతడు ధర్మమయుడు. సత్యరూపుడు, కాగా యజ్ఞాంగాలన్నీ మహావిష్ణునియందు సార్థకాలు.

**యజ్ఞవాహనః=** సత్ఫలాలిచ్చే యజ్ఞాలను వహింపజేయువాడు, లేదా ఇలాంటి యజ్ఞాలనే వాహనాలుగా కలవాడు. ఈతని నాలుగు గుఱ్ఱాలు చతుర్విధ పురుషార్థ రూపాలు.


**యజ్ఞభృత్=** యజ్ఞభర్త, యజ్ఞ పాలకుడు అయినవాడు.

**యజ్ఞకృత్=** సృష్టికి మొదట, చివర యజ్ఞం చేసేవాడు. లేదా దక్షాదుల యజ్ఞాల్ని ఖండించేవాడు, లేదా రాక్షసుల యజ్ఞాలను ధ్వంసం చేసేవాడు.

**యజ్ఞీ=** అన్నియజ్ఞాలలోను ముఖ్యంగా పూజింపబడేవాడు. యజ్ఞాలు స్వార్థంకోసం గాక, శ్రీవిష్ణుప్రీతిగా చేసినట్లయితే సర్వసత్ఫలాలు చేకూరుతాయి.

**యజ్ఞభుక్=** యజ్ఞాన్ని అనుభవించేవాడు. రక్షించేవాడు.

**యజ్ఞసాధనః=** తనను పొందడానికి యజ్ఞాలనే సాధనాలుగా గలవాడు. "యజ్ఞంవలన తన్ను ఆరాధించి, పొందు" డని గీతలో ఉంది. లేదా యజ్ఞసాధనాలైన సుక్కు. స్రువం, మంత్రం మున్నగునవి ప్రసాదిస్తాడు.



**యజ్ఞాంతకృత్=** యజ్ఞఫలాన్ని కల్గించేవాడు. "విష్ణవే స్వాహా" అనే ఋక్కును జపించి చేసేపూర్ణాహుతిచే, యజ్ఞాన్ని సాంగంగ సంపూర్ణం గావించి, సత్ఫలాలిచ్చేవాడు. లేదా యజ్ఞాలను అంతం చేసేటటువంటి రాక్షసులను ఖండించేవాడు.

**యజ్ఞగుహ్యమ్=** యజ్ఞాలలో గోప్యమైంది జ్ఞానయజ్ఞం. ఫలాపేక్షలేనిది. ఇట్టి రహస్యమైన యజ్ఞాన్నే తన రూపంగా గలవాడు. అనగా జ్ఞానయజ్ఞ స్వరూపుడు పరమాత్మ.

**అన్నమ్=** జీవులచే తినబడేది, జీవులను బ్రతికింపజేసేది, ఇది పరమాత్మ.

**అన్నాదః=** అన్నాన్ని తినేవాడు. పరమాత్మ. సర్వప్రపంచం అన్నం మొదలగు ఆహారపదార్థాలరూపంలో వృద్ధినొందుతోంది. ఇందు "అన్నాద ఏవ చ" అని శ్లోకంలో ఉండడంవల్ల "ఏవ, చ" అనేవి సర్వం ఒక్క పరమాత్మయందే వర్తించుననడాన్ని నిరూపిస్తున్నవి. (శరీరమునకు బలం, ఆరోగ్యాన్ని ఇచ్చే పదార్థాలన్నీ అన్నమే)

**మహాక్రతుః=**గొప్ప యజ్ఞస్వరూపమైనవాడు. "అశ్వమేధః క్రతు రాట్" అని మనువు పేర్కొనుటచే అశ్వమేధయాగం చాల గొప్పది. అది నారాయణరూపం.

**మహాయజ్వా=** గొప్పయజ్ఞాలుచేసిన యజమాని. లోకక్షేమం కోసం భగవంతుడు అనేకయజ్ఞాలు చేశాడు. ఎందరిచేతనో చేయించాడు. కర్త, కారయిత, ప్రేరకుడు, అనుమోదకుడు సర్వం స్వామే! ఈసృష్టి అంతా మహాయజ్ఞం. దీన్ని నిర్వర్తించేవాడు శ్రీమహావిష్ణువు.

**మహాయజ్ఞః=** గొప్పయజ్ఞరూపమైనవాడు. "యజ్ఞానాం జప యజ్ఞోఽస్మి" అనుటచే, జపయజ్ఞం ఉత్తమోత్తమమైంది. అట్టి జపయజ్ఞరూపుడు భగవంతుడు. జకారం జన్మను, పకారం పాపాన్ని హరిస్తుంది. జపంవల్ల జన్మపాపాలు తొలగి, శాశ్వత ముక్తి లభిస్తుంది.

**మహాహవిః=** గొప్పహవిస్సురూపమైనవాడు. లేదా స్వీకరించేవాడు. జ్ఞానయజ్ఞంలో ఆత్మనే హవిస్సుగా స్వామికి అర్పిస్తారు. అలాంటి ఆత్మరూపహవిస్సును స్వీకరించి, భక్తులను జీవన్ముక్తులుగా జేస్తాడు. ఆత్మస్వరూపమైన హవిస్సు భగవద్రూపమే! "నేను కానిది ఏదియు లేదు" అనిగీత! సర్వం విష్ణుమయమే!

తిక్కన, శాంతిపర్వంలో నారదుడు శ్వేతద్వీపంలో కన్పించిన విష్ణుస్వరూపాన్ని వర్ణించిన సందర్భంలోని వచన మిది. ఇందులో యజ్ఞపరికరాల సహితంగా పరమాత్మ దర్శనమిస్తాడు.

**వ॥ ఇవ్విధంబున నేకాంతియై సంస్తుతింప సితాసిత పీతారుణ పిశంగ హరిత వర్ణంబులను, బహుశిరోబాహు పాదంబులను, వేది- కమండలు- స్రుక్స్రువాగ్నిధారణంబున నోంకారసావిత్రీ, చతుర్వేదోచ్చారణంబులను, మహాద్భుతంబయిన నిజదివ్యరూపంబు నారదునకు దర్శనగోచరంబుగా నిలిచి విష్ణుండు (6-378)**


నారదుడు ఏకాగ్రచిత్తంతో, మిక్కిలి భక్తితో స్తుతించగా తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు, కాషాయ, ఆకుపచ్చ మొదలైన అన్నిరంగులకాంతులలో అనేకశిరస్సులు, చేతులు, పాదాలు కల్గి, యజ్ఞవేదికవంటి దానిపై కమండలువుతో స్రుక్, స్రువ, అగ్ని ధరించి ఓంకార సవిత్ర చతుర్వేద ఉచ్చారణాలతో తన దివ్యరూపాన్ని నారదునికి కన్పించేట్లు నిలిచాడు. ఇదే విష్ణువు (సర్వవ్యాపకపరమాత్మ) పూర్ణరూపం. సకలశక్తి స్వరూపం. అర్జునుడికి కృష్ణపరమాత్మ చూపించిన విశ్వరూపం. పురుషసూక్తం, నాలుగువేదాలు నిర్వచించే పరమాత్మ పరమ పురుషరూపం. కనుక యజ్ఞం పరమాత్మయొక్కపరిపూర్ణ విశ్వరూపానికి ప్రతీక. అందుచేత యజ్ఞకర్మ కేవలం కర్మగాదు. ఇది జ్ఞానానికి ప్రతీక.

విష్ణుదేవుడు యజ్ఞస్వరూపుడైతే ఆయన వక్షఃస్థలాన్ని అధిష్ఠించిన శ్రీమహాలక్ష్మికూడా ఆ యజ్ఞతత్త్వంతో ప్రకాశించేదే అవుతుంది. శ్రీవారు ఆనందనిలయుడైతే ఆయనదేవేరి శాంతి నిలయ అయింది. శాంతిలో ఆనందం ఉంటుంది. ఆనందంలో శాంతి ఉంటుంది. అందుకే, నవరసాలన్నీ శాంతిలోనే లీనమై పోతాయని చెప్పింది శాస్త్రం. త్యాగరాజస్వామికూడా 'శాంతము లేక సౌఖ్యము లేదని' చెప్పాడు. భౌతికసుఖాలు ఎన్ని ఉన్నా, మానసికశాంతి లేకపోతే అవి బాధాకరాలే! స్వర్గాన్ని కోరేవాడు యజ్ఞాన్ని చేయాలని చెప్పింది-శాస్త్రం. అయితే ఇక్కడ స్వర్గమనేది ఇంద్రాదులు నివసించే స్వర్గం కాదు. పరమసుఖస్థానం అని

## మహాశాంతియాగం

**తిరుపతి శ్రీరామచంద్రపుష్కరిణివద్ద 12-02-2022న మహాశాంతియాగం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. లోకసంక్షేమం కోసం, ప్రస్తుతం నెలకొన్న కోవిడ్ పరిస్థితులను అధిగమించడానికి తి.తి.దే. ప్రారంభించిన ఈ యాగం ఫిబ్రవరి 14వ తేదీ వరకు కొనసాగింది. ఇందులో భాగంగా మొదటిరోజు ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు యాగం నిర్విఘ్నంగా ఆచార్యవర్యులు నిర్వహించారు. ప్రారంభంలో భాగంగా పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, కంకణధారణ, 34 హోమగుండాల్లో అగ్నిప్రతిష్ఠ జరిగింది.**








**అనంతరం 50 మంది ఋత్విక్కులతో పంచసూక్తహోమం, సర్వశాంతి హోమం, లఘుపూర్ణాహుతి జరిగాయి. సాయంకాలం 6 గం॥ నుంచి రాత్రి 9.30 గం॥ వరకు సర్వశాంతిహోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., పాల్గొన్నారు.**

అర్థం. ఆ సుఖం ఉన్నప్పుడు శాంతి తప్పకవస్తుంది. కనుక, శాంతమే అన్నిటికీ మూలం. లక్ష్మీదేవి త్రిమూర్తిస్వరూపిణి.

చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం శ్రియం లోకే
దేవజుష్టా ముదారామ్। తాం పద్మనీమీం శరణ
మహం ప్రపద్యేఽ_లక్ష్మీ ర్మే నశ్యతాం త్వాం వృణే॥

(ఆశ్రితులకానందాన్ని ఒనగూర్చునట్టి, అపారమైన కాంతితో వెలుగొందుతున్నట్టి, సకలలోకాలలోను ఆశ్రితులను సంరక్షించేది కీర్తి పొందింది, దేదీప్యమానంగా ప్రకాశించేటటు వంటి, బ్రహ్మాదులతో తమ తమ అభీష్టసిద్ధికై సేవింపబడు తున్నట్టి, ఆశ్రితులకెంత ఇచ్చినా తృప్తి చెందనట్టి, తన చరణ సాన్నిధ్యాన్ని పొందించునట్టి, సకలవేదాలలోను ప్రసిద్ధికెక్కినట్టి శ్రీమహాలక్ష్మీదేవిని నా అభీష్టసిద్ధికై ఆ తల్లిచరణారవిందాలనే నేను ఉపాయంగా నమ్ముకున్నాను)

ఇంత మహిమాన్వితమైన లక్ష్మీమాతను ప్రధానంగా భావిస్తూ చేసే శ్రీయాగం లోకానికి శాంతిసౌఖ్యాలు కలిగించి, దేశాన్ని ఆధివ్యాధులనుండి రక్షిస్తుంది. దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని, మానసికస్థైర్యాన్ని, ధైర్యాన్ని, జ్ఞానాన్ని మొదలైన అష్టలక్ష్మీరూపాలతో లోకాన్ని అన్నివిధాలా ఆదుకుంటుంది శ్రీమహాలక్ష్మి. ఎంతైనా మాతృదేవతదయ మాటలలో చెప్ప లేనిది. ఆమెకు తన భక్తులయందు పుత్రవాత్సల్యం ఉంటుంది.

ఈ అంశాల్ని దృష్టిలో పెట్టుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచశాంతి, సౌభాగ్యాలకోసం శ్రీయాగాన్ని 2022, జనవరి 21వ తేది నుండి 27వ తేదీవరకు నిర్వహిం చింది. తి.తి.దే.ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు ఈ యాగాన్ని నిర్వహించారు. ఈ దంపతులు అమ్మ వారికి ముప్పైనాలుగుగ్రాముల బంగారుహారాన్ని కానుకగా



అందజేశారు. దాదాపు యాభైఏళ్లక్రిందట ఈ శ్రీయాగం చేశారు. ఆ తర్వాత మళ్లీ ఇంతకాలానికి అమ్మవారు ఈ యాగం చేసే భాగ్యం కల్పించారు. ఈ పవిత్రయాగంలో కంచిపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్రసరస్వతీస్వామివారు పాల్గొన్నారు.



ఈ యాగం పరిసమాప్తమైన రోజున శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి దంపతులు గోవును దానంగా అందజేశారు.



శ్రీయాగం విజయవంతంగా నిర్వహించిన ఆలయ అర్చకులకు బంగారు డాలర్లను సంభావనలతో పాటు అందిం చారు.

యజ్ఞాలు కామధేనువులాగా జీవుల అభీష్టాలను నెరవేర్చి వారిని ఉన్నత మార్గంలో పయనింప చేస్తాయి. వీటిని ఆచరిస్తే జన్మరాహిత్యం, పరమానంద ప్రాప్తి పొందగలరని, జీవుల నైతిక, ఆర్థికాభివృద్ధికి అవి ఉపయోగపడతాయని రుషులు ఉద్బోధించారు.


# తిరుమలేశుడి సన్నిధిలో... ఉగాది!!

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం,
99856 70152

తెలుగువారి ఇలువేల్పు అయిన శ్రీవేంకటేశ్వరస్వామికి తెలుగువారి సంప్రదాయం ప్రకారంగా, ఉగాదిపండుగనాటినుండి ఉత్సవాలు, ఊరేగింపులు ప్రారంభమై మళ్లీ ఉగాది ముందు రోజుకు పూర్తవుతాయి. తిరుమలలో ఉగాదిపండుగనాడు జరిగే తొలి వార్షికోత్సవం **'తిరుమలేశుడి ఉగాది దర్బార్!'** దీన్నే **'ఉగాది కొలువు'** అనీ, **'ఉగాది ఆస్థానం'** అని కూడా అంటారు.

ఈ **"ఉగాది దర్బార్!"** బంగారు వాకిలిముందు ఉన్న తిరుమహామణిమండపం (ఘంటామండపం)లో, అత్యంతవైభవంగా నిర్వహింపబడుతుంది.

ఉగాదిరోజున శ్రీవారిఆలయంలో సుప్రభాతం, తోమాలసేవ జరిగిన తర్వాత ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామికి, శ్రీవారిసేనాధిపతి విష్వక్సేనులవారికి ఏకాంతంగా తిరుమంజనం (అభిషేకం) జరుగుతుంది. ఒకవేళ ఉగాది 'శుక్రవారం'నాడు వస్తే, శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ముందుగానే శుక్రవారం అభిషేకం జరుగుతుంది. ఉగాదినాటికి ముందు వచ్చిన శుక్రవారం అభిషేకం అయిన తర్వాత శ్రీస్వామివారిమూర్తిని విశేషమైన వజ్రాలు పొదిగిన కిరీటం శంఖచక్రాలు, వరద, కటిహస్తాల కవచాలతో అలంకరిస్తారు. ఈ విశేషాలంకరణలో ఆనందనిలయునిమూర్తి సౌందర్యం అనుపమానం. పిదప ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి తులసితో సహస్రనామార్చన, నివేదనలు నిర్వహింపబడుతాయి.



## సర్వభూపాలవాహనంలో...

బంగారువాకిలిముందు ఉన్న ఘంటామండపంలో బంగారుసర్వభూపాలవాహనంలో శ్రీదేవీభూదేవేరులతో శ్రీమలయప్పస్వామివారిని తూర్పుముఖంగా బంగారు వాకిలికి ఎదురుగా ఉన్న గరుత్మంతునికి అభిముఖంగా

వేంచేపు చేస్తారు. పిదప పట్టుపీతాంబరాలతోను, వజ్రవైదూర్య మరకతమాణిక్యాది సర్వాభరణాల తోను, వజ్రకిరీటాలతోను సుగంధపరిమళభరిత మైన పూలమాలలతోను శ్రీవారిఉత్సవమూర్తులను నయనాభిరామంగా విశేషరీతిలో అలంకరిస్తారు.

## శ్రీవారి సేనాధిపతి

శ్రీవారిసర్వభూపాలవాహనం పక్కనే మరొకపీఠం పైన దక్షిణాభిముఖంగా సేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారిని వేంచేపు చేసి దివ్యాభరణాలతో, పూలమాలలతో అలంకరిస్తారు. తర్వాత, ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి, బంగారువాకిలి ముందర 'ఉగాది దర్బార్'కు సిద్ధంగా ఉన్న శ్రీవారిఉత్సవమూర్తులకు, సేనాధిపతికి విశేషంగా పిండి వంటలు నివేదిస్తారు.

## విశేషంగా పిండివంటల నివేదన

లడ్డులు, వడలు, అప్పాలు, దోసెలు, మున్నగు పిండి వంటలు, చక్కెరపొంగలి, మిరియపుపొంగలి, పులిహోర, దధ్యోదనం మున్నగు అన్నప్రసాదాలను విమానప్రదక్షిణంలో బంగారుబావి పక్కన ఉన్న వంటశాలనుండి ఊరేగింపుగా విమానప్రదక్షిణం చేస్తూ వెండివాకిలి ఎదురుగా బయట ఉన్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణం చేస్తూ, లోనికివచ్చి, ఆలయ ప్రవేశం చేసి, అటు గర్భాలయంలోను, ఇటు బంగారువాకిలి దగ్గర ఆస్థానంలోను నివేదనకు ఉంచుతారు. నైవేద్యఘంటలు హృదయంగమంగా, వీనులవిందుగా, మోగింపబడుతుండగా, రెండుచోట్ల ఈ విశేషనివేదన జరుగుతుంది. ఈ విశేష నివేదన పూర్తయిన వెంటనే మరో విశేషఘట్టం ప్రారంభమవుతుంది. అదే పట్టువస్త్రాల సమర్పణ.

## పట్టువస్త్రాల సమర్పణం

నివేదనలు పూర్తయిన తర్వాత విమానప్రదక్షిణంలో ఈశాన్యమూలలోని శ్రీయోగనరసింహస్వామిఆలయం పక్కన ఉన్న **"పరిమళపు అర"** దగ్గర నుండి శ్రీశ్రీశ్రీ పెద్దజియ్యంగార్లు పెద్దవెండిపళ్లెంలో మడతపెట్టి చుట్టగా చుట్టబడ్డ బంగారు జరీఅంచు ఉన్న ఆరుపెద్దపట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని, ఛత్రచామరమంగళవాద్యపురస్సరంగా ముందు పంచముఖ దివిటీలు వెలుగుతుండగా, సన్నడోలు, కంచు పలకగంటలు మోగింపబడుతుండగా వేదపారాయణాలు హృదయంగమంగా పఠింపబడుతుంటాయి. వారందరివెంట శ్రీశ్రీశ్రీ చిన్నజియ్యం గార్లు, ఏకాంగులు, దేవస్థానం శ్రీకార్యనిర్వహణాధికారి, సంయుక్తకార్యనిర్వహణాధికారులు, దేవాలయం ఉపకార్యనిర్వహణాధికారులు, పేష్కార్లు, పారుపత్యదార్లు మున్నగు ఆలయ అధికారబృందం వెంట రాగా, ఆలయం వెండివాకిలి ముందు ఉన్న బంగారు ధ్వజస్తంభానికి, బలిపీఠానికి ప్రదక్షిణం చేస్తూ, లోనికి వచ్చి విమానప్రదక్షిణం చేస్తూ **'బంగారువాకిలి'** దగ్గరకు రాగా, అక్కడ బాజాభజంత్రీలవాళ్లు బంగారువాకిలి దగ్గరే నిలిచి వాయిస్తారు. **'సన్నిధిగొల్ల'**, దివిటీతో, పట్టువస్త్రాలతో కూడిన జియ్యంగార్లను, వగైరా పెద్దలందరినీ శ్రీవారిసన్నిధివరకు పిలుచుకొని వెళ్లి **'కులశేఖరపడి'** వద్ద నిలుస్తాడు. శ్రీజియ్యం గార్లు, ఏకాంగులుమాత్రమే అర్చకస్వాములకు అందిస్తారు. వెంటనే అర్చకస్వాములు కులశేఖరపడి (గర్భాలయం గడప) దగ్గర తెరను వేస్తారు.

లోపల అర్చకులు జియ్యంగార్లు సమర్పించిన ఆరు పట్టువస్త్రాల్లో, నాలిగింటిని శ్రీవేంకటేశ్వరస్వామివారిమూల మూర్తికి అలంకరిస్తారు. అర్చకస్వామివారు తెరను తొలగించి శ్రీవేంకటేశ్వరస్వామిదివ్యమంగళవిరాణ్మూర్తికి బంగారుపళ్లెంలో పచ్చకర్పూరంతో ఆపాదమస్తకం దివ్యమంగళకర్పూరనీరాజనం సమర్పిస్తారు. ఆ తర్వాత ముందుగా అర్చకులు తాము చందన తీర్థశఠారుల్ని స్వీకరించిన పిదప అందరికీ తీర్థ, చందన శఠారుల్ని సాయించి తాంబూలమిస్తారు.

## 'ఉగాది దర్బార్'లో శ్రీవారికి వస్త్రసమర్పణం

ఆ తర్వాత మిగిలిన రెండు పట్టువస్త్రాలు ఉన్న వెండి పళ్లాన్ని పెద్దజియ్యంగారు శిరస్సుపై ధరించి, బంగారువాకిలి దగ్గర **'ఉగాది దర్బార్'**కు సిద్ధంగా ఉన్న శ్రీవారి ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చకులు ఆ రెండింటిలో ఒక వస్త్రాన్ని శ్రీమలయప్పస్వామికి, రెండవదాన్ని సేనాధిపతి విష్వక్సేనుల వారికి అలంకరిస్తారు.

## శ్రీవారికి అక్షతారోపణ

పిదప ప్రధానఅర్చకులు తమతలకు శ్రీవారిపాద వస్త్రంతో పరివట్టం **(పరివేష్టనం, తలకు చుట్టు కట్టే చిన్నపట్టు**

గుడ్డ) కట్టుకొని శ్రీమలయప్పవారిపై, విష్వ క్సేనులపై కుంకుమాక్షతలను (అక్షతారోపణం) చల్లుతారు. ఆ తర్వాత సేనాధిపతివారికి పరివట్టం కట్టి, శ్రీస్వామివారిపాదాలమీది అక్షతలను తీసుకొని, విష్వక్సేనులపై చల్లి, శఠారి మర్యాదలను జరుపుతారు.

## అర్చకులకు తండులదానం - ఆనందనిలయునికి ఆశీర్వచనం

శ్రీవేంకటేశ్వరస్వామివారు అర్చకులకు తండుల(బియ్యం) దానం తాంబూలం దక్షిణలతో సహా ఇస్తారు. ఇలా బియ్యంతో పాటు దక్షిణ తాంబూలాలను స్వీకరించిన అర్చకస్వామి, సాక్షాత్తు ఆనందనిలయుణ్ణి **"నిత్యైశ్వర్యో భవ!"** అని ఆశీర్వదిస్తారు. ఇలా ఆశీర్వచనం చేసిన ప్రధానఅర్చకులకు మరొక అర్చకులు పరివట్టం కట్టి శఠారిమర్యాదలు చేస్తారు.

## ఉగాది దర్బార్‌లో పంచాంగశ్రవణం

బంగారుసర్వభూపాలవాహనంలో కొలువై ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీమలయప్పస్వామివారిపాదాలచెంత ఉన్న నూతన సంవత్సరపంచాంగాన్ని శ్రీస్వామివారికి నమస్కరిస్తూ అర్చకులు ఆస్థానసిద్ధాంతికి అందజేస్తారు.



ఆస్థానసిద్ధాంతి, శ్రీవారికి ఆనాటి తిథివార నక్షత్రాలతో పాటు నూతనసంవత్సరఫలితాలు, లాభనష్టాలు, నవగ్రహాలసంచారం, సస్యవృద్ధి, పశువృద్ధి, మున్నగువిషయాలతో పాటు 27 నక్షత్రజాతకుల కందాయఫలాలను, ఆదాయవ్యయాలను, రాజ్యపూజ్యత, అవమానాలను పంచాంగశ్రవణంలో వినిపిస్తారు.

ఆ తర్వాత ఆస్థానసిద్ధాంతి శ్రీదేవీభూదేవేరులకు వరుసగా వారి నక్షత్రాలైన ఉత్తరఫల్గుని, రేవతీనక్షత్రఫలితాలను చెప్పిన తర్వాత, అక్కడ ఉన్న శ్రీకార్యనిర్వహణాధికారులు, సంయుక్తకార్యనిర్వహణాధికారులు, ధర్మకర్తల మండలిసభ్యుల అక్కడ ఉన్న ఆలయఅధికారుల నక్షత్రఫలితాల్ని విన్పిస్తారు.

ఇలా పంచాంగశ్రవణం చేయించిన ఆస్థానసిద్ధాంతికి శ్రీస్వామి అర్చకులు శ్రీస్వామివారిపాదాలమీది అక్షతలను శిరస్సుపై చల్లుతూ శఠారిని అనుగ్రహిస్తారు.

పిదప శ్రీవారి బొక్కసంగుమాస్తా లేచి, అత్యంతభయభక్తులతో స్వామివారికి సాష్టాంగనమస్కారం చేసి, నిలబడి, ముందురోజు వచ్చిన హుండీ రాబడిని, ఆదాయవ్యయాలను, ఉత్సవవిశేషాలను, దేవస్థానం ఇతరఆలయ ఉత్సవవిశేషాలను విన్పించిన తర్వాత, దేవరవారు చిత్తగించవలెను- అంటూ సాష్టాంగనమస్కారం చేసిన తర్వాత శఠారి అనుగ్రహం పొందుతారు.

వెంటనే **'కొలువుపళ్లెం'** అనే బంగారుతట్టలో నవనీతహారతిని శ్రీవారికి ఇచ్చిన తదుపరి, అర్చకులు ఆ హారతిని కార్యనిర్వహణాధికారిగారికి ఇచ్చిన తర్వాత అందరికి చూపిస్తారు.

ఆ తర్వాత తాళ్లపాక, తరిగొండ, మహంతు, మైసూరువారి హారతులు ప్రత్యేకంగా సమర్పించబడతాయి. పిదప అక్కడ చేరిన భక్తులందరినుండి ఒక్కొక్కరూపాయను, సేకరించి, ప్రత్యేకంగా అందరిపక్షాన **'రూపాయహారతి'**ని ఇస్తారు. ఇలా సేకరించిన రూపాయలను కార్యనిర్వహణాధికారిగారు ఖజానాకు జమచేస్తారు.

చివరగా శ్రీమాన్ పెద్దజియ్యంగారికి, పిదప దేవస్థానంకార్యనిర్వహణాధికారిగారికి, పరివట్టం కట్టి, శఠారిని అను గ్రహించిన తర్వాత శ్రీవారి ప్రసాదవినియోగం, అక్షతతాంబూలసత్కారం సంప్రదాయబద్ధంగా జరుపబడుతుంది. ఇంతటితో **'తిరుమలేశుడి ఉగాదిదర్బార్'** వేడుకలు సంపూర్తి అవుతాయి.

*శ్రీనివాసో విజయతే! శ్రీనివాసో విజయతే!*

# శ్రీ శుభకృత్ నామసంవత్సరంలో మీ యోగక్షేమాలు..

– శ్రీ తంగిరాల వేంకటకృష్ణ
పూర్ణప్రసాదసిద్ధాంతి,
తిరుమల తిరుపతి దేవస్థానముల
ఆస్థానసిద్ధాంతి.





## మేషరాశి

| | |
|---|---|
| ఆదాయం - 14 | రాజపూజ్యం - 03 |
| వ్యయం - 14 | అవమానం - 06 |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్13వ తేదీనుండి వ్యయస్థానంలో సువర్ణమూర్తిగా సర్వసౌఖ్యాలు కలుగజేస్తాడు. ఈరాశివారికి సంవత్సరారంభంలో గురుడు వ్యయస్థానంలో, శని లాభస్థానంలో శుభప్రదులై తలచినంతలో అన్నీపనులు నిరాటంకంగా సాగుతాయి. దేహారోగ్యం, ద్రవ్యలాభం, స్త్రీ, పుత్రులవల్ల విశేషసుఖం, దూరప్రాంతాల్లో ఉన్న సంతానంగురించి మంచివార్తలు వినుట, మనస్సు ప్రశాంతంగా ఉండుట జరుగుతాయి. ధనలాభం, ఇంట్లో కల్యాణాదిశుభయోగాలు, భూగృహస్థిరాస్తులవల్ల ఆదాయం, కార్యసిద్ధి కల్గును. ఉద్యోగులకు, వ్యాపారులకు అనుకూలం. వైద్యవృత్తిలోనివారు పేరు ప్రఖ్యాతులు, విశేషగౌరవం ధనం సంపాదిస్తారు. న్యాయవాదులు విజయం సాధిస్తారు. గతకాలంనుండి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయి. సంవత్సరారంభంలోనే విద్యార్థులు ఉద్యోగనియా మకాల్లో ఎంపిక అవుతారు. ఉన్నతవిద్యలకై విదేశీప్రయాణాలు కలసివస్తాయి. అశ్వినినక్షత్రంవారు ఎల్లప్పుడూ ఉత్సాహంతో కార్యోన్ముఖులై విజయం సాధిస్తారు. భరణి, కృత్తికలవారికి సంవత్సరమంతా శుభఫలాలు. వజ్రం, కెంపు ధరించడం, శ్రీమహాలక్ష్మి అష్టోత్తరపారాయణ చేయడం యోగకరం. అదృష్టసంఖ్య 9.



## వృషభరాశి

| | |
|---|---|
| ఆదాయం - 08 | రాజపూజ్యం - 06 |
| వ్యయం - 08 | అవమానం - 06 |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్ 13వ తేదీ నుండి లాభస్థానమందు రజితమూర్తి. సౌభాగ్యాల్ని కలుగజేస్తాడు. వృత్తిఉద్యోగాలలో మంచి మార్పులు, పదోన్నతులు వస్తాయి. ప్రతిచోటా విజయం, సౌఖ్యం కల్గడం, శత్రువులునశించడం, కీర్తి, వృద్ధి, ధనం, మంత్రసిద్ధి కల్గును. శనైశ్చరుడు ఏప్రిల్ 29 నుండి దశమస్థానంలో కుంభరాశిలో సువర్ణమూర్తిగా సంచరిస్తాడు. శనైశ్చరుని కుంభరాశిమార్పు కొంతమేరకు మంచిమార్పును సూచిస్తుంది. దశమశని ప్రభావంవల్ల వైవాహికజీవితం మరియు కుటుంబం మధ్యకూడా సమస్యలు ఉంటాయి. మూర్తిమంతంచే వృషభరాశివారికి ఈ శనిసంచారం శుభప్రదమైంది. న్యాయసంబంధమైన ఉద్యోగాలలో అధికారయోగం కల్గుతుంది.

చేసే పనిలో పోరాటం తర్వాత విజయం సాధిస్తారు. రాహు ప్రభావంవల్ల సంవత్సరారంభంలో ముఖ్యమైన నిర్ణయాలు వాయిదావేయడం మంచిది. గృహనిర్మాణాలు కలిసివస్తాయి. వాహనసౌఖ్యాలు కల్గుతాయి. న్యాయసంబంధమైనవిషయాల్లో విజయంసాధిస్తారు. సంవత్సరారంభంలోనే జన్మరాశిలో రాహువు, సప్తమరాశిలో కేతువుదోషం తొలగి ఆరోగ్యం బాగుపడుతుంది. చైత్రమాసం ఉత్తరార్ధంనుంచి వర్తకవ్యాపారాలు కలిసివస్తాయి. కృత్తికనక్షత్రంవారికి వ్యవహారజయం, రోహిణినక్షత్రంవారికి ఆకస్మికధనలాభం, ఉద్యోగవృద్ధి, మృగశిరవారికి ప్రతిబంధకాలు తొలగుతాయి. కృత్తిక–కెంపు, రోహిణి–ముత్యం, మృగశిర–పగడం ధరించాలి. శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆరాధించడం వల్ల కలి దోషాలు తొలగుతాయి. అదృష్టసంఖ్య 6.



## మిథునరాశి

| | |
|---|---|
| **ఆదాయం - 11** | **రాజపూజ్యం - 02** |
| **వ్యయం - 05** | **అవమానం - 02** |

ఈరాశివారికి గురుడు ఏప్రిల్ 13వ తేదీనుండి దశమ స్థానంలో, లోహమూర్తి. ధనహాని, స్థానభ్రంశం, ఉద్యోగంలో ఇతరులవల్ల ఆకస్మిక ఇబ్బందుల్ని కలుగజేయును. శనైశ్చరుడు ఏప్రిల్29 నుండి భాగ్యస్థానంలో కుంభరాశిలో తామ్రమూర్తిగా సంచరిస్తాడు. ఈసంవత్సరం ఈరాశివారికి శని నవమ, అష్టమ స్థానాలలో సంచారం ఒకప్పుడు ధనలాభం. ఒకప్పుడు దుఃఖం, వ్యాధిని సూచించును. అపమృత్యుదోషపరిహారార్ధం రుద్రాభిషేకాలు చేయడం మంచిది. కోర్టువ్యవహారాలు ఒక కొలిక్కిరావు. నవమస్థానంలో శని అదృష్టానికి అధిపతి కావడంతో కుంభరాశిలోనికి శనియొక్క మార్పు శుభఫలితాలనిస్తుంది. సోదర మూలకంగా కలహం. రాహువుఏకాదశస్థానంలో ఆకస్మికధన లాభాల్ని కలుగచేస్తాడు. మృగశిరనక్షత్రంవారికి చాలాకాలంగా అపరిష్కృతసమస్యలకు పరిష్కారం, ఆర్ద్రనక్షత్రంవారికి సంవత్సరం ఆఖరుకు అనుకున్నఫలితాలు వస్తాయి. పునర్వసు నక్షత్రంవారు ఆరోగ్యసమస్యలనుండి గట్టెక్కుతారు. మృగశిర–పగడం, ఆర్ద్ర–గోమేధికం, పునర్వసు–పుష్యరాగం ధరించుటచే మేలు జరుగును. అదృష్టసంఖ్య 5.



## కర్కాటకరాశి

| | |
|---|---|
| **ఆదాయం - 05** | **రాజపూజ్యం - 05** |
| **వ్యయం - 05** | **అవమానం - 02** |

గృహవాతావరణం అనుకూలం కాదు. మీరు పనిచేసే చోట ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మంచిది. ఆర్థిక మరియు వృత్తిపరమైన అంశాలలో కష్టనష్టాలను చవిచూడాల్సి వస్తుంది. కోర్టువిషయాలు అనుకూలంకాదు. ప్రయాణాలలో వస్తువులు, డబ్బు విషయంలో అప్రమత్తంగా ఉండడం అవసరం. ఈ రాశివారికి గురుడు సంవత్సరమంతా యోగిస్తాడు. అప్పుడప్పుడు బంధువులతో చికాకులు, మాట పట్టింపులు. ఋణబాధలు తొలగుతాయి. వ్యవసాయదారులకు మొదటిపంటకంటే రెండవపంట అనుకూలం. నూతనగృహాలు ఖరీదుచేయుట, లేక గృహనిర్మాణాలు కలిసివస్తాయి. పునర్వసు వారికి సౌభాగ్యవృద్ధి, పుష్యమివారికి కార్యభారం, ఆశ్లేషవారికి కుటుంబవృద్ధి కల్గుతుంది. పునర్వసు–పుష్యరాగం, పుష్యమి–నీలం, ఆశ్లేష–పచ్చ ధరించవచ్చును. అదృష్టసంఖ్య 2.



## సింహరాశి

| | |
|---|---|
| **ఆదాయం - 08** | **రాజపూజ్యం - 01** |
| **వ్యయం - 14** | **అవమానం - 05** |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్ 13వ తేదీ నుండి అష్టమస్థానంలో రజితమూర్తి. సౌభాగ్యాన్ని కలుగజేస్తాడు. అనవసరప్రసంగాలు కలిసిరావు. అష్టమస్థానంలో గురుసంచారం దోషప్రదమైనా, మూర్తిమంతంచే గురుడు శుభఫలితాల నిచ్చి ఆయుర్దాయాన్ని పెంపొందింపజేసి, భాగ్యవృద్ధిని కలుగజేస్తాడు. పూర్వీకులనుండి సంక్రమించిన ఆస్తుల విలువ రెట్టింపవుతుంది. ఏప్రిల్29 నుండి సప్తమస్థానమందు కుంభరాశిలో శనిసంచారం సానుకూలఫలితాలు కలుగజేస్తుంది. ధనధాన్యాలు వృద్ధినొందుతాయి. మే, జూన్ నెలల్లో సామాన్యఫలితాలుంటాయి. అనారోగ్య సమస్యలనుండి బయటపడతారు. మఘనక్షత్రంవారికి వ్యవహారజయం, సర్వకార్యసిద్ధి, పుబ్బవారికి కుటుంబసౌఖ్యం, బంధుజనఆదరణ, ఉత్తర 1 వారికి వ్యాపారవృద్ధి, ధాన్యవృద్ధి, కార్యసిద్ధి కల్గుతుంది. అదృష్టసంఖ్య 1.

## కన్యారాశి



| | |
|---|---|
| ఆదాయం - 11 | రాజపూజ్యం - 04 |
| వ్యయం - 05 | అవమానం - 05 |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్ 13వ తేదీనుండి సప్తమస్థానంలో, సువర్ణమూర్తి. సర్వసౌఖ్యాలను కలుగజేస్తాడు. పరిపూర్ణమైన ఆరోగ్యం. నిత్యకల్యాణం పచ్చతోరణంలా భార్యా భర్తల జీవనం సాగుతుంది. ఏప్రిల్ 29 నుండి షష్ఠస్థానంలో కుంభరాశిలో శని సుమారు రెండుమాసాల సంచారం చాలా అనుకూలమైన అంశం. ప్రయత్నంవల్ల కార్యానుకూలత కల్గుతుంది. కొన్నిప్రతికూలశక్తులు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటాయి. మీరు పనిచేసేచోట ప్రతికూలతలున్నా వాటిని క్రమంగా, అనుకూలంగా మార్చుకోగలరు. మాటలలో సంయమనం మంచిది.

రాహుకేతువులు ఏప్రిల్ 12 వ తేదీ నుండి వరుసగా అష్టమ, షష్ఠస్థానాలలో లోహమూర్తులుగా సంచరిస్తారు. వ్యవహారప్రతిబంధకాలున్నా గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం అనుకూలం. ఉత్తరనక్షత్రంవారికి అధికారవృద్ధి, గౌరవ మర్యాదలు పొందుట, హస్తవారికి ఉన్నతవిద్యాయోగం, కార్యసిద్ధి, చిత్తవారికి కళత్రఅనుకూలత, స్వతంత్రజీవనం కల్గుతాయి. అదృష్టసంఖ్య 5.

### గమనిక!

***ఏప్రిల్, 2022* సంచికను ఉగాది, శ్రీరామ నవమి పర్వదినాల విశేషసంచికగా పాఠకులకు అందిస్తున్నందుకు సంతోషపడుతున్నాం!!**

***అయితే, విశేషసంచికగా సప్తగిరిని తీర్చి దిద్దే క్రమంలో ప్రతినెలా వెలువరిస్తున్న ధారా వాహికలను ఈ సంచికలో స్థలాభావంవల్ల ప్రచురించలేకపోతున్నాం. వచ్చే నెలనుండి ధారా వాహికలు యథావిధిగా వస్తాయి.***

***పాఠకులు ఈ అసౌకర్యాన్ని అర్థం చేసుకుంటా రని ఆశిస్తున్నాం!!***

– ప్రధానసంపాదకుడు

## తులారాశి



| | |
|---|---|
| ఆదాయం - 02 | రాజపూజ్యం - 07 |
| వ్యయం - 08 | అవమానం - 05 |

ధననష్టాన్ని ఆపలేకపోయినా, గతకొంతకాలంగా మానసికవ్యథతో బాధపడుతున్న ఈ రాశివారికి గురుని సంచారం కష్టానష్టాలు తొలగి మానసికప్రశాంతత, ఆత్మస్థైర్యం కలిగేటట్లు చేస్తుంది. సంవత్సరప్రారంభంలో అనుకూల పరిస్థితులుంటాయి. అపరిమితమైన ఆనందం, సంతోషం బంధువుల వల్ల సౌఖ్యం, కార్యదీక్ష, ఐశ్వర్యవృద్ధి, సంపదలను పెంచుకోవడం మొదలగు ఉత్తమమైన ఫలితాలుంటాయి. మే, జూన్ నెలలు చాలా అనుకూలం. షష్ఠరాశిలో బృహస్పతి సంచారంవల్ల భార్యావర్గంతో గాని, సోదరవర్గంతోగాని విరోధం కలిగే సూచన లున్నాయి. ధనాదాయం విషయంలో లోటు ఉండదు. వ్యవసాయదారులకు పంటలు స్వల్పలాభాలన్నిస్తాయి. మృత్యుదోషం, శత్రుత్వం మొదలగు దోషపరిహారార్థం మాసశివరాత్రినాడు లేక తరచూ ఈశ్వరాభిషేకాలు చేయడం మంచిది. మన్యుసూక్త సహితంగా సుబ్రహ్మణ్యఅభిషేకం, అంగారకస్తోత్రపారాయణం, కుజగ్రహజపం, ఎర్రటివస్త్రంలో పెట్టి కందులు దానం చేయుట తగినపరిహారాలు. చిత్రా నక్షత్రంవారు పగడం ధరించడం, సుబ్రహ్మణ్యఆరాధన చేయడం మంచిది. స్వాతి నక్షత్రం– గోమేధికం, విశాఖ–పుష్యరాగం ధరించడం మంచిది. అదృష్టసంఖ్య 6.

## వృశ్చికరాశి



| | |
|---|---|
| ఆదాయం - 14 | రాజపూజ్యం - 03 |
| వ్యయం - 14 | అవమానం - 01 |

ఈరాశివారికి ఏప్రిల్ 13వతేదీనుండి పంచమ స్థానంలో గురునిరాశిమార్పు అత్యంతఅనుకూలం. సృజనాత్మక అంశాలలో రాణిస్తారు. బంధువులవల్ల సుఖం. సన్మిత్రలాభం, ఆయుర్దాయం పెంపొందడం, తలచినపనులు నెరవేరుతాయి.

ఇంట్లో శుభపరంపరలు కొనసాగుతాయి. శనైశ్చరుడు ఏప్రిల్ 29 నుండి చతుర్థస్థానంలో కుంభరాశిలో రజితమూర్తిగా సంచరిస్తాడు. శనైశ్చరుడు ఈ రాశివారికి మూడవ నాల్గవ ఇంటసంచరించడంవల్ల స్వస్థానప్రాప్తి, తనంతట తాను ప్రారంభించిన కార్యాలన్నీ నెరవేరుతాయి. క్రమశిక్షణతో, నిబద్ధతతో, ఉద్యోగవిషయాల్లో విజయాలు సాధిస్తారు. అర్ధాష్టమశని దుష్ఫలితాల్ని నివారించడానికి కొత్తవ్యాపారాలు వాయిదా వేయడం మంచిది. విశాఖ, అనురాధానక్షత్రాలవారికి శుభ యోగాలు సంప్రాప్తిస్తాయి. అదృష్టసంఖ్య 9.



## ధనూరాశి

| | |
|---|---|
| ఆదాయం - 02 | రాజపూజ్యం - 06 |
| వ్యయం - 08 | అవమానం - 01 |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్ 13వ తేదీనుండి చతుర్థ స్థానంలో ఉండి, సామాన్యఫలాల నిస్తాడు. శనైశ్చరుడు ఏప్రిల్ 29నుండి తృతీయస్థానంలో కుంభరాశిలో లోహమూర్తిగా సంచరిస్తాడు. రాహుకేతువులు ఏప్రిల్ 12వ తేదీనుండి వరుసగా పంచమ, ఏకాదశస్థానాలలో రజితమూర్తులుగా సంచరిస్తారు. ఈరాశివారికి ఇంకా ఏలినాటి శనిదుష్ప్రభావం పోలేదు. అయితే గతంలో కంటే ఆశాజనకంగా ఉంటుంది. ఆకారణంగా ఇతరులతో విరోధసూచన ఉంది. కనుక తగు జాగ్రత్త అవసరం. చేసే పనులమధ్యలో అవాంతరాలకు అవకాశం లేకపోలేదు. మానసిక, శారీరికరుగ్మతలు కలుగుతాయి. చతుర్థ స్థానంలో గురుడు విద్యావిషయాలలో వినూత్నంగా ఆలోచించి తెలివితేటలూ స్వశక్తిసామర్థ్యాలపై ఆధారపడి ఇతరుల అవసరం లేకుండా ఉన్నతి సాధిస్తారు. రాహుప్రభావంవల్ల న్యాయపరమైన పాతసమస్యలు ఒకదారికి రాగా, కొత్త ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ధనూరాశివారికి 4వ స్థానంలో మీనరాశిలోని బృహస్పతి సంచరిస్తున్నందున, అత్యంతసాహసాలు చేసి, సమస్త విజయాలు సాధించగల్గుతారు. ఈరాశివారు రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణాలుచేస్తే దోషనివారణ అవుతుంది. మూలనక్షత్రంవారికి ఇంటికి పడమరనైరృతి దిక్కులో వ్యాపారాలు కలిసివస్తాయి. పూర్వాషాఢ, ఉత్తరాషాఢనక్షత్రాలవారు సూర్యారాధన చేయడం మంచిది. అదృష్టసంఖ్య 3.



## మకరరాశి

| | |
|---|---|
| ఆదాయం - 05 | రాజపూజ్యం - 02 |
| వ్యయం - 02 | అవమానం - 04 |

ఈరాశివారికి గురుడు ఏప్రిల్ 13వతేదీ నుండి తృతీయ స్థానంలో, రజితమూర్తి సౌభాగ్యకరంగా సంచరిస్తాడు. వృత్తి ఉద్యోగవిషయాలలో అలజడులున్నా ధైర్యంతో, అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలను పొందుతారు. గతంలో నిలచి ఉన్న బాకీలు వసూలవుతాయి. పూర్వీకుల స్థిరాస్తులను మార్పు చేయడంద్వారా లాభపడతారు. ఎల్నాటిశనిసంబంధ ప్రభావాలు ఉంటాయి. హనుమాన్‌చాలీసా పారాయణవల్ల కొంత ఉపశమనం కల్గుతుంది. శనైశ్చరుడు ఏప్రిల్ 29 నుండి ద్వితీయస్థానమందు కుంభరాశిలో తామ్రమూర్తిగా సంచరిస్తాడు. జులై 12 తేదీ నుంచి అక్టోబర్ 23 తేదీల మధ్య ధనిష్ఠ 1, 2 పాదాలలో వక్రించి జన్మరాశిలో సంచరిస్తాడు. ఆరోగ్యం విషయం, ఆర్థిక, శారీరిక, మానసిక విషయాల్లో పురోగతి పెద్దగా ఉండకపోయినా గతం కంటే మెరుగైన జీవనవిధానం కల్గుతుంది. రాహుకేతువులు ఏప్రిల్ 12 వ తేదీ నుండి వరుసగా చతుర్థ, రాజ్యస్థానాలలో లోహమూర్తులుగా సంచరిస్తారు. రాహు కేతువుల సంచారం అనుకూలం కాదు. మాతృవర్గంవారి అనారోగ్యం బాధిస్తుంది. వాహనాల విషయంలో జాగ్రత్త వహించాలి. దూరప్రయాణాలను వాయిదా వేయడం మంచిది. దోష నివారణార్థం దుర్గా, సుబ్రహ్మణ్య ఆరాధనలు చేయడం మంచిది. ఉత్తరాషాఢనక్షత్రంవారు మానసిక ఆందోళనలనుంచి బయట పడతారు, శ్రవణంవారు మానసికప్రశాంతత కల్గి పురోగమిస్తారు. ధనిష్ఠనక్షత్రంవారు జన్మరాశిలో శని సంచారకాలంలో రుద్రాభిషేకం చేస్తే అవాంతరాలనుండి బయటపడతారు. అదృష్ట సంఖ్య 8.



## కుంభరాశి

| | |
|---|---|
| ఆదాయం - 05 | రాజపూజ్యం - 05 |
| వ్యయం - 02 | అవమానం - 04 |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్ 13వ తేదీ నుండి ద్వితీయస్థానంలో, లోహమూర్తి ధనహానిని కలుగజేస్తాడు.

గురుని ధనస్థానసంచారంవల్ల మనస్సౌఖ్యం, కీర్తివృద్ధి ధన వృద్ధి, ధర్మకార్యాలకు, పుణ్యకార్యాలకు ధనం వెచ్చించడం, సౌభాగ్యవృద్ధి అవుతుంది. శనైశ్చరుడు ఏప్రిల్29 నుండి జన్మరాశిస్థానంలో కుంభరాశిలో రజితమూర్తిగా సంచరిస్తాడు. జూన్ 5 నుంచి జూలై 12 తేదీల మధ్య ధనిష్ఠ 3వ పాదంలో వక్రించి జన్మరాశిలో సంచరిస్తాడు. వ్యవహారాలలో ఎంతటి క్లిష్టమైన అంశాలనైనా చిటికెలో పరిష్కరించగల్గుతారు. రాహుకేతువులు ఏప్రిల్12వ తేదీనుండి వరుసగా తృతీయ, నవమస్థానాలలో తామ్రమూర్తులుగా సంచరిస్తారు. అన్నిరకాల వ్యాధులనుండి ఉపశమనం పొందగల్గుతారు. ఆత్మస్థైర్యం పెరుగుతుంది. సంవత్సరప్రారంభంలో రెండుమాసాలు జన్మరాశి యందు శని సంచరిస్తున్నా మూర్తివంతంచే ఎటువంటి చెడు ప్రభావాల నీయక, శుభఫలాలనే ఇస్తాడు. తదుపరి ధనవ్యయం, వృత్తి వ్యాపారాలలో వ్యతిరేకతలు కల్గుతాయి. ధనిష్ఠనక్షత్రంవారు జన్మరాశిలో శనిసంచారకాలంలో రుద్రాభిషేకం చేస్తే అవాం తరాలనుండి బయటపడతారు. శతభిషనక్షత్రంవారు శివ తాండవస్తోత్రం, లక్ష్మీఅష్టోత్తరపారాయణ చేయుట మంచిది. పూర్వాభాద్రవారు. జగద్గురువైన కృష్ణపరమాత్మను ధ్యానించుట మంచిది. అదృష్టసంఖ్య 8.




## మీనరాశి



| | |
|---|---|
| ఆదాయం - 02 | రాజపూజ్యం - 01 |
| వ్యయం - 08 | అవమానం - 07 |

ఈ రాశివారికి గురుడు ఏప్రిల్ 13వతేదీ నుండి జన్మరాశి సంచారం, తామ్రమూర్తి సామాన్యఫలాలను కలుగ జేస్తాడు. బృహస్పతి స్వక్షేత్రమైన మీనరాశిలో ప్రవేశం ఈ రాశివారిపై అనేక శుభపరిణామాలకు నాంది పలుకు తుంది. శాంతం, సహనంతో విజయాలు సాధిస్తారు. ధ్యానం, యోగా అత్యంతప్రయోజనకరంగా ఉంటాయి. విద్యారంగం లాంటి ఉన్నతస్థానాలలో అందరికీ సమన్వయకర్తగా రాణి స్తారు. శనైశ్చరుడు ఏప్రిల్ 29నుండి వ్యయస్థానంలో, కుంభ రాశిలో సువర్ణమూర్తిగా సంచరించి మరలా వక్రించి లాభ స్థానంలో సంచరిస్తాడు. ప్రారంభంలో స్థిమితం లోపించినా జూలైనెల మధ్యనుండి దేహారోగ్యం చక్కబడుతుంది. అర్థలాభం స్త్రీ పుత్ర సుఖవర్ధనం, మనోనైర్మల్యం, ఇష్టార్థసిద్ధి కలుగుతుంది. మొత్తం మీద ఈ సంవత్సరం గోచారస్థితి అనుకూలం. రాహు కేతువులు ఏప్రిల్ 12వ తేదీనుండి వరుసగా ద్వితీయ, అష్టమస్థానాలలో సువర్ణమూర్తులుగా సంచరిస్తారు. రేవతి నక్షత్రంవారు పచ్చరాయి ఉంగరం ధరించుట మంచిది. అదృష్ట సంఖ్య 3.



# సూర్యనారాయణా! వేదపారాయణా!!

– శ్రీ జంధ్యాల శరత్‌బాబు,
99483 45013

దివినీ భువినీ ఏకం చేసే రవికిరణాలే ప్రకృతికి అలంకరణాలు. జనావళికి జాగరణాలైనా, అరుణారుణ అవతరణలైనా అవే. అత్యంత ఉత్తేజకారక దినకరుడి స్పర్శను 'త్రిలోకదీపా! ప్రణవస్వరూపా! కాంతిప్రియా! తేజోమయా!' అంటూ ఆస్వాదిస్తుంది భక్తజనహృదయం. "సూర్యనారాయణా! వేదపారాయణా! లోకరక్షామణీ! దైవచూడామణీ" అంటూ ప్రస్తుతి అందుకునే స్వామి నిలయమే అరసవల్లి. ఏప్రిల్ నెలలోనే ఈ స్వామివార్షిక కల్యాణోత్సవశోభ.

శ్రీకాకుళానికి సమీపంలోని ఈ ఉషా పద్మినీఛాయా సమేత శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానానికి శతాబ్దాల చరిత్ర ఉంది. హర్షవల్లికి రూపాంతరమైన అరసవల్లి ప్రస్తావన రెండో దేవేంద్రవర్మ (గాంగ రాజుల్లో ఒకరు) వేయించిన పలుశాసనాల్లో కన్పిస్తుంది. నాడు నిర్మితమైన ఆలయం గాంగుల రాజధాని నగరికటకం, శ్రీముఖలింగప్రాంతవాసులైన ఇద్దరుసోదరుల ప్రతిపాదన ఫలితం. గుడిపునరుద్ధరణ, పునర్నిర్మాణపనుల మూలంగా ఉత్సవమండపం ఎంతగానో విస్తరించింది.

ఇక్కడి పుష్కరిణి మహేంద్రుడి నిర్మాణఘనత పర్యవసానమని క్షేత్రకథనం. అనూహ్యరీతిలో శాపంపాలైన బలరాముడిని ఇక్కడ మందిరనిర్మాణంద్వారా ఆదుకోవాలని ఆయన కదిలివచ్చాడు. వజ్రాయుధంతో కోనేరు తవ్వి, అక్కడ కనిపించిన ప్రతిమనే ప్రతిష్ఠించినట్లు చెబుతారు. అందుకే ఈ ఇంద్ర పుష్కరిణిలో స్నానం అత్యంత పుణ్యప్రదమని ఆరాధకుల ప్రగాఢ విశ్వాసం.

నవరత్నఖచితమకుటం, సువిశాలనేత్రాలు, మకర కుండలాలు సుందరపద్మహస్తాలు, సుప్రసన్నవదనంతో శోభిల్లుతుంటారు– స్వామివారు. ఆ విగ్రహం నడుమ ప్రభవించే చిరుకత్తికి 'సూర్యకఠారి' అని పేరు. ఈ ఆలయప్రాంగణంలోనే ఐరావతంపై ఆసీనుడైన దేవేంద్రుడి రూపు కనువిందు చేస్తుంటుంది. అరసవల్లి సూర్యనారాయణస్వామికి కార్తికద్వాదశి రోజున తెప్పతిరణాల, మాఘసప్తమి రోజున శ్రీసూర్యజయంతి, ఫాల్గునశుద్ధ త్రయోదశి పూర్ణిమవేళ డోలోత్సవం ప్రధానంగా జరుగుతాయి.

శ్రావణబహుళాష్టమిరోజున శ్రీకృష్ణ జయంతి ఉత్సవం; వైశాఖ, మాఘ మాసాల్లో భానువారోత్సవాలను నిర్వహిస్తారు. ఏప్రిల్‌మాసంలో అరసవల్లిలో, ఏకాదశి శుభసందర్భంగా స్వామివారికి వార్షికకల్యాణోత్సవం జరుగుతుంది. పున్నమివరకు కొనసాగే ఈ వేడుకకు భక్తులెందరో దూరప్రాంతాలనుంచీ తరలి వస్తుంటారు. ప్రతిమాససంక్రమణానికీ క్షీరాభిషేకసేవ ఉంటుంది. వీటితోపాటు అష్టోత్తరశతసహస్రనామార్చనలు; తిరువీధి– కల్యాణసేవాదులు; సూర్యనమస్కారాలు; శాశ్వతఅన్నదానకార్యక్రమాలు అరసవల్లి సూర్యదేవాలయవిలక్షణాలై భాసిల్లుతున్నాయి.

ఆరోగ్యభాగ్యం కోరుకుంటూ భక్తులు పూజలు, అభిషేకాలు చేయిస్తూ ఉంటారు. అటువంటి వారందరి కోరికలు నెరవేరే ప్రాంతం కాబట్టే, హర్షవల్లి సార్థకనామం వహించి, సంతృప్తి సంతోషాల అరసవల్లిగా వెలుగొందుతోంది. గుడిలో విశేషఅర్చనలు, హారతులు, మహానివేదనలు, పుష్పమాలిక అలంకారాలు, నీరాజనాలు, సర్వదర్శనాలు అన్నీ భక్తులకు కనువిందు, నేత్రానందం.

కల్యాణోత్సవవేళలో ఆలయంలోని బేడా, అనివెట్టి మండపాలు సర్వాలంకారశోభితాలై అలరారుతుంటాయి. దీపాలంకరణసేవలు, రూపసందర్శనాలు, సాంస్కృతికప్రదర్శనలు చూపరుల మనోమందిరాలను భక్తిభావతన్మయత్వంతో నింపుతుంటాయి. అరసవల్లి అందుకే పాలవెల్లి, కల్పవల్లి.



# రామయ్య కోవెలలో....

విజయనగరసామ్రాజ్యం ఏర్పడే(1336) నాటికి ఒంటిమిట్ట అడవిగా ఉండేది. 1344లో కంపరాయలు ఉదయగిరి పాలకుడిగా వచ్చినపుడు ఓ మారు ఈ ప్రాంతానికి వచ్చాడు. ఇక్కడి బోయసోదరులు ఒంటడు, మిట్టడు ఆయనకు ఆతిథ్యమిచ్చారు. వారికోరికమేరకు ఆ ప్రాంతంలో రామునిగుడి కట్టేందుకు నిర్ణయించి, ఆ పనిని వారికే అప్పగించారు. నిర్మాణం మొదలైంది. 1356లో హరిహరరాయల అనంతరం వచ్చిన విజయనగరచక్రవర్తి బుక్కరాయలు ఇక్కడ ఏకశిలామూర్తులను ప్రతిష్ఠించాడు. అప్పటికి ఇక్కడ గర్భగుడి, అంతరాళమంటపం, పైన చిన్నగోపురం మాత్రమే ఉండేవి. ఈఆలయంలో ఇదే మొదటినిర్మాణంగా చెప్పవచ్చు. 1600-1648 మధ్యకాలంలో ఈ ఆలయం విస్తృతంగా అభివృద్ధి చెందింది.

## శిల్పచమత్కారం

ఆలయ అంతరాళమంటపం, మహామంటపాలకు మధ్యలో ముఖమంటపం ఉంది. నిర్మాణశిల్పశైలిని పరిశీలిస్తే దీన్ని బుక్కరాయల తర్వాతి కాలంలో నిర్మించి ఉంటారని పరిశోధకుల అభిప్రాయం. ఆలయంలోని మిగతానిర్మాణాలు ఆ తర్వాతిదశవే కావచ్చు. తర్వాత మట్లి అనంతరాజు మహామండపం, మహాప్రాకారం, గాలిగోపురాలను నిర్మించారు. తూర్పు గాలిగోపురం ఆయనకాలంలోనే పూర్తయింది. ఉత్తరదక్షిణ గోపురాలు అనంతరాజుకుమారుడు తిరువెంగళనాథరాజు, మనుమడు కుమారఅనంతరాజు పూర్తిచేశారు. ఆ తర్వాత ప్రవేశ ద్వారంలో జయవిజయులవిగ్రహాలను సిద్ధిరాజు ఏర్పాటు చేయించాడు.



# రమణీయ శిల్పాలు!

- శ్రీ పవన్‌కుమార్ పంతుల, 98855 06765

## కనువిందుగా...

ముఖమండపం పూర్తిగా విజయనగరశిల్పరీతిలో ఉంది. జయవిజయులవిగ్రహాలు, రాజగోపురం మొదట్లో సాలభంజికలు ఇందుకు నిదర్శనం. రాజగోపురంతో బాటు ఉత్తర, దక్షిణ గోపురాలు, ద్వారాల, గోడలపైకూడా అదే శిల్పరీతులు కన్పిస్తాయి. ఎదురుగా ఉన్న సంజీవరాయస్వామి ఆలయంతో సహా ఈ ఆలయంలో శిల్పాలనిర్మాణానికి 'ఎర్రని ఇసుకరాయి' వాడారు. ఆలయ నిర్మాతలలో ఒక రాజు తన దేవేరితో కలసి, ముకుళితహస్తాలతో ఉండడాన్ని రంగమండపంలోని ఓ స్తంభంపై గమనించవచ్చు.

## అపురూపసంపద

ఈ ఆలయం అద్భుతశిల్పసంపదకు నిలయం. ఇక్కడి శిల్పాలు హంపిశిల్పాలను గుర్తుకు తెస్తాయి. రంగమండపంలోని యాళీశిల్పాలు అద్భుతంగా అనిపిస్తాయి. ఇక్కడిశిల్పాలను ఎంతగా చూచినా తనివితీరదు. ముఖ్యంగా బలమైన, విశాలమైన గండ శిలలను యాళీస్తంభాలుగా మలచిన వైనం శిల్పుల అద్భుతనైపుణ్యాన్ని చాటుతోంది. రాయలవంశీకుల నిర్మితాలైన పలుదేవాలయా లలో కళాత్మకమైన యాళీస్తంభాలుండడం మనకు తెలిసినా, ఇక్కడిలా ఒక్కోస్తంభంమధ్యలో నిలువుగా గల ఖాళీస్థలంకూడా ప్రత్యేకంగా అన్పించకపోయినా, ప్రతిస్తంభంలో ఓ వ్యక్తి కూర్చోగలిగేందుకు వీలుగా ఉండడం ఆశ్చర్యం గొలుపుతుంది. రంగమండపంలోని దాదాపు అన్ని స్తంభాలపైనా పురాణగాథలఘట్టాలను గుర్తుకు తెస్తూ, మలచిన శిల్పాలు వాటిలోని జీవకళ చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తాయి. ప్రత్యేకించి రెండుస్తంభాలుమాత్రం పూర్తిగా చోళశిల్పసంప్రదాయం ఉట్టిపడే 'పేట్రన్‌డిజైన్'తో ఉండి ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. రంగ మంటపంలో దశావతారాలు, సేతువునిర్మాణానికి రాళ్లు తీసికెళ్తున్న





వానరుడు, గంధర్వుడు, క్షీరసాగరమథనం, గోవర్ధనగిరిధారి, విష్ణుమూర్తి, యోగనరసింహుడు, కుబేరుడు, అష్టావక్రుడు, శ్రీసీతారామకల్యాణాన్ని తిలకిస్తున్న హనుమత్, సుగ్రీవులు, తాటకవధ, అశోకవనంలో సీతమ్మను దర్శించుకుంటున్న ఆంజనేయుడు, సంజీవని పర్వతం తెచ్చిన హనుమంతుడు, వటపత్రశాయి, నవనీతకృష్ణుడు, కాళీయమర్దనం, ఇంకా... కోలాటం లాంటి జానపదకళారూపాలు, సంగీతనృత్యప్రదర్శనలూ, మల్లయుద్ధశిక్షణం తదితరశిల్పాలు అందరినీ ఆకట్టుకుంటాయి.

## శిల్పచాతుర్యాలు

రాజగోపురంలో కుడివైపున శ్రీసీతారామకల్యాణఘట్టాన్ని చమత్కారశిల్పంగా తీర్చిదిద్దారు. ఇది వరుసగా మూడు భాగాలుగా ఉంది. మొదట ఆజానుబాహుడైన రాముడు, తక్కువ ఎత్తుగల సీతమ్మమెడలో మంగళసూత్రం కట్టడం, రెండవభాగంలో తలంబ్రాలు పోయడం ఉన్నాయి. ఇక మూడవ భాగంలోనే శిల్పి తనచమత్కారాన్ని ప్రదర్శించాడు. బాగా ఎత్తుగా ఉన్న రామయ్య, తలపై సీతమ్మ తలంబ్రాలుపోయడం కష్టం కనుక ఆమె తండ్రి జనకమహారాజు కుమార్తెను కాస్త పైకెత్తి పట్టుకోగా సీతమ్మరామయ్యతలపై తలంబ్రాలు పోస్తోంది. ఆలయం మొదట్లోనే ఆసక్తినిరేపే ఇలాంటి శిల్పాలు భక్తులకు లోపలున్న మిగతాశిల్పాలను చూడాలనే ఉత్సుకతను కల్గిస్తోంది. ఎడమకుడ్యం చివరగా వృషభం, గజరాజులతో రూపొందించిన చమత్కారశిల్పం ఉంది. తల మినహా వృషభం శరీరాన్ని కప్పి చూస్తే కేవలం గజరాజుమాత్రమే కనిపిస్తుంది. గజరాజు శరీరాన్ని కప్పి చూస్తే కేవలం వృషభరాజమే కన్పిస్తుంది. అసలు ఈ రెండు జంతువులకూ ఒకే తలను మలచి, దాన్ని రెండు జంతువుల తలలుగా భ్రమింపజేయడమే శిల్పిచమత్కారం, ఆలయప్రాంగణంలోనూ, కల్యాణమండపం కుడ్యాలూ స్తంభాల పైనా కూడా ఇంకొన్ని చమత్కారశిల్పాలున్నాయి. దాని పక్కనే మరోశిల్పం కూడా శిల్పకళా చమత్కృతిని తెలుపుతోంది. ఇద్దరు బోయీలు ముందు వెనుక పల్లకీని మోస్తూ ఉంటారు. పల్లకీలో ఓ యువతి కూర్చొని ఉంటుంది. ఇందులో ప్రత్యేకత ఏముందని మనకు అనిపించవచ్చు. కానీ ఆ శిల్పాన్ని పరీక్షగా చూస్తేగానీ అసలు విషయం అర్థం కాదు. నిజానికి అందులో పల్లకీని ముందు వెనుకా మోస్తున్న బోయీలే పల్లకీగా కనిపిస్తారు. ప్రత్యేకించి పల్లకీ అంటూ ఉండదు. అదే ఆ శిల్పంలోని చమత్కారం. గాలిగోపురం మధ్యలో పైకప్పు బండ పగిలి ఉండటంతో దానికి ఆపుగా ఓ ఇనుప స్తంభాన్ని ఉంచారు. అది ఈ పల్లకీ శిల్పాన్ని దాదాపు పూర్తిగా ఆక్రమించడంతో ఆ శిల్పం కొద్దిగా తప్ప పూర్తిగా కనిపించదు. ఓ వ్యక్తి ఎదురుగా నిల్చొని చూచినట్లుండే శిల్పంలోనే, అతనిమధ్య తలను మూసేసి చూస్తే ఆ వ్యక్తి కుడివైపు చూస్తున్నట్లు, కుడి, మధ్యతలలను మూసిచూస్తే ఎడమవైపు చూస్తున్నట్లు కన్పించేలా మలిచిన శిల్పం ఆకట్టుకుంటుంది. ఒక ఆవు గడ్డి మేస్తున్నట్లూ, ఎదురుగానూ, వెనక్కీ చూస్తున్నట్లూ ఒకే శరీరం మూడుతలలతో గల ఇంకో శిల్పం ఆకర్షిస్తాయి. ఇప్పుడు మనం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనంగా భావిస్తున్న '3డి ఎఫెక్ట్' మూలాలను ఒంటిమిట్ట ఆలయశిల్పులు ఆనాడే పట్టుకొన్నట్లు కనిపిస్తోంది. ఆలయం నైరుతిదిశలోగల కల్యాణమండపంకూడా ఆకర్షణీయమైన శిల్పాలకు ఆటపట్టుగా కన్పిస్తోంది. దీని స్తంభాలపై సీతారామకల్యాణాన్ని తిలకిస్తున్న సుగ్రీవుడు, అంగదుడు, చెంచులక్ష్మి కాలిలో ముల్లుతీస్తున్న నరసింహుడులాంటి పలువిశిష్టమైన శిల్పాలు ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. మంటపంకుడ్యాలపై కూడా శిల్పవిన్యాసం మనసు దోచుకొంటుంది.



ఒంటిమిట్టఆలయరంగమంటపాన్ని రమణీయశిల్పాల రత్నపేటికగా చెప్పవచ్చు. జిల్లాలోని పలు ఆలయాలలో యాళీ స్తంభాలున్నా, ఒంటిమిట్టలోని యాళీస్తంభాలను మాత్రం ఎంతో పరిణితి చెందిన పనితనంతో, శ్రద్ధగా, ఆశ్చర్యం గొలిపేలా, అద్భుతంగా తీర్చిదిద్దారు. అందుకే ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయంచరిత్రదృష్ట్యా సంస్కృతీ, నిర్మాణశాస్త్రం దృష్ట్యా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అందరి బంధువయా! అయోధ్య రామయ్యా!

- డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు,
94919 46070

అయోధ్య, మధుర, మాయ (హరిద్వార్), కాశీ, కాంచీ, అవంతిక(ఉజ్జయిని), ద్వారవతి(ద్వారక) అనే ఏడు పురాలు మోక్షాన్ని ప్రసాదించే పురాలని పురాణోక్తి! అటువంటి సప్తమోక్షపురాలలో ఒకటిగా శ్రీరాముడి జననంతో ఆయన పాద ధూళితో, పాలనతో పునీతమైన పుణ్యక్షేత్రం అయోధ్య. 108 వైష్ణవ దివ్యతిరుపతులలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన పుణ్యధామం అయోధ్య. రామాయణగాథలన్నిటితోనూ ముడిపడ్డనేల ఇది.

శ్రీరాముడితో తరింపబడ్డ అయోధ్యలో దర్శించాల్సినవి చాలా ఉన్నాయి. అయోధ్యక్షేత్రం సరయూనదీతీరంలో ఉంది. భక్తులు ముందుగా సరయూనదిలో స్నానమాచరించి అనంతరం ఆలయాలను దర్శిస్తారు. శ్రీరామచంద్రమూర్తి ఈ సరయూనది లోనే లీనమైపోయింది.

సరయూనది వెంట అనేకస్నానఘట్టాలు ఉన్నాయి. అందులో ప్రధానమైంది రామ్ ఘాట్. దీన్నే స్వర్గద్వారం అని కూడా అంటారు. ఇందులో స్నానమాచరిస్తే ఇహంలో సౌఖ్యం, పరంలో మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. రామ్‌ఘాట్ కు కొద్దిదూరంలోనే లక్ష్మణ్ ఘాట్ ఉంది. ఇందులో పూర్వం లక్ష్మణుడు స్నానమాచరించినట్లు చెబుతారు. కొలనులలాంటి చిన్నచిన్నకుండాలు అనేకం ఉన్నాయి. వీటిలో స్నానమా చరించడంవల్లకూడా పుణ్యఫలాలు కలుగుతాయి. వీటిలో ప్రధానమైంది వశిష్ఠకుండం.

సరయూనదికి కొద్దిదూరంలో పురాతనమైన శ్రీఆంజ నేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం 76 మెట్లు కలిగి ఎత్తుగా కోటలాగా దర్శనమిస్తుంది. శ్రీరాముడు అంజనాదేవి ఒడిలో ఉన్న హనుమంతుడిని దర్శించి, పూజించడంవల్ల సంతానంలేని వారికి సంతానభాగ్యం కలుగుతుందని, చిన్నతనం నుండి బాధించే అనారోగ్యసమస్యలు ఉండవని భక్తులవిశ్వాసం.



హనుమంతుడి దేవాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో రామ్ కోట్ ఉంది. అంటే శ్రీరాముడు నివాసం ఉన్న భవనం. దీన్ని సంవత్సరానికి ఒక్కసారి శ్రీరామనవమి రోజున మాత్రమే తెరచి, విశేషఉత్సవాలు నిర్వహిస్తారు.



రామ్ కోట్ పక్కనే ఉన్న సందులో కనకభవన్ ఉంది. దీన్ని సోనేకి ఘర్ అనే పేరుతో పిలుస్తారు. ఇది కైకేయికి చెందింది. కైకేయి దీన్ని సీతాదేవికి బహుమానంగా ఇచ్చిందట. ఇందులో శ్రీసీతారాములవారి బంగారుకవచవిగ్రహాలతో పాటు శ్రీరాముడి కుటుంబసభ్యులమూర్తులను దర్శించవచ్చు. ఈ కనక



భవన్ అంతా వెండిరేకులతో తాపడం చేయబడి ఉంది. ఇందులో ఉన్న దేవతామూర్తులతో పాటు, శిల్పకళకూడా భక్తులకు నయనానందాన్ని కలిగిస్తుంది.

కనకభవన్‌కు కొద్దిదూరంలో రావణవధానంతరం అయోధ్యకు వచ్చిన శ్రీరాముడు తొలిసారిగా భరతుడిని కలసిన ప్రాంతమైన భరత్ మిలాప్ ఆలయాన్ని, దశరథుడు నివాసం, పరిపాలన కేంద్రం, సింహాసనం ఉన్న ప్రాంతమని చెప్పే దశరథ మందిరం, శ్రీరాముడి పాదుకామందిరాలను దర్శించవచ్చు. వీటితో పాటు వాల్మీకిరామాయణభవనం, రామ్‌కథా మ్యూజియం, అంగద్‌ధిల్లా, సుగ్రీవధిల్లా, తులసీస్మారక భవనం, బ్రహ్మకుండం, లక్ష్మణఖిల్లా, జానకీమహల్, నాగేశ్వరనాథ ఆలయం, శేషమహల్, వేదభవన్, గోవిందరాజమందిరం, బిర్లామందిరాలను భక్తులు సందర్శించవచ్చు.

ప్రతిరోజు అసంఖ్యాకభక్తులు దర్శించుకునే అయోధ్య క్షేత్రంలోని వివిధఆలయాల్లో శ్రీరామనవమిసందర్భంగా ప్రత్యేకపూజలు ఉత్సవాలు జరుగుతాయి. వీటితోపాటు శ్రావణ మాసం ఉత్సవాలు, అక్టోబరు, నవంబరు నెలల్లో పరిక్రమ మేళా, సరయుస్నానోత్సవాలు, నవంబరులో శ్రీరామవివాహం, రామాయణమేళాలు, జూన్, జూలై నెలల్లో రథయాత్ర మొదలైన ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

అయోధ్యలో కనకభవన్ ధర్మశాల, బిర్లాధర్మశాల, గుజరాత్‌భవన్ ధర్మశాల, రామచరితమానస్ ధర్మశాలలలో భక్తులకు వసతిసౌకర్యాలు లభిస్తాయి. అయోధ్యకు ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఫైజాబాద్‌లోని ప్రైవేట్ లాడ్జిలలో కూడా వసతిసౌకర్యాలు లభ్యమౌతాయి.

మొఘల్ సరాయ్- లక్నో ప్రధాన రైలుమార్గంలో ఉన్న అయోధ్యరైల్వేస్టేషన్‌లో రైళ్లన్నీ ఆగుతాయి. లక్నో, ముంబై, వారణాసి, అలహాబాద్, అహ్మదాబాద్, ఢిల్లీ మొదలైన నగరాల నుంచి రైలుసౌకర్యాలు ఉన్నాయి.

లక్నో, గోరక్‌పూర్, అలహాబాద్, వారణాసి, అయోధ్యకు బస్సుసౌకర్యాలుకూడా ఉన్నాయి. మనరాష్ట్రం నుంచి కాశీయాత్రకు వెళ్లేవారు అయోధ్యనుకూడా దర్శించడం సులభతరం. వారణాసిలోని ఆంధ్రాశ్రమంవారిని సంప్రదించి నట్లయితే అయోధ్యయాత్రను ఏర్పాటు చేస్తారు. దర్శించి తిరిగి సాయంత్రానికి వారణాసి చేరుకోవచ్చు.

సర్వపాపాలను హరించి, అనంతపుణ్యాలను ప్రసాదించే దివ్యక్షేత్రంగా పేరు పొందిన అయోధ్యను దర్శించి భక్తులు తరించవచ్చు.

# శ్రీరామనవమి పూజావిధానం



(ప్రాతఃకాలంలో నిద్రలేచి, స్నానాది నిత్యకృత్యాలు ఆచరించి, శుద్ధుడై, తులసీపుష్పఫలాది పూజాద్రవ్యాలను ఏర్పరచుకొని- శ్రీరాముని పటానికి గానీ, విగ్రహానికిగానీ యథావిధి పూజించాలి.)

శ్రీకేశవాదినామాలతో ఆచమనీయం చేసిన తరువాత, ప్రాణాయామం చేసి సంకల్పించుకోవాలి.

మమ ఉపాత్త దురితక్షయద్వారా శ్రీపరమేశ్వరప్రీత్యర్థం శుభే శోభనే ముహూర్తే శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః ద్వితీయపరార్థే శ్వేతవరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరతవర్షే భరతఖండే మేరోః.... దిగ్భాగే, శ్రీశైలస్య.... ప్రదేశే, గంగా గోదావర్యోః మధ్యదేశే, అస్మిన్ వర్తమానవ్యావహారికచాంద్ర మానేన స్వస్తిశ్రీ శ్రీశుభకృత్‌నామసంవత్సరే ఉత్తరాయణే వసంతఋతౌ చైత్రమాసే శుక్లపక్షే నవమ్యాం... వాసరే శుభనక్షత్ర శుభయోగ శుభకరణ ఏవంగుణ విశేషణ విశిష్టాయాం శ్రీమాన్... గోత్రః ధర్మపత్నీ సమేతః.... నామధేయః, శ్రీమతః... గోత్రస్య... నామధేయస్య సహకుటుంబస్య క్షేమస్థైర్య ధైర్యఆయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధ్యర్థం, జాంబవత్సుగ్రీవ హనుమ లక్ష్మణ భరత శత్రుఘ్న పరివారసమేత శ్రీసీతారామచంద్రదేవతా ప్రీత్యర్థం, శ్రీసీతారామ చంద్రదేవతాప్రసాదసిద్ధ్యర్థం శ్రీరామనవమీ ప్రయుక్త షోడశోపచారపూజాం కరిష్యే... (అని సంకల్పించుకొని కలశారాధన చేసి- కలశంపై చేతి నుంచి)

శ్లో॥ కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్రః సమాశ్రితః।
మూలే తత్ర స్థితో బ్రహ్మా మధ్యే మాతృగణాః స్థితాః॥

కుక్షౌతు సాగరా స్సర్వే సప్తద్వీపా వసుంధరా।
ఋగ్వేదోఽథయజుర్వేద స్సామవేదో హ్యథర్వణః॥

అంగైశ్చ సహితా స్సర్వే కలశాంబుసమాశ్రితాః।
గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి।
నర్మదే సిన్ధు కావేర్యా జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥

–(కలశజలాన్ని పుష్పంతోగాని, తులసితోగానీ, తీసుకొని దైవప్రతిమపై ప్రోక్షించి, తనపై చల్లుకుని, పూజా ద్రవ్యాలపైనా చల్లి)

ఆదౌ నిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం
శ్రీమహాగణపతిపూజాం/ విష్వక్సేనపూజాం కరిష్యే

–(గణపతిని పూజించాక) పూర్వసంకల్పిత శ్రీసీతారామచంద్రపూజాం కరిష్యే (–అని పూజారంభం చేయాలి.)

**ధ్యానం**

వామే భూమిసుతా పురస్తు హనుమాన్ పశ్చాత్సుమిత్రాసుతః।
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయోః వాయ్వాదికోణేషు చ॥
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్తారాసుతో జాంబవాన్।
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్॥

శ్లో॥ కందర్పకోటిలావణ్యం– మందస్మితశుభేక్షణమ్।
మహాభుజం శ్యామవర్ణం– సీతారామం భజా మ్యహమ్॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః ధ్యానం సమర్పయామి.

**ఆవాహనం**

శ్రీరామాగచ్ఛ భగవన్– రఘువీర నృపోత్తమ!
జానక్యాసహ రాజేంద్ర– సుస్థిరో భవ సర్వదా.

శ్లో॥ రామచంద్ర మహేష్వాస– రావణాంతక రాఘవ
యావత్పూజాం వసానకం– తావ త్త్వం సన్నిధిం కురు.

శ్లో॥ రఘునాయక రాజర్షే– నమో రాజీవలోచన
రఘునందన మే దేవ– శ్రీరామాభిముఖో భవ

శ్రీసీతారామచంద్ర పరమాత్మనే నమః ఆవాహయామి

## సింహాసనం

రాజాధిరాజరాజేంద్ర- రామచంద్ర మహాప్రభో!
రత్నసింహాసనం తుభ్యం- దాస్యామి స్వీకురు ప్రభో॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః నవరత్నఖచిత సింహాసనం సమర్పయామి

## పాద్యం

త్రైలోక్యపావనానంత- నమ స్తే రఘునాయక
పాద్యం గృహాణ రాజర్షే - నమో రాజీవలోచన॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః పాదయోః పాద్యం సమర్పయామి

## అర్ఘ్యం

పరిపూర్ణపరానంద - నమో రాజీవలోచన
గృహాణార్ఘ్యం మయా దత్తం - కృష్ణ విష్ణో జనార్దన॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి

## ఆచమనం

నమో నిత్యాయ శుద్ధాయ - బుద్ధాయ పరమాత్మనే
గృహాణాచమనం రామ - సర్వలోకైకనాయక!

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః ముఖే ఆచమనం సమర్పయామి

## మధుపర్కం

నమః శ్రీవాసుదేవాయ- బుద్ధాయ పరమాత్మనే
మధుపర్కం గృహాణేదం- రాజరాజాయ తే నమః

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః మధుపర్కం సమర్పయామి

## పంచామృతస్నానం

క్షీరం దధి ఘృతం చైవ - శర్కరా మధు సంయుతమ్।
సిద్ధం పంచామృతస్నానం - రామ! త్వం ప్రతిగృహ్యతామ్॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః పంచామృతస్నానం సమర్పయామి

## శుద్ధోదక స్నానం

బ్రహ్మాండోదర మధ్యస్థం- తీర్థైశ్చ రఘునందన!
స్నాపయిష్యా మ్యహం భక్త్యా- సంగృహాణ జనార్దన!

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః స్నానానంతరం ఆచమనీయం సమర్పయామి

## వస్త్రం -

సంతప్తకాంచనప్రఖ్యం - పీతాంబరయుగం శుభమ్
సంగృహాణ జగన్నాథ - రామచంద్ర నమోఽస్తుతే॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః వస్త్రయుగ్మం సమర్పయామి. అనంతరం ఆచమనీయం సమర్పయామి. యజ్ఞోపవీతం సమర్పయామి.

## యజ్ఞోపవీతం

అజ్ఞానధ్వంసనం నృణాం ప్రజ్ఞాకరమనుత్తమమ్।
ధర యజ్ఞోపవీతం మే వాంఛితార్థఫలప్రద॥

## ఆభరణాని

కౌస్తుభం హార కేయూర- రత్నకంకణనూపురాన్
ఏవమాదీ నలంకారాన్- గృహాణ జగదీశ్వర।

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః ఆభరణాని సమర్పయామి

## గంధం

కుంకుమాగరుకస్తూరీ- కర్పూరై ర్మిశ్రసంభవమ్
తుభ్యం దాస్యామి దేవేశ- శ్రీరామ స్వీకురు ప్రభో!

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః శ్రీగంధం సమర్పయామి

## పుష్పం

తులసీకుందమందారజాతీపున్నాగచంపకైః
నీలాంబుజైర్బిల్వదలైః పుష్పమాల్యైశ్చ రాఘవ!
పూజాయిష్యా మ్యహం భక్త్యా సంగృహాణ జనార్దన!

శ్రీసీతారామచంద్రపరమాత్మనేనమః నానావిధ పరిమళపత్ర పుష్పాణి సమర్పయామి.

## వనమాలా

తులసీ కుంద మందార - పారిజాతాంబుజైర్యుతామ్
వనమాలాం ప్రదాస్యామి - గృహాణ జగదీశ్వర!

శ్రీసీతారామచంద్రపరమాత్మనేనమః వనమాలాం సమర్పయామి.

## అంగపూజా

*(పాదాలనుండి శిరస్సువరకు పూజించాలి)*

| | | |
|---|---|---|
| శ్రీరామాయ నమః | - పాదౌ పూజయామి | (పాదాలు) |
| శ్రీరామభద్రాయ నమః | - జంఘే పూజయామి | (పిక్కలు) |
| శ్రీరామచంద్రాయనమః | - జానునీ పూజయామి | (మోకాళ్లు) |
| శ్రీశాశ్వతాయ నమః | - ఊరూ పూజయామి | (తొడలు) |
| శ్రీరఘువల్లభాయ నమః | - కటిం పూజయామి | (నడుము) |
| శ్రీదశరథాత్మజాయ నమః | - ఉదరం పూజయామి | (కడుపు) |
| శ్రీకౌసలేయాయనమః | - నాభిం పూజయామి | (బొడ్డు) |

శ్రీలక్ష్మణాగ్రజాయ నమః - వక్షఃస్థలం పూజయామి (రొమ్ము)
శ్రీకౌస్తుభాభరణాయ నమః - కంఠం పూజయామి (గొంతు)
శ్రీరాజరాజాయ నమః - స్కంధౌ పూజయామి (భుజాలు)
శ్రీకోదండధరాయ నమః - బాహూ పూజయామి (చేతులు)
శ్రీభరతాగ్రజాయ నమః - ముఖం పూజయామి (ముఖము)

శ్రీపద్మాక్షాయ నమః - నేత్రే పూజయామి (కళ్లు)
శ్రీసీతారామాయ నమః - కర్ణౌ పూజయామి (చెవులు)
శ్రీసర్వేశ్వరాయ నమః - శిరః పూజయామి (తల)

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః సర్వాణ్యంగాని పూజాయామి
(తర్వాత శ్రీరామాష్టోత్తరశతనామపూజ చేయాలి)

## శ్రీరామ అష్టోత్తరశత నామావళిః

ఓం శ్రీరామాయ నమః
ఓం రామభద్రాయ నమః
ఓం రామచంద్రాయ నమః
ఓం శాశ్వతాయ నమః
ఓం రాజీవలోచనాయ నమః
ఓం శ్రీమతే నమః
ఓం రాజేంద్రాయ నమః
ఓం రఘుపుంగవాయ నమః
ఓం జానకీవల్లభాయ నమః
ఓం జైత్రాయ నమః 10
ఓం జితామిత్రాయ నమః
ఓం జనార్దనాయ నమః
ఓం విశ్వామిత్రప్రియాయ నమః
ఓం దాంతాయ నమః
ఓం శరణత్రాణతత్పరాయ నమః
ఓం వాలిప్రమథనాయ నమః
ఓం వాగ్మినే నమః
ఓం సత్యవాచే నమః
ఓం సత్యవిక్రమాయ నమః
ఓం సత్యవ్రతాయ నమః 20
ఓం వ్రతధరాయ నమః
ఓం సదాహనుమదాశ్రితాయ నమః
ఓం కౌసలేయాయ నమః
ఓం ఖరధ్వంసినే నమః
ఓం విరాధవధపండితాయ నమః
ఓం విభీషణపరిత్రాత్రేయ నమః
ఓం హరకోదండ ఖండనాయ నమః
ఓం సప్తసాలప్రభేత్రే నమః
ఓం దశగ్రీవశిరోహరాయ నమః
ఓం జామదగ్న్యమహాదర్పదళనాయ నమః 30
ఓం తాటకాంతకాయ నమః
ఓం వేదాంతసారాయ నమః
ఓం వేదాత్మనే నమః
ఓం భవరోగస్యభేషజాయ నమః
ఓం దూషణత్రిశిరోహంత్రేనమః
ఓం త్రిమూర్తయే నమః
ఓం త్రిగుణాత్మకాయ నమః
ఓం త్రిలోకాత్మనే నమః
ఓం త్రిలోకరక్షకాయ నమః
ఓం పుణ్యచారిత్రకీర్తనాయనమః 40
ఓం ధన్వినే నమః
ఓం దండకారణ్యకర్తనాయ నమః
ఓం అహల్యాశాపశమనాయ నమః
ఓం పితృభక్తాయ నమః
ఓం వరప్రదాయ నమః
ఓం జితేంద్రియాయ నమః
ఓం జితక్రోధాయ నమః
ఓం జితామిత్రాయ నమః
ఓం జగద్గురవే నమః
ఓం ఋక్షవానరసంఘాతినే నమః 50
ఓం చిత్రకూటసమాశ్రయాయ నమః
ఓం జయంతత్రాణవరదాయ నమః
ఓం సుమిత్రాపుత్రసేవితాయ నమః
ఓం సర్వదేవాదిదేవాయ నమః
ఓం మృతవానరజీవనాయ నమః
ఓం మాయామారీచహంత్రే నమః
ఓం మహాదేవాయ నమః
ఓం మహాభుజాయ నమః
ఓం సర్వదేవస్తుతాయ నమః
ఓం సౌమ్యాయ నమః 60
ఓం బ్రహ్మణ్యాయ నమః
ఓం మునిసంస్తుతాయ నమః
ఓం మహాయోగినే నమః
ఓం మహోదారాయ నమః
ఓం సుగ్రీవేప్సితరాజ్యదాయ నమః
ఓం సర్వపుణ్యాధికఫలాయ నమః
ఓం స్మృతసర్వాఘనాశనాయ నమః
ఓం ఆదిపురుషాయ నమః
ఓం పరమపురుషాయ నమః
ఓం మహాపురుషాయ నమః 70
ఓం పుణ్యోదయాయ నమః
ఓం దయాసారాయ నమః
ఓం పురాణాయ నమః
ఓం పురుషోత్తమాయ నమః
ఓం స్మితవక్త్రాయ నమః
ఓం మితభాషిణే నమః
ఓం పూర్వభాషిణే నమః
ఓం రాఘవాయ నమః
ఓం అనంతగుణగంభీరాయ నమః
ఓం ధీరోదాత్తగుణోత్తమాయ నమః 80
ఓం మాయామానుషచారిత్రాయ నమః
ఓం మహాదేవాదిపూజితాయ నమః
ఓం సేతుకృతే నమః
ఓం జితవారాశయే నమః
ఓం సర్వతీర్థమయాయ నమః
ఓం హరయే నమః
ఓం శ్యామాంగాయ నమః
ఓం సుందరాయ నమః
ఓం శూరాయ నమః
ఓం పీతవాససే నమః 90
ఓం ధనుర్ధరాయ నమః
ఓం సర్వయజ్ఞాధిపాయ నమః
ఓం యజ్వనే నమః
ఓం జరామరణవర్జితాయ నమః
ఓం విభీషణప్రతిష్ఠాత్రే నమః
ఓం సర్వావగుణవర్జితాయ నమః
ఓం పరమాత్మనే నమః
ఓం పరస్మై బ్రహ్మణే నమః
ఓం సచ్చిదానందవిగ్రహాయ నమః
ఓం పరస్మై జ్యోతిషే నమః 100
ఓం పరస్మై ధామ్నే నమః
ఓం పరాకాశాయ నమః
ఓం పరాత్పరాయ నమః
ఓం పరేశాయ నమః
ఓం పారగాయ నమః
ఓం పారాయ నమః
ఓం సర్వదేవాత్మకాయ నమః
ఓం పరస్మై నమః 108

శ్రీరామాష్టోత్తరశతనామావళీ
పూజాంసమర్పయామి

**ధూపం**

వనస్పత్యుద్భవై ర్దివ్యై - ర్నానాగంధై స్సుసంయుతః
ఆఘ్రేయ స్సర్వదేవానాం - ధూపోఽయం ప్రతిగృహ్యతాం

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః ధూపమాఘ్రాపయామి

**దీపం**

జ్యోతిషాంపతయే తుభ్యం - నమో రామాయ వేధసే
గృహాణ దీపకం రాజన్ - త్రైలోక్య తిమిరాపహమ్॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః దీపం దర్శయామి

**నైవేద్యం**

ఇదం దివ్యాన్నమమృతం రసైషడ్భిః సమన్వితమ్।
శ్రీరామచంద్ర రాజేంద్ర! నైవేద్యం ప్రతిగృహ్యతామ్।

(విధి ప్రకారంగా నివేదనం చేయాలి)
మధ్యే మధ్యే పానీయం సమర్పయామి.

"అమృతాపి ధానమసి"ఉత్తరాపోశనం సమర్పయామి.
హస్తౌ ప్రక్షాళయామి. ముఖప్రక్షాళనం సమర్పయామి.
పాదౌప్రక్షాళయామి. శుద్ధాచమనీయం సమర్పయామి.

**తాంబూలం**

నాగవల్లీదళైర్యుక్తం - పూగీఫలసమన్వితమ్।
తాంబూలం గృహ్యతాం రామ! కర్పూరాదిసమన్వితమ్॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనేనమః తాంబూలం సమర్పయామి.
తాంబూలచర్వణానంతరం ఆచమనీయం సమర్పయామి.

**నీరాజనం**

మంగళం విశ్వకల్యాణ! - నీరాజన మిదం హరే
సంగృహాణ జగన్నాథ - రామభద్ర నమోఽస్తు తే

శ్రీసీతారామచంద్ర పరమాత్మనే నమః నీరాజనం దర్శయామి.
నీరాజనానంతరం ఆచమనీయం సమర్పయామి.

ఇష్టప్రాప్తికీ, అనిష్ట పరిహారానికీ పూజ చక్కని ప్రక్రియ. పండుగలలో, ప్రత్యేకపర్వదినాలలో ఆయా దేవతలను విశేషంగా ఆరాధించడం మన సంప్రదాయం. అందుకే 'సప్తగిరి' సంప్రదాయబద్ధంగా ఉన్న పూజావిధానాలను ప్రత్యేక సందర్భాలలో భక్తుల సౌకర్యార్థం ప్రచురిస్తోంది. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శ్రీరామనవమి పూజావిధానాన్ని కానుకగా అందిస్తోంది. దీన్ని ఆచరించినవారు శ్రీరామ చంద్రుని కృపతో ఐహికాముష్మికాలు పొందగలరు!

**మంత్రపుష్పం**

నమో దేవాదిదేవాయ - రఘునాథాయ శార్ఙ్గిణే
చిన్మయానందరూపాయ - సీతాయాః పతయే నమః ॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః సువర్ణ దివ్యమంత్ర పుష్పం సమర్పయామి.

**ప్రదక్షిణ నమస్కారం**

యాని కాని చ పాపాని - జన్మాంతరకృతాని చ
తాని తాని ప్రణశ్యంతి - ప్రదక్షిణ పదేపదే

అన్యథా శరణం నాస్తి - త్వమేవ శరణం మమ
తస్మాత్కారుణ్యభావేన - రక్ష రక్ష రఘూత్తమ!॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారం సమర్పయామి.

**పుష్పాంజలి**

దాశరథాయ విద్మహే।
సీతానాథాయ ధీమహి।
తన్నో రామః ప్రచోదయాత్ ॥

శ్రీసీతారామచంద్రపరమాత్మనే నమః పుష్పాంజలిం సమర్పయామి

**ఉత్తరపూజా**

శ్రీజాంబవత్సుగ్రీవ హనుమత్ లక్ష్మణ భరతశత్రుఘ్న పరివారసహిత శ్రీసీతారామచంద్రపరబ్రహ్మణే నమః

ఛత్రం ధారయామి - చామరైః వీజయామి
గీతం శ్రావయామి - నృత్యం దర్శయామి
ఆందోళికాం ఆరోహయామి - అశ్వం ఆరోహయామి
గజం ఆరోహయామి - సమస్త రాజోపచార (దేవోపచార) భక్త్యుపచార శక్త్యుపచార పూజాం సమర్పయామి.
యస్య స్మృత్యా చ నామోక్త్యా - తపఃపూజాక్రియాదిషు
న్యూనం సంపూర్ణతాం 'యాతి - సద్యోవన్దే త మచ్యుతమ్ ।
మంత్రహీనం క్రియాహీనం - భక్తిహీనం రఘూత్తమ!
యత్పూజితం మయా రామ! - పరిపూర్ణం తదస్తు తే

అనయా ధ్యానావాహనాదిపూజయా శ్రీసీతారామచంద్ర దేవః సుప్రీతః సుప్రసన్నోః వరదో భవతు- (అని అక్షతలు, నీళ్ళు, విడిచి పెట్టి నమస్కరించి) సర్వం శ్రీసీతారామచంద్రార్పణ మస్తు (అని చెప్పాలి)



# శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండి!

– శ్రీ ఎస్.టి.జి. అంతర్వేది కృష్ణమాచార్యులు, 99123 55423

భద్రాచల శ్రీరామచంద్రస్వామికి జరిగే ఉత్సవాలలో విశేషవిఖ్యాతి పొందిన ఉత్సవం శ్రీరామనవమి. ఆనాడు త్రేతాయుగంలో శ్రీవిలంబినామ సంవత్సరంలో చైత్రశుద్ధనవమి పునర్వసు నక్షత్ర కర్కాటకలగ్నంలో అభిజిత్‌వేళ కౌసల్యాదేవికి శ్రీరాముడు జన్మించాడు. అలా రాముడు జన్మించిన చైత్రశుద్ధ నవమితిథి శ్రీరామనవమిగా రాజిల్లుతోంది.

*"యస్యావతారసమయే తస్య' కల్యాణ మాచరేత్"*– ఏ దేవునియొక్క అవతారం ఏరోజున జరిగిందో ఆరోజునే ఆ దేవుడికల్యాణం ఆచరించాలి అన్న శ్రీపాంచరాత్ర ఆగమవచనానుసారం శ్రీరాముడి కల్యాణం శ్రీరామనవమినాడు ఆరంభించిన ఘనత భద్రాద్రికే దక్కింది. దానికి శ్రీకారం చుట్టిన మహాయశస్సు భక్తరామదాసుదయింది. అలా రామదాసు ఏర్పరచిన ఆ వ్యవస్థ నేటికీ అభంగరీతిలో సర్వాంగసుందరంగా ఆచరించబడుతోంది. ఒక్కొక్క సంవత్సరం నవమినిర్ణయంలో ముందు వెనుకలు వచ్చినప్పటికీ భద్రాద్రిలో అది ఏరోజైతే నిర్ణయించబడి శ్రీరామకల్యాణం జరుగుతుందో, ఆరోజే ప్రపంచమంతటా శ్రీసీతారామ కల్యాణం జరుపుకునే ఒక విశిష్టఆచారం అమలులోకి వచ్చింది.

ఇంతటి ప్రత్యేకతను సంతరించుకున్న శ్రీరామనవమికల్యాణం వసంత (చైత్ర శుక్ల) పక్షంలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆచరించబడుతోంది. శుద్ధసప్తమితో ఆరంభమై పూర్ణిమతో పరిసమాప్తి చెందే ఆ మహోత్సవాలలో మహాద్భుతంగా కొనసాగే ఉత్సవం శ్రీరామనవమి.

శ్రీరామనవమి ముందురోజు సాయంకాలం ఎదుర్కోలు ఉత్సవం మరునాడు జరిగే కల్యాణానికి అంగంగా జరుగుతుంది. శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను ఎదురెదురుగా వేంచేపుచేసి, వారిగుణ గణాలను భక్తానందభరితంగా పండితులు సంవాదం చేస్తారు. తదనంతరం శుభలగ్నపత్రికాపఠనం కావిస్తారు. మాలాపరివర్తనం, వస్త్రసమర్పణం, మంగళహారతితో ఎదుర్కోలు ఉత్సవం సుసంపన్నమౌతుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్రదేవదాయ, ధర్మదాయ శాఖామాత్యులు, అధికారులు, వేలాదిభక్తజనం పాల్గొంటారు.

శ్రీరామనవమిరోజు తెల్లవారుజామున 2 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు. సుప్రభాత, అభిషేక, ఆరాధనాదులు ముగిసిన తరువాత ధ్రువమూర్తులకు (మూలవర్లకు) కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఇది ఉదయం 8 గం॥ల నుండి 9 గం॥ల వరకు కొనసాగుతుంది. అటుపై మంగళ వాద్యాల నడుమ, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ, అర్చక, అధికారాదిపరిజనపరివేష్టితుడైన



శ్రీస్వామివారి ఉత్సవమూర్తి పల్లకీపై ఊరేగింపుగా మిథిలాస్టేడియంలో కమనీయశిల్పసంపదతో శోభాయమానంగా వెలుగొందే కల్యాణమంటపానికి వేంచేస్తాడు.

## విలక్షణ అంశం

తొలిగా విష్వక్సేనపూజతో ఆరంభమయ్యే కల్యాణసంరంభం మంగళహారతితో సమాప్తి అవుతుంది. ఈ మధ్యలో అనేకవిశేషఘట్టాలు, విలక్షణసన్నివేశాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా ప్రస్తావించుకోవాల్సిన అంశం ప్రవరలు. ఇతరత్ర రాముడికి వశిష్టగోత్రం, సీతాదేవికి గౌతమగోత్రం చెబుతారు. కానీ భద్రాచలంలోని సీతారాములకు సౌభాగ్య, అచ్యుతగోత్రాలు పఠిస్తారు. దానికి కారణం భద్రాచలంలో ఉన్న శ్రీరాముడు రామావతారపరిసమాప్తి తరువాత, భద్రమహర్షి తపఃఫలంగా చతుర్భుజరాముడిగా, వామాంకంలో సీతతో, వామపార్శ్వంలో లక్ష్మణుడితో కలిసి పర్వతంగా మారిన భద్రుడిపై నెలకొన్నాడు. యోనిజులైతే ఋషిగోత్రం, అయోనిజులైతే అచ్యుతగోత్రం చెప్పాలనే శ్రీపాంచరాత్ర సంప్రదాయాన్ని అనుసరించి శ్రీలక్ష్మీనారాయణులకు, శ్రీరంగనాథుడికి, శ్రీనృసింహుడికి– కల్యాణాలలో చెప్పినట్టే సీతాదేవికి సౌభాగ్యగోత్రాన్ని, శ్రీరాముడికి అచ్యుత గోత్రాన్ని భద్రాచలంలో పఠిస్తున్నారు. ఇది ఒక విలక్షణ మైన అంశం.

## ప్రత్యేక ఆభరణాలన్నీ పెండ్లిలోనే..

శ్రీస్వామివారికి పాదప్రక్షాళనం చేసిన తరువాత, త్యాగరాజాది రామభక్తులకు సైతం ఆదర్శమైన భక్తరామదాసు చేయించిన ఆభరణాలైన పచ్చలపతకం, చింతాకుపతకం, శ్రీరాముడికి, సీతకు సమర్పిస్తారు. అలాగే ఆనాడు రామదాసుగారు బందీఖానలో ఉండగా సాక్షాత్తు శ్రీరామలక్ష్మణులే తానీషా దగ్గరకి సిపాయిల రూపాలలో వెళ్ళి, రామదాసు ఆలయం నిర్మించటానికి ఆరులక్షల వెండికాసులు వ్యయం చేస్తే, ఆరులక్షల బంగారు రామమాడలను



రామలక్ష్మణులు తానీషాకి చెల్లించి, రామదాసును చెరనుండి విడిపించారు. అదిగో ఆ చరిత్రకు సాక్ష్యంగా, శ్రీరాముడే అనుగ్రహించి వెళ్ళిన శ్రీరామమాడను శ్రీలక్ష్మణస్వామికి సమర్పిస్తారు. ఈ ఘట్టంకూడా ఎంతో విశేషమైంది.

## మూడుమంగళసూత్రాలు

అదేవిధంగా మరో ముచ్చటైన అంశం. మూడో అంశం– మూడు తాళిబొట్ల అంశం. ఇతరత్ర ఎక్కడ చూచినా వివాహాలలో రెండు తాళిబొట్లు మాత్రమే దర్శనమిస్తాయి.





కానీ, భద్రాచలంలో శ్రీరామనవమి నాడు సీతామాతకు సమర్పించే మంగళసూత్రంలో మూడుతాళిబొట్లు ఉంటాయి. మామగారు దశరథమహారాజు చేయించిన ఒక తాళిబొట్టు, తండ్రిజనక మహారాజు చేయించిన మరో తాళిబొట్టు, సీతమ్మ తల్లిని తన కూతురుగా భావించి, భక్తరామదాసుచేయించిన తాళిబొట్టుతో కలిపి మూడు మంగళసూత్రాలను సీతమ్మవారికి సమర్పిస్తారు.

## జానకిదోసిట కెంపుల ప్రోవై...

తెలుగువారివివాహవేడుకలలో దర్శనమిచ్చే గుడజీరకధారణం మాంగల్య ధారణకు ముందు జరుగుతుంది. మాంగల్యధారణ తరువాత జరిగే అక్షతారోపణం చారిత్రకమైన, మత సామరస్యమైన మహత్వపూర్ణమైన అంశంతో ముడిపడి ఉన్న అద్భుత ఘట్టం. వివాహవేడుకలలో పోసుకునే తలంబ్రాలు పసుపురంగులో ఉంటాయి, కానీ, శ్రీరామనవమినాడు భద్రాద్రిలో జరిగే శ్రీసీతారాములకల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు ఎర్రరంగులో ఉంటాయి. ఆనాడు రామదాసును ఖైదుచేశానని పశ్చాత్తప్తుడైన తానీషా ప్రభువు ప్రతిఏటా శ్రీరామనవమినాడు జరిగే శ్రీసీతారాములకల్యాణానికి గులాలు (బుక్కాగులాల్), పట్టుబట్టలు, ముత్యాలతలంబ్రాలను పంపించాడు. అదే సంప్రదాయం నేటికి కొనసాగుతూ తెలంగాణా రాష్ట్రప్రభుత్వం పక్షాన గౌరవ ముఖ్యమంత్రివర్యులు ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తున్నారు.



అలా గులాములను అక్షతలలో కలుపు తారు కాబట్టే అవి ఎర్రరంగులో ఉంటాయి. ఇది చారిత్రకాంశమైతే వైదికమైన అంశం శ్రీరాముడు సూర్యవంశసముద్భవుడు. సూర్యుడికి ప్రియమైనవి ఎరుపురంగులో ఉండే అక్షతలు. కాబట్టి శ్రీసీతారామ కల్యాణంలో ఎర్రటి అక్షతలను వాడతారు. చాలామంది ఈ అక్షతలను తమ వివాహసమయంలో సీతారాముల అనుగ్రహంగా భావించి శిరస్సున ధరిస్తారు. మరికొందరు తమ ఇంట అవి ఉండడమే శుభప్రద మని భావిస్తారు.



## చూచువారలకు చూడముచ్చట

ఇలా భద్రాచలంలో శ్రీరామనవమి నాడు జరిగే శ్రీసీతారాములకల్యాణం విశేష, విలక్షణాంశసమాహారమై, నయనానందకరమై, జగదానందకారకమై దర్శించేవారిని మధురానుభూతుల వాహినిలో ముంచుతుంది.



ఆదర్శదంపతులైన సీతారామచంద్రుల దివ్యానుగ్రహాన్ని పంచుతుంది. శ్రీరామనవమినాడు జరిగే శ్రీసీతారాములకల్యాణాన్ని భద్రాద్రిలో ఎవరు వీక్షిస్తారో వారికి అక్షయమైన అశ్వమేధయాగఫలితం లభిస్తుందని బ్రహ్మపురాణం చెబుతోంది!

*అందుకేనేమో.. ఎన్ని తరాలు గడిచినా, సీతారామకల్యాణం వన్నెతరగని మహోత్సవంగా విరాజిల్లుతోంది. ఆ రోజున పసుపు వర్ణశోభితుడైన భద్రాద్రిరామయ్య సొగసు వర్ణించనలవి కాదు. 'ఎంతెంతో వైభవమో.. శ్రీరామచంద్రా నీ సొగస్సు...' అంటూ ఆస్థానవిద్వాంసులు గానం చేస్తుండగా జానకీలక్ష్మణసమేతుడైన రామయ్యకు అర్చకులు నుదుటన తిలకం, బుగ్గపై కాటుక, పట్టువస్త్రాలు ధరింపచేశాక, పెళ్లికళ సంతరించుకున్న రామయ్య దర్శనంతో భక్తుల జన్మలు పునీతమౌతాయి!*

# వేదాలు రక్షింపగ తరలీ వచ్చితివా...

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 88975 47548

దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయడంకోసం పరంధాముడు ఎన్నో అవతారాలెత్తాడు. సాధారణంగా అవతారం అంటే జన్మించడం (పుట్టడం) అనుకుంటారు. కానీ అది సరైనభావన కాదు. కర్మవశాత్తు పుట్టడాన్ని జన్మించడం అంటారు. తన సంకల్పానికి అనుగుణంగా పుట్టడాన్ని అవతరించడం అంటారు. శ్రీమహావిష్ణువు వేదాలను రక్షించడంకోసం 'మత్స్యావతారం' ధరించాడు.


చాక్షుష మన్వంతరం తర్వాత ఏర్పడనున్న జలప్రళయం నుండి తనభక్తులు, మహర్షులను కాపాడి, సత్యవ్రత మహారాజును వైవసత్వమనువుగా చేసి, బ్రహ్మదేవునినుండి వేదాలను అపహరించిన హయగ్రీవుడనే రాక్షసుణ్ణి వధించి, ఆ వేదాలను తిరిగి బ్రహ్మకు అందించటం విష్ణువు మత్స్యావతారపరమార్థం.

## అవతారగాథ

సత్యవ్రతుడు గొప్ప విష్ణుభక్తుడు. ఇతడు ధర్మతత్పరుడై దేశాన్ని సుభిక్షంగా, ప్రజలను కన్నబిడ్డలవలే పరిపాలిస్తున్నాడు. ఇతడు కేవలం జలంమాత్రమే ఆహారంగా తీసుకుంటూ, కఠోర తపస్సు చేయాలనే సంకల్పంతో కృతమాలికా నదీతీరానికి చేరుకుంటాడు. స్నానం పూర్తి చేసుకుని, అర్ఘ్యం ఇవ్వటం కోసం దోసిట్లోకి నదీజలం తీసుకుంటాడు. అందులో దివ్య కాంతులతో ప్రకాశించే ఒక చిన్నచేపపిల్ల వచ్చింది. అది చూచి సత్యవ్రతుడు ఎంతగానో ఆశ్చర్యం చెంది, వెంటనే ఆ చేపపిల్లను నీళ్లలోకి జారవిడవబోయాడు.

అప్పుడు ఆ చేపపిల్ల "మహారాజా! నన్ను రక్షించు. మిక్కిలి పసిదాన్ని అయిన నన్ను ఇలా ఒంటరిగా వదలేస్తే నదిలోని పెద్దచేపలు నన్ను మింగే ప్రమాదం ఉంది. అందుకే అతికష్టం మీద వాటిబారినుండి తప్పించుకుని నీ దోసిటిలో వాలాను. దయతో నన్ను కాపాడి పుణ్యం కట్టుకో" అని అర్థించింది. ఆ చేపపిల్ల మాట్లాడటం చూచి రాజు మరింత ఆశ్చర్యపోయాడు. ఆ చేపపిల్లపై జాలిపడి దానికోరిక ప్రకారం తన కమండలంలో దాన్ని ఉంచి మందిరాన్ని చేరుకున్నాడు. ఆ మర్నాడు ఉదయం చూడగా చేపపిల్ల కమండలమంత కాగా, ఆ రాజు దానిని ఒకపెద్ద నీళ్లపాత్రలో వేయించాడు. కొద్ది క్షణాల్లోనే ఆ చేప పాత్ర పట్టనంత ఎదిగింది. దీంతో మహారాజు దిగ్భ్రాంతి చెందాడు. రాజభటులను రప్పించి, దానిని భద్రంగా ఒకచెరువులో వేయించగా, మరొక్కక్షణంలోనే ఆ చేప ఆ చెరువుకూడా పట్టనంత పెద్దదిగా మారిపోయింది.

ఇదంతా చూచిన రాజుకు ఇదేదో మహావిష్ణువుమాయో లేక తనకు పెట్టిన పరీక్షయో అని భావించాడు.



ఏమైనా రక్షణ కోరిన ప్రాణిని విడిచిపెట్టడం ధర్మం కాదు కదా! అని రాజు అనేకవిధాలుగా ఆలోచించి, దానిని ఒక పెద్దనదిలో వదిలాడు. అక్కడకూడా చేప తనప్రభావం చూపించింది. నది మొత్తాన్ని ఆక్రమించింది. రాజు శ్రీమహావిష్ణువును ప్రార్థించి అతికష్టంమీద తనభటులచేత దానిని మహాసముద్రంలోకి విడిచిపెట్టించాడు.

అప్పుడు ఆ చేప సముద్రమంతటి రూపం ధరించి, "ఓ రాజా! ఎన్నో క్రూరమైన మొసళ్లు, జలచరాలు ఉండే ఈ సముద్రంలోకి తిరిగి నన్ను వదలడం నీకు ధర్మమా?" అని ప్రశ్నించింది. అప్పుడు సత్యవ్రతుడు "ఓ మహామీనమా! నీవు సామాన్యమైనదానవు కావు. రోజుకు శతయోజనాలు విస్తరించ గల నీవంటి మత్స్యాన్ని నేనెప్పుడూ చూడలేదు. కనీసం విన లేదు. ఆ శ్రీమహావిష్ణువే ఈ చేపరూపంలో నన్ను పరీక్షించటం కోసం వచ్చినట్లుగా తోస్తున్నది. దయతో నన్ను అనుగ్రహించు" అని చేతులు జోడించి భక్తితో ప్రార్థించాడు.

అప్పుడు చేపరూపంలోనున్న శ్రీమహావిష్ణువు రాజుకు తన నిజరూపంతో ప్రత్యక్షమయ్యాడు. వెంటనే సత్యవ్రతుడు ఆ మహామీనావతారమూర్తిని స్తోత్రం చేశాడు.

"రాజా! ఏడురోజుల్లో ప్రళయం రానున్నది. సకల జీవకోటి నశిస్తుంది. ఇప్పుడు చాక్షుష మన్వంతరం నడుస్తున్నది. కాబట్టి వేదాలు, విద్యలు, బీజాలు, నేను, బ్రహ్మదేవుడు నీ రక్షణ పొందాల్సి ఉంది. ఇక్కడ సప్తఋషులతో కూడిన ఓ నావ ఉంటుంది. నీటిమీద తేలుతూ అనంతు డనేసర్పం ఇక్కడికి చేరుతుంది. దాన్ని తాడు చేసి, ఆ నావను నా కొమ్ముకు కట్టి వెయ్యి. నేను మిమ్మల్ని కాపాడతాను" అని చెప్పి అంతర్ధానం అయ్యాడు–శ్రీమహావిష్ణువు. స్వామి చెప్పినసమయం రాగానే సత్యవ్రతుడు ఓషధులన్నీ తీసుకుని నావను చేరుకుంటాడు. అంతా సురక్షితులైన తర్వాత మత్స్యం అంతర్ధానమౌతుంది.

**దిద్దుబాటు–** 1) ఫిబ్రవరి,2022 సంచికలో బాలవినోదం– 'మీకు తెలుసా?' శీర్షికలో వామనావతారం 'మూడవఅవతారం'గా పొరబాటుగా ప్రచురితమైంది. దీనిని ఐదవఅవతారంగా చదువుకోగలరు. 2) మార్చి,2022 సంచికలో బాలవినోదం, 'కదంబం' శీర్షికలో 'చతుర్దశ భువనాలు'లో 'తపస్‌లోకం'బదులు 'తపోలోకం' అని, 'వైకుంఠపాళి'లో 18 అడ్డం 'ధ్వని' అన్న పొరబాటును 'స్త్రీ' అని చదువుకోగలరు!

**–ప్రధానసంపాదకుడు**

### వైకుంఠపాళి
### :: 75 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 పం | | 2 పం | చ | 3 జ | ను | డు | | 4 చై |
| చ | | క్తి | | న | | | | త్ర |
| 5 వ | ర్ష | | 6 మూ | కు | డు | | 7 ఈ | ము |
| టి | | 8 స | | డు | | 9 సు | | |
| | 10 న | వ | మి | | 11 చి | ర | జీ | 12 వి |
| 13 పు | | ర్ణ | | 14 స | | స | | శ్వా |
| 15 న | ల | | 16 సు | ర | థ | | 17 ని | మి |
| ర్వ | | 18 స్వా | | మ | | 19 సు | | త్రు |
| సు | | 20 హ | స్తి | | 21 సు | మం | త్రు | డు |

ఈ మత్స్యమే అవతారమూర్తిగా లోకాలచేత పూజలందుకుంటున్న మత్స్యావతారమూర్తి.

## జ్ఞానస్వరూపుడు

సృష్టిలోని ప్రతిప్రాణీ పరమాత్మస్వరూపం అనే జ్ఞానాన్ని మత్స్యావతారం మనకు అందిస్తుంది. లోకంలో జ్ఞానం అంతర్హితమైనప్పుడు పరమాత్మ స్వయంగా వేదోద్ధరణ చేస్తాడని కూడా ఈ అవతారగాథ తెలియజేస్తుంది. ఈ అవతారం ద్వారా శ్రీమన్నారాయణుడు బ్రహ్మదేవుడికి సృష్టిచేయటానికి అవసరమైన శక్తిని, జ్ఞానాన్ని అందించాడు. పరమాత్మద్వారా లోకానికి అందిన వేదాలు సర్వోన్నతమైన విజ్ఞానగ్రంథాలుగా నిలిచి, మానవ మహాభ్యుదయానికి గట్టి పునాదులు అయ్యాయి.

## యంత్రాల్లో అగ్రపీఠం

పూజల్లో ఉపయోగించే యంత్రాల్లో అత్యంత ప్రాచుర్యం పొందినయంత్రం మత్స్యయంత్రం. మయబ్రహ్మ దీన్ని తయారుచేశాడు. వాస్తుదోషాలనివారణకు, శల్యదోషాల నివారణకు ఈ యంత్రాన్ని ఉపయోగిస్తారు. నూతనంగా చేసే ప్రతి నిర్మాణంలోనూ ఈ యంత్రాన్ని తప్పనిసరిగా ఉంచుతారు. దీనివల్ల స్థలంలో ఉండే వాస్తుదోషాలన్నీ తొలగిపోతాయి.

# ఇక్కడ తప్ప మరెక్కడా లేదు!

- డా॥ చింతకుంట శివారెడ్డి, 94408 59872

ఎన్నోమహత్తర పుణ్యక్షేత్రాలు వెలసిన వై.ఎస్.ఆర్.కడప జిల్లాలోని అద్భుతక్షేత్రం ఒంటిమిట్ట. 1356 నుండి 1377 వరకు పరిపాలించిన బుక్కరాయల సోదరులు కంపరాయలు ఉదయగిరిని పాలిస్తూ ఒంటిమిట్ట ప్రాంతంలో పర్యటించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒంటెడు, మిట్టడు అనే ఇద్దరన్నదమ్ములు అక్కడ ప్రవహిస్తున్న నీటి ధారను చూపించి విశ్రాంతి తీసుకోడానికి ఇది సరియైన స్థలమని తెలిపారు. అప్పుడు కంపరాయలు అక్కడి పర్వతాలను చూచి చెఱువునిర్మాణానికి అనుకూలమైన ప్రదేశంగా గుర్తించి, చెఱువును నిర్మించాల్సిందిగా ఆదేశించాడు. అప్పుడు ఆ అన్నదమ్ములు ఒక రామాలయాన్ని కూడా నిర్మించమని కోరగా, వారి పర్యవేక్షణలోనే ఆ ప్రాంతంలో రామాలయాన్ని నిర్మించి, చెఱువునుకూడా త్రవ్వించారు. ఒంటెడు, మిట్టెడు సోదరుల కోరిక మేరకు ఈ గ్రామనిర్మాణం జరిగింది కావున వారి పేరుమీదనే ఒంటిమిట్టగా పిలవబడినట్లు చరిత్ర.

## ఆలయనిర్మాణ స్వరూపస్వభావాలు

ఈ ఆలయం తూర్పుపడమరలు 72 మీటర్లు, ఉత్తర దక్షిణం 46.4 మీటర్ల వైశాల్యంతో తూర్పు ముఖంగా నిర్మించబడింది. ఆలయంలో కళానైపుణ్యంతో కూడిన చిత్రాలు గోడలపై, స్తంభాలపై చిత్రించబడిఉన్నాయి. ఆలయప్రాంగణంలో బమ్మెరపోతన, వావిలికొలను సుబ్బారావుల విగ్రహాలు ఉన్నాయి.

## గర్భాలయం

చుట్టూ 4.5 మీటర్లతో చతురస్రాకారంలో గర్భాలయం ఏర్పాటు చేయబడింది. గర్భగుడి వెలుపల గోడలపై పద్మాలతో కూడియున్న చిత్రాలు ఉన్నాయి. గర్భాలయానికి ఎదురుగా ఒక ఎత్తైన ధ్వజస్తంభం, బలిపీఠాలు ఉన్నాయి.

## ఆంజనేయుని గుడి

రామాలయానికి ఎదురుగా సంజీవరాయుడుగా పిలువబడుతున్న ఆంజనేయదేవాలయం ఉంది. ఈ గుడికి ఎదురుగా ఒక ముక్తమంటపం ఏర్పాటుచేయబడింది. ఇది 16 స్తంభాలతో ఏర్పాటుచేయబడింది.

## జంటతీర్థాలు

సీతారాముల వనవాససమయంలో అడవికి వెళ్తూ ఉండగా మార్గమధ్యంలో ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చినప్పుడు సీతాదేవికి దాహంవేసింది. అప్పుడు రామలక్ష్మణులు పాతాళ



గంగమ్మ పై పైకి ఉబికివచ్చేలా బాణాలు వేశారట! వారిరువురి బాణాలవల్ల ఏర్పడ్డ తీర్థాలను రామ, లక్ష్మణతీర్థాలుగా పిలుచుకుంటారు స్థానికులు.

## కల్యాణ మంటపం

ఆలయప్రాంగణంలో 16 స్తంభాలు, మధ్యలో 4 స్తంభాలు కలిగియున్న కల్యాణమంటపం ఉంది. ఇది కాకుండా ఆలయానికి ఈశాన్యంలో 4 స్తంభాలతో కూడి యున్న ఒక మంటపం, వాయవ్యంలో 4 స్తంభాలున్న మరొక మంటపం కనబడుతుంది.

## అంచెలంచెలుగా అభివృద్ధి

బుక్కరాయలకాలంలో గుడిలో ఏకశిలావిగ్రహం ప్రతిష్ఠించేనాటికి గర్భాలయం, అంతరాళం, గర్భాలయంపైన చిన్న గోపురాలు నిర్మించబడివున్నాయి. అంతరాళమంటపానికీ, మహామంటపానికీ మధ్య ముఖమంటపం ఉంది. ఇదిచతురస్రాకారంతోచుట్టూ పదిమీటర్లవైశాల్యంతో నిర్మించబడింది. సంగమవంశీయుల తరువాత ఈ దేవాలయాన్ని సాళువ, తుళువ, ఆరవేటివంశ రాజులు పోషిస్తూవచ్చారు. సిద్ధవటాన్ని కేంద్రంగా పరిపాలించిన మట్లిరాజులు ఒంటిమిట్ట ఆలయాన్ని చాలా అభివృద్ధిచేశారు.

అనంతరాజుపరిపాలనాకాలంలో గాలిగోపురాలు నిర్మించబడ్డాయి. తూర్పువైపుగా ఉన్న గాలిగోపురం 15.1 × 11.9 మీటర్ల కొలతలతో నిర్మించబడింది. గర్భాలయం ఎదురుగా దీర్ఘచతురస్రాకారంలో 17.7×14.4 మీటర్ల కొలతతో మహామంటపాన్ని నిర్మించారు. ఈ మంటపంలో 32 స్తంభాలున్నాయి. మహామంటపం మధ్య సభాప్రాంగణం 12 స్తంభాల మధ్య ఉంది. ఆలయానికి ఒక రథాన్ని, రథాన్ని నిలిపే రథశాల నిర్మాణాలు జరిగాయి. అనంతరాజు పరిపాలన కాలంలోనే ఆలయంలో స్వామివారికి 'రథోత్సవం' ప్రారంభమైంది. ఉత్తరదక్షిణాలలో ఉన్న గోపురాలు 9.27×7.25 మీటర్ల కొలతలతో అనంతరాజు కుమారుడైన తిరువేంగళనాథుని కాలంలో నిర్మించబడ్డాయి.

గర్భాలయానికి ముందున్న జయవిజయుల విగ్రహాలను సిద్ధిరాజుకాలంలో ఏర్పాటుచేశారు. గుడికి ఆగ్నేయ దిశలో పాకశాల నిర్మించారు. ప్రాకారంలోపల ఉత్తరంవైపు తూర్పున, పడమర ఎదుర్కోలు మంటపాలు నిర్మించారు. గుడికి ఆవరణంలో రామలింగదేవుని గుడిని నిర్మించారు. ఇందులోని శివలింగాన్ని 1966లో ప్రతిష్ఠించినట్లు తెలుస్తున్నది.

సాధారణంగా రామాలయాల్లో సీతారామలక్ష్మణులతో పాటు రాముని పాదాలదగ్గర ఆంజనేయస్వామి దర్శనమిస్తాడు. కానీ, ఈఆలయంలో ఆంజనేయస్వామి కనబడడు. దేశం మొత్తం మీద హనుమలేని ఆలయం ఇదొక్కటే ఉంది. ఆ లోటును తీర్చే ప్రయత్నంగా ఆంజనేయస్వామి గుడిని తూర్పు గాలిగోపురానికి తూర్పుగా రథశాలకు పక్కగా నిర్మించారు.

ఆలయానికి నైరుతిదిశలో కల్యాణమంటపం ఉంది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో కల్యాణం ఇక్కడే నిర్వహించేవారు.



ఇక్కడ ఎక్కువమంది భక్తులు కల్యాణం తిలకించేందుకు ప్రస్తుతం గుడి ఆవరణంలోని విశాలమైన మైదానంలో జరుపుతున్నారు.

1790లో సిద్ధవటంప్రాంతం మైసూరు పాలిస్తున్న టిప్పుసుల్తాన్ ఆధీనంలోకి వచ్చింది. ఆ సమయంలో ఒంటిమిట్టలో తుకిడీ అమీల్ అక్బర్‌బేగ్ అనే మహమ్మదీయుడు ఒంటిమిట్టలో ఒక బురుజు నిర్మించుకున్నాడు. ఈయనకు దగ్గరివాడు ఇమాంబేగ్ అనేవ్యక్తి. ఈ ఇమాంబేగ్‌కు ఒంటిమిట్ట గుడిమీద అభిమానం ఉండేది. ఈయన స్వామిదర్శనంకోసం గుడికి కూడా వెళ్లివచ్చేవాడు. ఒకసారి ఒంటిమిట్ట ప్రాంతంలో తీవ్రమైన కరవు సంభవించింది. వర్షాలు లేక రామతీర్థంలోని నీరు అడుగంటిపోయింది. ఆ సమయంలో ఇమాంబేగ్ ముందుకొచ్చి గుడికి తూర్పుగా, సోపానాలకు ఉత్తరంగా, బావి త్రవ్వించాడు. ఆ బావిలో మంచినీరు పడింది. గుడిలోని పవిత్రకార్యాలకు ఈ నీటిని ఉపయోగించుకొనేవారు. గుడిసేవకులూ, గ్రామస్థులు ఇమాంబేగ్‌ను ఎంతో కొనియాడారు. ఈయన త్రవ్వించిన ఆ బావిని నేటికీ మనం ఒంటిమిట్టలో చూడవచ్చు.

## 2022, మే నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | మే డే |
| 03 | అక్షయతృతీయ, పరశురామజయంతి |
| 05 | శ్రీరామానుజ జయంతి |
| 06 | శంకర జయంతి |
| 10 - 12 | తిరుమల శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయం |
| 13 - 21 | హృషీకేశ్, నారాయణవనం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం |
| 14 - 17 | తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవం |
| 14 | శ్రీనృసింహజయంతి |
| 15 | శ్రీకూర్మజయంతి, తరిగొండవెంగమాంబ జయంతి |
| 16 | శ్రీఅన్నమాచార్య జయంతి |
| 17 | తిరుపతి గంగజాతర |
| 23 - 31 | కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవం |
| 25 | శ్రీహనుమజ్జయంతి |

### ఈయన కృషి వల్లే...

తరువాతి కాలంలో గుడి శిథిలావస్థకు చేరుకుంటూ వచ్చింది. ఆ సమయంలో కారణజన్ములుగా అవతరించారు 'ఆంధ్రవాల్మీకి' బిరుదాంకితులు వావిలికొలను సుబ్బారావు (1863-1936). స్వామిపై గల అపూర్వమైన భక్తితో ఆలయ ప్రాంగణంలోనే నివాసం ఏర్పరచుకొని శిథిలావస్థలోనున్న ఈ క్షేత్రాన్ని పునరుద్ధరించడానికి తన జీవితాన్ని అర్పించాడు. టెంకాయచిప్ప చేతపట్టుకొని వేలమైళ్లు నడిచి డబ్బును సేకరించి, ఆలయాన్ని తిరిగి పూర్వవైభవానికి తీసుకువచ్చాడు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోనికి అనువాదంచేసి ఒంటిమిట్ట రఘు రామునికే అంకితమిచ్చాడు. వీరి కాలంలోనే విమాన గోపుర జీర్ణోద్ధారణ, గర్భాలయం, అంతరాళం నేలను బాగుచేయించడం, మహాద్వారాల తలుపులను బాగుచేయడం, సంజీవరాయస్వామి ఆలయజీర్ణోద్ధరణ, శ్రీరామసేవాకుటీరసత్రనిర్మాణం, నూతన రథశాల నిర్మాణం, శ్రీరామతీర్థజీర్ణోద్ధారణం, శృంగిశైలం మీద వాల్మీకాశ్రమం, ఇమాంబేగ్ బావిని బాగుచేయడం, గుడి ఎదుట ప్రక్కనే ఒక భవనం నిర్మించడంవంటి ఎన్నో మహత్తరమైన పనులు వాసుదాసుగారికాలంలోనే జరిగాయి.

టెంకాయచిప్పనే చేతబట్టి సేకరించిన డబ్బుతో వేయిమందికి వంట చేయదగ్గ పాత్రలు, నూటెనిమిది బంగారు కాసులమాల, నూటెనిమిది మంగళసూత్రాలహారం, ఉత్సవ మూర్తులకు కనకమయ కిరీటాలు మరికొన్ని ఆభరణాలు, వెండితో పూజా సామాగ్రిని తయారుచేయించారు. వీటితోపాటు ఒంటిమిట్టలో ఉండే ఒకఇల్లు, కడపలో వారు నివసించిన ఇల్లు(శ్రీరామచంద్రభవనం), మదరాసు తిరువళిక్కేణి యందున్న శ్రీరామజయమందిరమనే ఇంటిని మూడింటిని స్వామివారి పేరునే ధారాదత్తం చేశారు. వారు భిక్షరూపంలో సేకరించింది, శిష్యులు గురుదక్షిణగా ఇచ్చింది, తన రచనలపై వచ్చిన డబ్బు మొత్తం రెండు లక్షలరూపాయలయ్యాయి.

### కైంకర్యాలు - మాన్యాలు

ఒంటిమిట్ట ఆలయానికి బుక్కరాయలకాలంలో డెబ్బై రెండు వినియోగాలు ఏర్పాటు చేసినట్లు కల్నల్ కాలిన్ మెకంజీ గ్రామకరణాలచేత రాయించిన ఒంటిమిట్ట కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది. ఒంటిమిట్ట చెరువుకింద ఉండే పొలం ఇందుకు చెల్లుతూ ఉండేది. అర్చకులనుంచి అన్నిరకాల

పనివాండ్లకు జీవనం కింద ఈ పొలం ఇస్తారు. ఈ పొలం అనుభవించుకుంటూ, వారు స్వామికైంకర్యంలో పాల్గొంటూ ఉంటారు. నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ పర్వాదులు వీరి కాలంనుండే ప్రారంభమయ్యాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలుకూడా ఆనాటినుండే మొదలై ఉండవచ్చు.



చైత్రశుద్ధనవమి నుండి ప్రారంభమైన కల్యాణోత్సవ, రథోత్సవాలు ఆ తరువాత ఏకాంత సేవతో ముగుస్తాయి. ఈ ఉత్సవాలు పదకొండు రోజుల పాటు నిర్వహిస్తారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాంఛనాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత 2015 సం॥లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీరామనవమి ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వలాంచనాలతో జరిగేటట్లుగా నిర్ణయించింది. పట్టువస్త్రాలతో, ముత్యాల తలంబ్రాలతో రాములవారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉత్సవాలతో పాటు 20 కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధిచేయాలనే నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తీసుకుంది. **తిరుమల తిరుపతి దేవస్థానం** పరిధిలోకి ఈఆలయం వచ్చిన తరువాత స్వామివారి కల్యాణం, ఇతరముఖ్యమైన శుభకార్యాలను తి.తి.దే. అర్చకులు, అధికారుల సమక్షంలో దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది.




గుర్తించిన తేడాలు ఈ సంచికలోనే ఉన్నాయి. గమనించండి!!

# ఉగాదులన్నీ ఉషస్సులే!

– డా॥ జి.వి.పూర్ణచందు,
94401 72642

సంవత్సరం మొదటిరోజు ప్రొద్దున్నే తలంటుకుని, వేపపూవు, పంచదార, చింతపండు, నెయ్యి కలిపిన ప్రసాదాన్ని తింటే ఆ ఏడాదంతా సౌఖ్యదాయకంగా ఉంటుందని ఆర్యోక్తి. పరగడుపున వేపపూలప్రసాదం తినేపండుగ ఉగాది.

తీపికోసం బెల్లం, పులుపుకోసం చింతపండు లేదా ఇంకేదైనా పుల్లనిద్రవ్యం, ఉప్పుదనంకోసం సైంధవలవణం, కారంకోసం మిరియాలపొడి, వగరుకోసం లేత మామిడి వడ పిందెలు, చేదుకోసం వేపపువ్వు కలిపి, ఉగాదిపచ్చడి తయారు చేస్తారు. నెయ్యి కూడా కొద్దిగా కలపాలన్నారు– పెద్దలు. నెయ్యి చేరిస్తే, ఏ ఆహారపదార్థమైనా సౌమ్యంగా పనిచేస్తుంది. అశోక పత్రాలతోకూడా ఒకప్పుడు ఉగాదిపచ్చడి చేసేవారు. దీన్ని 'అశోకకళికాప్రాశనం' అనేవారు.

ఆరురుచులూ తగు నిష్పత్తుల్లో ఉంటేనే అది షడ్రసోపేతమైన భోజనం. పులిహోరనే తీసుకోండి. అందులో కేవలం పులుపు, ఉప్పు, కారం మాత్రమే కలిపితే అది ఆరోగ్యానికి చెడు చేస్తుంది. వగరు, చేదు రుచులకోసం కొద్దిగా ఆవపిండిని, మెంతిపిండిని, తీపికోసం కొంచెం బెల్లాన్ని కలిపితే ఆ పులిహోర రుచి పెరగటమే కాకుండా ఆరోగ్యం కూడా! ఆరు రుచులూ లేకుండా కేవలం పులుపు, కేవలం కారం, కేవలం తీపి ఇలా తినవద్దని ఈ ఉగాదిప్రసాదం మనకు సూచిస్తోంది.



ఆధునికవైద్యశాస్త్రం విటమిన్లు, ఖనిజాలు, లవణాల్లాంటి పోషకాల తూకాన్నిబట్టి ఆహారద్రవ్యాల పోషక విలువల్ని లెక్కగడుతుంది. ఇది ఒకపద్ధతి. ఆరురుచుల సిద్ధాంతాన్ని అనుసరించే తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరురుచులూ ఉంటేనే అది పోషకాహారం అవుతుందని ఆయుర్వేదశాస్త్రం చెప్తుంది. మనభోజనంలోనూ, భోజన పదార్థాలలోనూ ఆరురుచులూ ఉండేలా చూచుకుంటేనే మనం షడ్రసోపేతమైన ధనిక, పోషకభోజనం చేసినట్టవుతుంది. ఈ వైద్యరహస్యాన్ని ఉగాది ప్రసాదం గుర్తుచేస్తోంది.

తెలుగువారిఉగాది ఊరుమ్మడిపండుగ. ఆ రోజున అందరూ కలిసి మేధాపరమైన అంశాలు పంచుకుంటారు. కవులు కవితాగానం చేస్తారు. గాయకులు, నర్తకులు, ఐంద్రజాలికులు తమవిద్యలు ప్రదర్శిస్తారు. పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు. రాశిఫలాలు తెలుసుకోవటంద్వారా తమ బతుకుబండిని ఎలా నడుపుకోవాలో ఆలోచనచేస్తారు. భవిష్యత్తుకు బాటలు వేస్తారు. ఎండలు, వానలు, గ్రహణాలు, ద్వాదశరాశుల గమనాలగురించి ఎన్నో ఏళ్లు ముందుగానే లెక్కగట్టి చెప్పగల పంచాంగకర్తలు స్మరించుకోదగ్గవారు.

ఇతరప్రాంతాల్లోని ఉగాది పండుగలకు తీపిభక్ష్యాలు చేసుకోవటం సహజం. కానీ, తెలుగువారిఉగాదికిమాత్రం వేపపూలప్రసాదమే ప్రధానం. ఆరోగ్యానికి చేదురుచి ప్రాధాన్యతను గుర్తింపచేయటమే మనవారిలక్ష్యం. ఆ ఒక్కరోజే చేదును తినాలని కాదు, ఏడాదిపొడవునా చేదును ఏదో ఒక వంటకంగా తింటూ ఉండాలనేది ఉగాదిపచ్చడిలోని ఆంతర్యం.

1 చెంచా ఇంగువ, 2 చెంచా అల్లం ముద్ద, 4 చెంచా మిరియాల పొడి, 8 చెంచాల జీలకర్ర, 16 చెంచాల పసుపు, 32 చెంచాల ధనియాలపొడి, అంతే కొలతలో అంటే 32 చెంచాలు ఎండించిన వేపపూల పొడి, వీటికి తగినంత ఉప్పు చేర్చితే కారప్పొడి రుచిగా ఉంటుంది. శరీరంలోని విషదోషాలను పోగొడుతుంది. టానిక్కులా శక్తిదాయకంగా ఉంటుంది. రోజూ అన్నంలో ఒక ఆదరవుగా తింటూ ఉంటే జీర్ణశక్తిని పదిలం చేస్తుంది. చేదురుచి ప్రాధాన్యతను గుర్తించగలిగితే ఉగాదులన్నీ మనకు ఉషస్సులే!

# మరో భద్రాద్రి

- శ్రీమతి డి.వరలక్ష్మి

విజయనగరం, పూసపాటి రాజవంశంవారు నిర్మించిన నూటఆరుఆలయాలలో శ్రీరామతీర్థం ఒకటి. ఇక్కడి ఆలయంలో నీరునిండిన పిడతలపైన ప్రమిదలను ఉంచి దీపం వెలిగించి ప్రార్థిస్తే మనోభిష్టాలు నెరవేరుతాయన్నది భక్తుల విశ్వాసం. ఇలా దీపాలు వెలిగించడానికి ఈశాన్యంలో శ్రీలక్ష్మీ నారాయణ రూపాలను నెలకొల్పారు.

తామరపుష్పాలతో, ఆకులతో పచ్చగా ఆకర్షణీయంగా ఉన్న కోనేరులో ముఖ, పాద, హస్తాలను శుభ్రం చేసుకుని ఆలయంవైపు వెళతారు- భక్తులు. ఉత్తరంవైపు రాజగోపురం ఉన్నా- ప్రధానద్వారంమాత్రం తూర్పునే! ద్వారానికి పైన గుమ్మటంలాగా ఉన్న నిర్మాణాలు... కళింగప్రాంత నిర్మాణశైలి. ద్వారంవద్ద రాతిమీద ఆలయపురాణ, చారిత్రకగాథలు కన్పిస్తాయి. ఈక్షేత్రం ద్వాపరయుగంనాటిది.

మాయాజూదంలో ఓడిన పాండవులు అరణ్యవాసానికి వెళుతున్న సమయంలో శ్రీకృష్ణుడు వారికి సీతాలక్ష్మణ సమేత శ్రీరామవిగ్రహాలను ప్రసాదించి, భక్తిశ్రద్ధలతో పూజిస్తే వనవాస కాలం చక్కగా గడిచిపోతుందని తెలిపారట! అలాగే చేస్తూ వచ్చిన పాండవులు వనవాసంచివర ఇక్కడ గడిపి, అజ్ఞాతవాసానికి వెళుతూ విగ్రహసంరక్షణ, పూజాదికాలబాధ్యత 'వేదగర్భుడు' అనే బ్రాహ్మణునికి అప్పగించారట.

నాటినుండి అనేకశతాబ్దాలపాటు ఆయనవంశం వారే ఇక్కడ నీలాచలపర్వతం పైభాగాన పాండవులు నిర్మించిన ఆలయనిర్వహణబాధ్యతలను చూచేవారు.

ఆ తర్వాత రాజకీయపరిస్థితులవల్ల వేదగర్భుని వంశీకులు విగ్రహాలను నీటిమడుగులో దాచి ఆ ప్రాంతం విడిచి వెళ్లిపోయారట. అలా సుమారు వెయ్యిసంవత్సరాలు అజ్ఞాతంగా నీటిలో ఉండిపోయిన శ్రీరాముడు తిరిగి పదిహేడోశతాబ్దంలో ఆలయప్రవేశం చేసిన ఉదంతంకూడా విశేషమైందే!


ఇక్కడికి సమీపంలోని 'కుంభిలాపురం' (నేటి కుమిలి) రాజధానిగా చేసుకుని పదహారోశతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పూసపాటివంశంవారు పాలించేవారు. నాటిప్రజలలో చాలామంది అటవీసంపదమీద ఆధారపడి జీవనం సాగించేవారు. అలాంటి వారిలో పుట్టుమూగ అయిన ముదుసలిస్త్రీకూడా ఒకరు.

ఒకనాడు ఆమె అడవిలోకి వెళ్లిన సమయంలో పెద్ద గాలులతో మహావర్షం కురిసిందట. ముసలమ్మ భయపడిపోయి ఒక చెట్టు క్రింద వానకు తడుస్తూ వణుకుతూ రామనామజపం చేయసాగిందట!

ఆ సమయంలో ఆమెకు శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చి భయపడవద్దని, వాక్కును ప్రసాదించి, తాను అక్కడికి సమీపంలో కోనేరులో ఉన్నసంగతి తెలిపాడట. వాన వెలిసిన తరువాత నగరానికి తిరిగి వచ్చిన ఆ మూగ మాట్లాడటం తెలిసినరాజు ఆశ్చర్యచకితుడై, ఆమెను తన ఆస్థానానికి పిలిపించుకున్నాడు. ఆమెద్వారా విషయం తెలుసుకొని ఆమె చెప్పిన చోటుకు తరలివెళ్లి, విగ్రహాలను వెలికి తీసి, కొండపైన, క్రింద ఆలయాలను నిర్మించారు. తీర్థంలో లభించిన శ్రీరాముడు కొలువు తీరిన క్షేత్రం కనుక **'శ్రీరామతీర్థం'** అన్న పేరొచ్చింది.

ప్రాంగణంలోనికి ప్రవేశిస్తే అంతరభాగంలో ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న నలువైపులమండపాన్ని చూస్తే బహుశా యాత్రికులు సేద తీరడానికి ఉద్దేశించి కాబోలు అనిపిస్తుంది. ఎదురుగా ధ్వజస్తంభం, బలిపీఠం. ముఖమండపంలోనికి ప్రవేశద్వారం, ప్రదక్షిణప్రాంగణంలో దక్షిణంవైపున పాత







ఉపాలయాల స్థానంలో పునఃనిర్మించిన శ్రీవైకుంఠ, శ్రీమాధవ స్వాములు కొలువై ఉంటారు. పడమరవైపున శ్రీఆండాళ్ పురాతన ఉపాలయం ఉంది. ఉత్తరాన శ్రీభూభుజంగ వరాహలక్ష్మీ నర సింహస్వామి, శ్రీవేణుగోపాలస్వామి ఉపాలయాలు ఉన్నాయి.

అమ్మవారి ఆలయంలో స్థంభాల అమరిక ప్రత్యేకంగా కనిపిస్తుంది. స్తంభాలను దగ్గర దగ్గరగా అమర్చారు. వాయవ్యంలో కల్యాణమండపం, ఈశాన్యంలో శ్రీరామక్రతు స్తంభం ఉన్నాయి.

ప్రదక్షిణ పూర్తిచేసుకొని విశాలంగా ఉన్న అర్ధమండపం దాటితే ఉన్న గర్భాలయంలో నాలుగు అడుగుల గద్దెమీద పుష్ప స్వర్ణాభరణభూషితులై శ్రీసీతాలక్ష్మణసమేతశ్రీరామస్వామి నయనమనోహరంగా దర్శనమిస్తారు. సహజంగా మూడువిగ్రహా లకు కలిపి ఒకే మకరతోరణం ఉంటుంది అన్ని ఆలయాలలో! కానీ, ఇక్కడ గమనింపదగినఅంశం ఏమిటంటే- మూడు భాగాలుగా విభజింపబడ్డ పెద్దమకరతోరణం విగ్రహాల వెనుక అమర్చడం!

క్షేత్రపాలకుడు 'శ్రీసదాశివస్వామి' ఆలయం పక్కనే ఉంది. చిన్న ఆలయం.. పెద్దలింగం. మరోసారి క్షేత్రాన్ని సంద ర్శించే భాగ్యం కలిగించమని క్షేత్రపాలకునికి వినమ్రంగా విన్నవించుకుంటే కోరిక నెరవేరుతుందని నమ్మకం.

శ్రీరామనవమి, బ్రహ్మోత్సవాలలో లక్షలసంఖ్యలో భక్తులు ఒడిశ, ఆంధ్రాప్రాంతాలనుండి వస్తారు. విశేషపూజలు, అలంకరణలు, అర్చనలు, ఆరగింపులు ఘనంగా జరుపుతారు. ఈ క్షేత్రం విజయనగరంపట్టణానికి పన్నెండుకిలోమీటర్ల దూరంలో ఉంది.



## హనుమంతుని జన్మస్థలం - అంజనాద్రి

**తిరుమలలోని పుణ్యతీర్థాలలో ఒకటైన ఆకాశ గంగతీర్థంలో అంజనాదేవి తపస్సుచేసి, ఆంజనే యుడిని పుత్రునిగా పొందినట్లు పురాణకథనం.**

**ఆకాశగంగకు సమీపంలోని దేవాలయంలో శ్రీఅంజనాదేవి, శ్రీబాలాంజనేయస్వామివారి ఆలయా లున్నాయి. ఈ ప్రాంతానికి తిరుమల ఆర్.టి.సి. బస్ స్టాండ్ నుండి బస్సు సౌకర్యం ఉంది. ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని తి.తి.దే. నిర్ణయించింది.**




# నమ్మినోళ్లకు నమ్మినంత..

- శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి రాజు, 93936 62821

పాతికేళ్లక్రితం జరిగిన సంఘటన ఇది. చిత్తూరుజిల్లా పుత్తూరు ఈశ్వరాపురం గ్రామం మాది. తిరుమలకొండకెళ్లి మొక్కుబడి చెల్లించాలని, స్వామివారిదర్శనం చేసుకోవాలని మా ఇంట్లో వాళ్లం అనుకున్నాం. ఒక శనివారంనాడు అందరం ఉపవాసం ఉండి, ఇంట్లో పూజచేసుకుని బస్సుకోసం రోడ్డు వద్దకు వెళ్ళాం. పుత్తూరునుంచి తిరుమలకు నేరుగా వెళ్లే బస్సు అది. చేయియెత్తితే టక్కున బ్రేకువేస్తాడు- డ్రైవర్. అలాంటిది ఆరోజు బస్సునిండా జనం ఉన్నారని బస్సును ఊరివద్ద ఆపకుండానే వెళ్లిపోయాడు.

మాతో పాటు రోడ్డు పైకి వచ్చిన ఊరిపిల్లోల్లు 'ఎట్ల చేసేదబ్బా' అని బాధ పడినారు. 'బ్యాగులన్నీ మోసుకుని వయసైన అమ్మానాన్నలతో పాటు తిరుపతి వెళ్లి, అక్కడినుంచి కొండ బస్సు ఎక్కేది వీళ్లకి కష్టమైన పనికదా' అని ఆలోచిస్తూ అక్కడే నిలబడ్డారు. మాకు ఏమి చేయాలో తెలియక గోవింద నామ స్మరణలు చేస్తూ ఉండిపోయాం.

ఇంతలో ఒక కారు ముందరి టైరు పంక్చర్ కావడంతో జిగ్‌జాగ్‌గా ప్రయాణిస్తూ వచ్చిరోడ్డు పక్కగా నిలిచింది. అందులో యువజంట ప్రయాణిస్తూ ఉన్నారు. 'కొత్త కారు టైరు అప్పుడే ఎలా పంక్చర్ అయ్యిందబ్బా' అని దిగి చూచారు. కారుయజమానికి డ్రైవింగ్ అయితే తెలుసు కానీ, డిక్కీలోని స్టెప్నీ మార్చడం చేత కాదు. ఎవరైనా సహాయం చేస్తారేమోనని దిక్కులు చూచాడు. 'అయ్యో, మన ఊరికాడికొచ్చిన కారు పంక్చర్ అయ్యిందే' అని పిల్లోల్లంతా తలా ఒక చేయి వేసి స్టెప్నీ బిగించారు. సంతోషపడిన యజమాని డబ్బులు ఇవ్వబోయాడు. అయితే అందరూ వద్దంటే వద్దని బదులిచ్చారు.



అతడు డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంటూ మమ్మల్ని చూచి "కొండకు వెళ్తున్నారా" అని అడిగాడు. అవునని సమాధానమిచ్చాము. "పాండిచ్చేరిలో కారుకొనుక్కుని దైవదర్శనానికని కొండకు వెళ్తున్నాము, మీరు కూడా రావచ్చు, వెనుక సీట్లు అన్నీ ఖాళీ" అని చెప్పాడు. మేము ముగ్గురం సంతోషంగా కారులో ఎక్కి కూర్చున్నాము.

దైవలీల కాకుంటే బస్సు మాకు మిస్సు కావడమేమిటి, కొత్త కారు టైరు మా ముందరే పంక్చర్ కావడమేమిటి, వారు మాకు అభిమానంగా లిఫ్టు ఇవ్వడమేమిటి.. అని ఆలోచిస్తూ కొండకి వెళ్ళాం. దైవాన్ని నమ్మి చెడినవాడు లేడని మాకు అర్థమయ్యింది. స్వామివారిదర్శనం చేసుకుని, మా బస్సు ఛార్జీలడబ్బును హుండీలో వేసి వెనుదిరిగాం.

*ఓం నమో వేంకటేశాయ!!*

# ఈ ఉత్సవంలో ఎన్నో విశేషాలు!

– జమదగ్ని

ఆర్షపథగాములు అనవరతం ఆరాధించే అరుదైన క్షేత్రం శ్రీశైలం. ఈ మహాక్షేత్రంలో జరిగే పలుఉత్సవాల్లో ఏటా చైత్రమాసంలో అమ్మవారికి జరిగే కుంభోత్సవం ఎంతో ప్రత్యేకం. ఈ కుంభోత్సవం ఎన్నో విశేషాలతో ముడిపడి ఉంది.

## సాత్త్వికబలి సమర్పణకు...

ప్రతిసంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారాలలో (ఏ రోజు ముందుగా వస్తే ఆ రోజు) ఈ కుంభోత్సవం జరుగుతుంది. శ్రీభ్రమరాంబా అమ్మవారికి సాత్త్వికబలి సమర్పించేందుకు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. భారీగా గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నంరాశి మొదలైనవి అమ్మవారికి బలిగా సమర్పించడం ఈ ఉత్సవసంప్రదాయం.

శ్రీశైలంలోని స్థానికులందరూ ఈ ఉత్సవాన్ని తమ ఊరిపండుగ(క్షేత్రపండుగ)గా భావిస్తారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారిఆలయ మంతా పలురకాలపుష్పాలతో, నిమ్మకాయ దండలతో, వేపమండలతో అలంకరించబడుతుంది.

## విశేషపూజలన్నీ ఏకాంతంలోనే..

కుంభోత్సవం రోజున ముందుగా అమ్మవారికి ప్రాతః కాలపూజలు యథావిధిగా జరుగుతాయి. తరువాత అర్చకులు నవావరణపూజ, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ, అష్టోత్తర పూజలను, జపపారాయణలను చేస్తారు. సంప్రదాయాన్ని అనుసరించి ఈ పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంలో నిర్వహించబడతాయి. కుంభోత్సవం కారణంగా ఆ రోజు తెల్లవారుజాము నుండే అమ్మవారి ఆలయతలుపులు మూసి వేయబడి ఉంటాయి. సాయంకాలం సూర్యాస్తమయం అయిన తరువాతనే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

## రజక రంగవల్లి

కుంభోత్సవంరోజున అమ్మవారికి విశేషపూజలు జరిగిన తరువాత (సుమారుగా ఉదయం 9 గంటలసమయంలో) అమ్మవారి అంతరాలయప్రవేశద్వారంవద్ద రజకునిచేత ప్రత్యేకంగా ముగ్గును వేయిస్తారు. దీనికే 'రజకరంగవల్లి' అని పేరు. పసుపుకుంకుమలతో అలంకరించబడి ప్రత్యేకంగా కనిపించే ఈ ముగ్గు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

ముగ్గు వేయడం పూర్తయిన వెంటనే అర్చకస్వాములు అంతరాలయంలోని శ్రీచక్రానికి పూజాదికాలు చేస్తారు. ఆ తరువాత ప్రదక్షిణమండపంలో అమ్మవారికి ఎదురుగా ఉంచబడిన గుమ్మడికాయలు, కొబ్బరికాయలపై పసుపుకుంకుమలు చల్లి, తొలివిడత సాత్త్వికబలిని సమర్పిస్తారు.

నగారా, జేగంట, కొమ్ము, శంఖనాదాల నడుమ, భక్తులందరూ బిగ్గరగా అమ్మవారి నామస్మరణచేస్తూ వసంతం నింపిన





గుమ్మడికాయలను, కొబ్బరికాయలను నేలకేసి గట్టిగా కొడుతూ, నిమ్మకాయలను సగానికి కోస్తూ ఈ సాత్త్వికబలిని వేస్తారు.

ఈ సాత్త్వికబలి పూర్తయిన తర్వాత ఆలయ దక్షిణ ప్రాకారకుడ్యంపై గల మహిషాసురమర్దని అమ్మవారికి పూజాదికాలను చేసి, 108 కొబ్బరికాయలు సమర్పిస్తారు. దీనికే 'కోటమ్మపూజ' అని పేరు.

## స్వామివారికి అన్నాభిషేకం

కుంభోత్సవంరోజు సాయంకాలం స్వామివారికి ప్రదోషకాలపూజలు పూర్తయిన తరువాత, ఎంతో విశేషంగా



అన్నాభిషేకాన్ని జరిపి, స్వామివారిమూలమూర్తిని పూర్తిగా పెరుగన్నంతో కప్పివేస్తారు.

## సాత్త్వికబలిగా అన్నపురాశి

స్వామివారికి అన్నాభిషేకం ముగిసిన వెంటనే అమ్మవారిఆలయం ప్రదక్షిణమండపంలో అమ్మవారికి ఎదురుగా వండిన అన్నాన్ని సాత్త్వికబలిగా వేస్తారు. దీనికే 'కుంభరాశి' అని పేరు. ఈ అన్నాన్ని 108 కేజీల బియ్యంతో వండుతారు. ఇదే సమయంలో అమ్మవారి ఆలయప్రధానద్వారంవద్ద (సింహమండపం ముందు) స్థానికభక్తులు 508 కేజీల బియ్యంతో వండిన అన్నాన్ని పెద్దరాశిగా పోసి, బలిగా సమర్పిస్తారు.

## కుంభహారతి

కుంభోత్సవం రోజున సూర్యాస్తమయం అయిన వెంటనే ఉత్సవంలోని ప్రధానఘట్టం ప్రారంభమౌతుంది. ఒక పురుషుడు, చీరను ధరించి, స్త్రీవేషంలో అమ్మవారికి హారతిని తీసుకొని



వస్తాడు. స్వామి, అమ్మవార్ల సహస్రదీపాలంకరణ సేవామండపం నుండి భాజాభజంత్రీలతో ఈ హారతి తీసుకుని రావడం జరుగుతుంది. దీనికే 'కుంభహారతి' అని పేరు.

ఈ హారతిని తెచ్చేటప్పుడు స్త్రీవేషధారిముఖం కనపడకుండా చీరకొంగుతో ముఖానికి ముసుగువేస్తారు. కుంభహారతి గర్భాలయం వద్దకు చేరుకున్న వెంటనే అర్చకులు గర్భాలయద్వారాలు తెరుస్తారు. ఆ వేషధారి అమ్మవారికి హారతిని సమర్పించి, అమ్మవారి తొలిదర్శనాన్ని చేసుకుంటాడు. అంటే అమ్మవారిని మొదటగా దర్శించుకునేది ఈ స్త్రీవేషధారే!

## శాంతి ప్రక్రియ

కుంభహారతి సమర్పించే సమయంలో అర్చక స్వాములు గర్భాలయం వెలుపలినుండి అమ్మవారికి పసుపు, కుంకుమలను (ఒక్కొక్కటి 21 కేజీలుగా) దోసిళ్లతో సమర్పిస్తారు. ఈ పసుపు కుంకుమలు అమ్మవారిముందు పెద్దరాశిగా కనిపిస్తాయి. దీన్నే 'శాంతిప్రక్రియ' అంటారు.

## బలిసమర్పణ

శాంతిప్రక్రియ జరుగుతున్నప్పుడే, అమ్మవారికి రెండవ విడత సాత్త్వికబలి సమర్పించబడుతుంది. ఈ ఉత్సవంలో మొత్తం మీద 600 కేజీలకు పైబడి వండినఅన్నం, 1116 గుమ్మడికాయలు, దాదాపు మూడువేల కొబ్బరికాయలు, అధిక సంఖ్యలో నిమ్మకాయలు అమ్మవారికి సాత్త్వికబలిగా సమర్పించ

బడతాయి. ఈ బలిసమర్పణ అయిన తర్వాత రాత్రి 9గంటలవరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

మొత్తం మీద ఈ ఉత్సవంరోజు అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా ఎంతో కోలాహలంగా ఉంటుంది.



## మహానివేదన

భక్తుల దర్శనాలు పూర్తయ్యాక సుమారుగా రాత్రి 10 గంటల సమయంలో అమ్మవారికి పునఃపూజలు చేసి 9 రకాల పిండివంటలతో చేసే మహానివేదనతో ఈఉత్సవం ముగుస్తుంది.

## నిజరూపదర్శనం

ఎనిమిది చేతులలో వివిధ ఆయుధాలను ధరించి ఉన్న భ్రమరాంబాదేవివారు ప్రతిరోజూ అలంకారమూర్తిగా దర్శన మిస్తారు. అమ్మవారికి స్వర్ణముఖకవచం అలంకరింపబడి ఉంటుంది. అయితే సంవత్సరంలో ఒక్క కుంభోత్సవం రోజున మాత్రమే అమ్మవారిముఖానికి కవచాలంకరణ ఉండదు. ఆ రోజున భక్తులు అమ్మవారి నిజరూపదర్శనాన్ని చేసుకోవచ్చు. అమ్మవారి నిజరూపదర్శనంతో భక్తులందరూ పులకించిపోతారు.

ఇక్కడి స్థానికగిరిజనులు భ్రమరాంబాదేవివారిని తమ ఆడపడుచుగా, మల్లికార్జునస్వామివారిని తమ అల్లునిగా భావి



స్తారు. వీరి ఈ విశ్వాసాన్ని తెలియజెప్పే జానపదగాథకూడా ఎంతో ప్రసిద్ధం. ఆలయప్రాకారకుడ్యం మీద ఈ కథను తెలియజెప్పే శిల్పం కనిపిస్తుంది. అందుకే వీరు కుంభోత్సవాన్ని తమ ఇంటిపండుగగా భావించి, ఎంతో ఆనందోత్సహంతో ఈ ఉత్సవంలో పాల్గొంటారు.

**39వ పేజీలోని..**
**'తేడాలు గుర్తించండి'కి జవాబులు**



# ప్రణీతకు పుష్కరశోభ!

- ఆచార్య కోలవెన్ను మలయవాసిని,
73311 41505

జీవం ఉద్భవించింది నీటిలో. జీవులు పరిణమించింది నీరు ఆధారంగా. మానవ వికాసానికి మూలం నీరు. జనావాసాలు ఏర్పడేది జలప్రవాహాల సమీపంలో. విశిష్టసంస్కృతులు రూపుదిద్దుకున్నది నదీమతల్లుల ఆశ్రయంలోనే. జలజలపారే ఆ నీరే నది. ఆ నది తన మనుగడకు మూలమైన పంచభూతాలలో జలం కలిగి ఉన్నందున విశేషమైన గౌరవం, భక్తి ప్రదర్శించాడు మానవుడు. భారతదేశంలో నదులపట్ల ఉన్నంత భక్తిశ్రద్ధలు ప్రపంచంలో మరెక్కడా కనిపించవు.

నది లేకుంటే తన మనుగడ లేదని మనిషి అర్థం చేసుకున్న తర్వాత ఆ భక్తి మరింత పెరిగింది. నదిని గౌరవించి, పూజించే జీవనవిధానం ఏర్పరిచారు- భారతీయమునులు, ఆధ్యాత్మికచింతనాపరులు.


ఒక నదిలో మునకవేసేందుకు అవకాశం కల్పించే పుష్కరనిర్వహణం అనాదిగా జరుగుతోంది. కోట్లాదిమంది పవిత్రనదీతీరాలకు ఒక చోటుకు చేరటం అనేది మిగిలిన సంస్కృతులకు అంతుపట్టని విషయం. తరతరాలుగా వస్తున్న ఆ సంస్కృతీసంప్రదాయాలను చూచి అబ్బురపడుతుంటారు- విదేశీయులు. మనదేశంలో నదులే నాగరకతకు పుట్టినిల్లు. సింధునదీ ఆధారంగా హరప్పా, మొహంజదారోలో విలసిల్లిన సంస్కృతి, నాగరకత మనకందరికీ తెలిసిందే. వేదసంస్కృతికి ఆధారం గంగానదీతీరం.

అత్యంతపవిత్రపుణ్యక్షేత్రాలు నదుల ఒడ్డునే వెలశాయి. నేటికీ ప్రధాన నగరాలన్నీ నదీతీరంలో పెరిగినవే. ఉత్తర, దక్షిణ భారతదేశాల మనుగడకు, దేశఆహార, ఆర్థికపుష్టికి మూలం నదీజలాలు. ఎందరివో జీవితాలు నదీజలాలతో ముడిపడున్నాయి. జీవసంపదకు నిలయాలు నదీజలాలు.

నదులను తల్లులుగా పూజించి, తమ ఉనికిని ఫలానా నదులమధ్య అని మంత్రంలో చెప్పకుని, పూజలు ప్రారంభించటంద్వారా తమ భక్తిశ్రద్ధలను భారతీయులు ప్రకటించేవారు.

## నదికి నమస్కరిద్దాం

నినదిస్తూ ప్రవహించేది నది. దేహం ఆరోగ్యంగా ఉండాలంటే రక్తం ప్రవహించే రక్తనాళాలు ఎంతముఖ్యమో- దేశం సుసంపన్నంగా ఉండాలంటే జలాలు ప్రవహించే జీవనదులు అంతే ముఖ్యం! "గంగ-నర్మద-సరస్వతి-యమున-గోదావరి-కృష్ణ-కావేరి-భీమరథి- బ్రహ్మపుత్ర- తుంగభద్ర-సింధు-ప్రణీతా" అనే పన్నెండునదులు-12 రాసులలో బృహస్పతి(గురువు) పుష్కరుడితో కలిసి సంచరించే కాలాలు "పుష్కరకాలాలు"గా నిర్దేశింపబడ్డాయి.



నదులకు మానవుల జీవనయానానికి పోలికలు చెబుతుంటారు. నది ఎక్కడో పుట్టి ముళ్లను, రాళ్లను ఒడిదుడుకులను అధిగమిస్తూ, తన ప్రవాహప్రాంతాలకు ఇంత జలదానం చేస్తూ, సాగి సాగి, సంద్రంలో సంగమించిపోతుంది. సముద్రంలో కలవకముందువరకూ నదులకు వివిధ నామధేయాలుంటాయి. సముద్రంలో కలిశాక స్వరూపనామభేదాలుండవు. నదులన్నీ సముద్రమైపోతాయి. జీవుడు కూడా తాను జన్మించిన తరువాత జీవనగమనంలో కష్టసుఖాలను అనుభవిస్తూ సాటివారికింత సాయపడుతూ ఆత్మరూపంలోని తాను చివరగా పరమాత్మలో కలిసిపోతాడు. అప్పుడు తనకున్న పూర్వపు నామరూపాలు, స్థితిగతులు ఏవీ మిగలకుండా తన ఆత్మ పరమాత్మతో ఐక్యమౌతుంది. నదికి- మానవజీవనవిధికి దగ్గర సామ్యం మనకు దర్శనమిస్తుంది!

నదులు మనకు తల్లులు. మనదేహాల మలినాలను మన మానసాల కల్మషాలను ప్రక్షాళనం చేసి, పునీతుల్ని చేస్తాయి. జలస్పర్శ పవిత్రీకరిస్తుంది. సృష్టి పుట్టుకే జలాలనుండి ప్రారంభమైంది. వేదం "ఆపో వా ఇదగ్ం సర్వం" అంటూ నీరే ఈ విశ్వంలో సర్వం-సర్వస్వం-అని అభివర్ణించింది.

## 'ప్రణీత'కు ప్రణామం!

**ప్రణీతా వరదా వైన్యా గౌతమీ చ సరస్వతీ**
**నద్యః పంచ వహం త్యత్ర ప్రయాగా త్కోటిశోఽధికం**

ప్రాణహితానది, వైన్య, వరద, సరస్వతీ నదులు గోదావరిలో సంగమించే క్షేత్రంలో స్నానమాచరిస్తే... త్రివేణి సంగమక్షేత్రమైన అలహాబాదు (ప్రయాగ)లో స్నానం చేసిన దానికంటే కోటిరెట్లు అధికమైన ఫలం లభిస్తుందని స్కందపురాణంలోని కాళేశ్వర ఖండం చెబుతోంది. అంతటి ప్రత్యేకత గల క్షేత్రం కరీంనగర్‌జిల్లాలోని కాళేశ్వరం.

పవిత్రజీవనదీమతల్లిగా గుర్తింపుపొంది అధికభాగం తెలుగునేలలో ప్రవహిస్తున్న గోదావరినదికి ప్రధానమైన ఉపనది ప్రాణహిత(ప్రణీత)నది. సహ్యాద్రిపర్వతశ్రేణులు ప్రాణహితజన్మస్థలం. మహారాష్ట్రలోని అహెరివద్ద పెన్‌గంగానది వేయిన్‌గంగాతో కలుస్తుంది. మరోవైపు వేయిన్‌గంగా, వరదానదీ ప్రవాహంతో కలిసి ప్రాణహిత నదిగా రూపుదిద్దుకుని మహారాష్ట్రలోని గడ్చిరోలిజిల్లా, ఆదిలాబాద్‌జిల్లా సరిహద్దులగుండా 130కి.మీ.లు ప్రవహించి, కాళేశ్వరంవద్ద గోదావరినదిలో సంగమిస్తుంది. గోదావరి తల్లిని జీవనదిగా నిలిపేందుకు.. కాళేశ్వరంవద్ద గోదావరిలో సంగమించే ప్రాణహిత గోదారమ్మకు అండదండ నిచ్చి ఎన్నటికీ ఎండిపోకుండా "జలసిరులు" పొంగిస్తూ తనపేరును సార్థకం చేసుకుంటోంది. ఈనెల 13నుండి ప్రారంభమౌతున్న ప్రణీతానదిలో పుష్కరస్నానమాచరించి ముక్తీశ్వరుణ్ణి దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తులవిశ్వాసం!

## కాళేశ్వర క్షేత్రం



**కరీంనగర్ జిల్లా మహదేవపూర్ మండలంలో జిల్లా కేంద్రానికి 140 కి.మీ.ల దూరంలో కాళేశ్వరక్షేత్రం ఉంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతీ (అంతర్వాహిని) నదులు కలిసే ప్రాంతం కావడంతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధికెక్కింది. త్రివేణిసంగమంలో కలిసే పెన్‌గంగ, వరదానదులను కలిపి పంచగంగ అంటారు. కాళేశ్వర, ముక్తీశ్వరలింగాలుగా శివుడు ఇక్కడ ఒకే పానవట్టంపై కొలువుండటం విశేషం. ఇందులో ముక్తీశ్వరుని లింగానికి రెండు నాసికారంధ్రాలు ఉండి.. వాటిలో ఎన్ని నీళ్లుపోసినా కనిపించకుండాపోవడం ఇక్కడి మరో ప్రత్యేకత. ప్రధాన దేవాలయానికి ఆగ్నేయభాగంలో యమకోణం ఉంది. ఈ యమకోణంముందు తలవంచి పడమరనుంచి తూర్పునకూ దక్షిణంనుంచి ఉత్తరం వైపూ దూరిబయటకు వస్తే పాపాలన్నీ పరిహార మవుతాయని భక్తుల నమ్మకం.**

## శ్రీ కోదండరామస్వామివార్ల బ్రహ్మోత్సవాలు, తిరుపతి

### 2022, మార్చి 29 నుండి ఏప్రిల్ 07 వరకు



| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 29-03-22 | మంగళ | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 30-03-22 | బుధ | ధ్వజారోహణం | --- |
| 31-03-22 | గురు | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 01-04-22 | శుక్ర | సింహవాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 02-04-22 | శని | కల్పవృక్షవాహనం | సర్వభూపాల వాహనం |
| 03-04-22 | ఆది | పల్లకిలో మోహినీఅవతారోత్సవం | గరుడ వాహనం |
| 04-04-22 | సోమ | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 05-04-22 | మంగళ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 06-04-22 | బుధ | రథోత్సవం | అశ్వవాహనం |
| 07-04-22 | గురు | పల్లకీఉత్సవం, తీర్థవారి, అవభృథం, చక్రస్నానం | ధ్వజావరోహణం |

## శ్రీ పట్టాభిరామస్వామివార్ల బ్రహ్మోత్సవాలు, వాయల్పాడు (వాల్మీకిపురం)

### 2022, ఏప్రిల్ 05 నుండి 14 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 05-04-22 | మంగళ | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 06-04-22 | బుధ | ధ్వజారోహణం | --- |
| 07-04-22 | గురు | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 08-04-22 | శుక్ర | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 09-04-22 | శని | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 10-04-22 | ఆది | పల్లకిలో మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 11-04-22 | సోమ | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | కల్యాణోత్సవం/గజవాహనం |
| 12-04-22 | మంగళ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 13-04-22 | బుధ | రథోత్సవం | అశ్వవాహనం |
| 14-04-22 | గురు | పల్లకీఉత్సవం, తీర్థవారి, అవభృథం, చక్రస్నానం | ధ్వజావరోహణం |



## శ్రీ కోదండరామస్వామివార్ల బ్రహ్మోత్సవాలు, ఒంటిమిట్ట

### 2022, ఏప్రిల్ 09 నుండి 19 వరకు




| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 09-04-22 | శని | న్యాసాభిషేకం | అంకురార్పణం |
| 10-04-22 | ఆది | ధ్వజారోహణం | శేషవాహనం |
| 11-04-22 | సోమ | వేణుగానాలంకారం | హంసవాహనం |
| 12-04-22 | మంగళ | వటపత్రశాయి అలంకారం | సింహవాహనం |
| 13-04-22 | బుధ | నవనీతకృష్ణాలంకారం | హనుమత్సేవ |
| 14-04-22 | గురు | మోహినీసేవ | గరుడసేవ |
| 15-04-22 | శుక్ర | శివధనుర్బాణాలంకారం | ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం |
| 16-04-22 | శని | రథోత్సవం | --- |
| 17-04-22 | ఆది | కాళీయమర్ధనాలంకారం | అశ్వవాహనం |
| 18-04-22 | సోమ | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 19-04-22 | మంగళ | పుష్పయాగం | |

చిత్ర కథ

# శ్రీరామరక్ష సర్వజగద్రక్ష

కథ– డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ




తమకింత సామ్రాజ్యాన్ని ఇచ్చిన నా రాముడు ఈ చిన్ని మొత్తం.. ఆరులక్షల ధనం ఇవ్వలేకపోతాడా ప్రభూ!
ఖామోష్ ...ఇది పొగరు మాట. ఈతని నుండి పైకం వసూలయ్యేంత వరకు ఖైదు చెయ్యండి.
రామదాసుని ఖైదు చేసారు. జైలు అధికారులు రామదాసుని అష్టకష్టాలు పెడుతున్నారు. రాళ్ళు రప్పలు మోయిస్తున్నారు. వీటన్నిటినీ సహనంతో రామధ్యానంతో భరిస్తున్నాడు రామదాసు...
సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకమ్ము రామచంద్రా! ఆ పతకమ్మునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా...!
రామదాసు ఆర్తనాదాలను విని రామచంద్రుడు కరిగాడు, కదిలాడు. తానీషాకు కనిపించాడు.
తానీషా ప్రభూ! నేను రామోజీ, నా తమ్ముడు లక్ష్మోజీ. రామదాసుజవానులం. గోపన్న చెల్లించవలసిన సర్కార్ బాకీ పైకం మొత్తం అందుకుని రసీదివ్వండి. తెల్లవారేసరికల్లా రామదాసును విడిపించండి.
తానీషా దిగ్గున లేచి అంత:పురమంతా కలియ జూసాడు. మూసినతలుపులు మూసినట్లేఉన్నాయి. తను కల కనలేదని ఎదురుగా ఉన్న నాణేల మూట చెబుతోంది. వచ్చినవారు రామలక్ష్మణులని గ్రహించి వెంటనే చెరసాలకు బయలుదేరాడు.
రామదాసుని విడిపించండి!
రామదాసుగారూ! నన్ను క్షమించండి. ప్రభువుననే అహంకారంతో మీ భక్తిమహిమను తెలుసుకోలేక శిక్షించాను. ఇందుకు ప్రాయశ్చిత్తంగా నేటి నుండి భద్రాచలంపై సర్వాధికారాలు ప్రకటిస్తున్నాం!
2
రామలక్ష్మణులు తానీషాకి కనిపించి, రామదాసు ఋణం తీర్చి, చెరవిడిపించిన సంగతి తెలిసి ప్రజలంతా జయజయ ధ్వానాలు చేసారు.
భక్తరామదాసుకీ జై!
శుభం



## పెద్దలను బాధించరాదు

ఉసురు లేనితిత్తి యిసుమంత యూదిన,
పంచలోహములును భస్మ మౌను;
పెద్దలుసురు మంటె పెనుమంట లెగయవా?
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** ఉసురు=ప్రాణం; తిత్తి=తోలు సంచి; ఇసుము+అంత= కొంచెం; ఉసురు+అంటె= బాధపడినప్పుడు ఊపిరితిత్తుల నుండి, ముక్కులగుండా కొంచెం వేడిగాలి బయటకు వస్తుంది – దాన్ని వేడి నిట్టూర్పు అంటారు.

**భావం:** ప్రాణం లేనితిత్తితో కొద్దిగా గాలి ఊదితే కొలిమిలో అగ్ని ప్రజ్వరిల్లి, పంచలోహాలు బూడిద అవుతాయి. పెద్దలు బాధపడి ఉసూరు మంటే– అంటే ప్రాణమున్న ఊపిరితిత్తులతో శ్వాస విడిస్తే పెద్దమంటలే రేగవా?

**వివరణ:** పెద్దలు అంటే వయస్సులోనూ, జ్ఞానంలోనూ పెద్దలు. వారీలోకం నడతను గమనించినవారు. అటువంటి పెద్దలను బాధలుపెడితే– వారు తమవివేకంతో తమను కష్టపెట్టినవారికి ప్రతీకారం తలపెట్టరు. ఏమీ చేయలేకపోవచ్చు. గుండెలు నిండినతమబాధను నిట్టూర్పులతో ఊపిరితిత్తులనుండి విడిచిపెడుతుంటారు. బాధ నిండినఆనిట్టూర్పులు అగ్నిజ్వాలలై అపకారులను బూడిద చేస్తాయి. పెద్దలను ఆదరించాలని భావం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# 75 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)సాందీపుని పుత్రుణ్ణి అపహరించిన వాడు (5); 5)మరీచిభార్య(2); 6)శివుని బంటు. దైత్యుడు (3); 7)మంచు(2); 10) సీతారాముల కల్యాణం జరిగే రోజు(3); 11)విష్ణువు(4); 15)విభీషణుని కూతురు(2); 16)శిబిచక్రవర్తి తల్లి(3); 17)దత్తాత్రేయునిపుత్రుడు(2); 20)సుహోత్రుని పుత్రుడు(2); 21)దశరథుని రథసారథి(4)

### నిలువు

1)సీతారాములు ఈ వనంలో పర్ణశాలను నిర్మించుకొని నివసించారు(4); 2)సూర్యుని రథంలాగే ఓ గుర్రం(2); 3)మిథిలానగర చక్రవర్తి(4); 4)ఈ మాసంలో శ్రీరామనవమి వస్తుంది(3); 8)సముద్రుని భార్యలలో ఒకరు(3); 9)హనుమంతుని ఆశీర్వదించిన నాగమాత(3); 12)ఒక మహర్షి(5); 13)రాముని నక్షత్రం(4); 14)విభీషణుని భార్య(3); 18)అగ్నిదేవుని భార్య(2); 19) పుష్పం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

– ప్రధాన సంపాదకుడు



రక్కసుల వైరి దశరథ నందనుడు

బాలనీతి

# అద్దంలో చందమామ

– డా॥ గంగిశెట్టి శివకుమార్,
94418 95343

శ్రీ మహావిష్ణువు భూమిపై ధర్మాన్ని ప్రతిపాదించడానికి శ్రీరామునిగా అవతరించాడు. ఆదర్శకుటుంబం అంటే ఎలా ఉండాలో ఆచరణపూర్వకంగా తెలిపాడు. ఆ కుటుంబధర్మమే మనదేశానికి తలమానికమై ఆ సంస్కృతిని ప్రపంచం అంతా వేనోళ్ల వేలాది ఏళ్ళుగా కీర్తించేటట్లు చేసింది.

అయితే సాక్షాత్తూ భగవంతుడే మానవుడిగా జన్మించినా ఆయన మానవుని లాగానే ప్రవర్తిస్తూ మానవులలో ఒకడిగా కలిసిపోయి తన లీలలతో మానవలోకానికి దివ్యసందేశాల నివ్వడం పరిపాటి. అలాంటి సంఘటన శ్రీరాముని బాల్యంలో జరిగింది. భవిష్యత్‌లో జరగబోయే మంచిఫలితాలను సూచించింది.

అదేమంటే చిన్నతనంలో శ్రీరాముడికి బంగారుగిన్నెలో తల్లి కౌసల్య చారుబువ్వ నేతితో కలిపి తెచ్చి, అంతఃపుర పైభాగాన చంకనెత్తుకుని తిప్పుతూ ఆకాశాన ఉన్న చంద్రుణ్ణి, తారలను చూపిస్తూ తినిపించబోయింది.

రాముడు బువ్వతినక ఆకాశంలో ఉన్న చంద్రుణ్ణి, చూపిస్తూ తనకు చంద్రుడు కావాలని పట్టుబట్టాడు. ఎంత నచ్చచెప్పినా బాలరాముడు మారాం మానలేదు. ముద్దనోట పెట్టనివ్వలేదు. కౌసల్యకు ఏమి చేయాలో తోచలేదు. అంతలో అక్కడికి దశరథమహారాజు మంత్రివర్యులు సుమంతునితో సహా వచ్చాడు. ఈ సంగతంతా సుమంతుడు విని కంగారు పడవద్దని వారితో చెప్పి, అద్దం తెప్పించి అందులో చందమామను చూపించాడు. అందని చందమామ అరచేతిలోకి వచ్చే సరికి బాలరాముడు ఎగిరిగంతేశాడు. మారాంమాని తల్లి చేతి గోరుముద్దలు చక్కగా తిన్నాడు.

అప్పటినుంచి బాలరామయ్య, రామచంద్రుడుగా పిలువబడ్డాడు. కేవలం పిలువబడడమేకాదు ఆ పేరును పెరిగి పెద్దయ్యాక సార్థకం చేసుకున్నాడు.



చల్లని వెలుగులను వెదజల్లి చంద్రుడు ఏవిధంగా ఆనందం కలిగిస్తాడో అదేవిధంగా శ్రీరామచంద్రుడు చల్లని పరిపాలన అందించి ప్రజలకు ఎలాంటి లోటు లేకుండా చూచుకున్నాడు.

ప్రకృతికూడా నెలకు మూడు వానలతో పులకరించింది. అయోధ్యా రాజ్యం పాడిపంటలతో, సిరిసంపదలతో ఓలలాడింది. ధర్మప్రభువు పాలనలో ప్రజలు ధర్మాన్ని ఆచరించి వేల ఏళ్ల గడిచినా రామరాజ్యం అన్న పేరును మరవకుండా చేశారు.

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## మీకు తెలుసా?



### తెలుగు సంవత్సరాల పేర్లు

| | | | | |
|---|---|---|---|---|
| 01) ప్రభవ | 13) ప్రమాథి | 25) ఖర | 37) శోభకృత్ | 49) రాక్షస |
| 02) విభవ | 14) విక్రమ | 26) నందన | 38) క్రోధి | 50) నల |
| 03) శుక్ల | 15) వృష | 27) విజయ | 39) విశ్వావసు | 51) పింగళ |
| 04) ప్రమోద | 16) చిత్రభాను | 28) జయ | 40) పరాభవ | 52) కాళయుక్త |
| 05) ప్రజాపతి | 17) సుభాను | 29) మన్మధ | 41) ప్లవంగ | 53) సిద్ధార్థి |
| 06) అంగీరస | 18) తారణ | 30) దుర్ముఖి | 42) కీలక | 54) రౌద్రి |
| 07) శ్రీముఖ | 19) పార్థివ | 31) హేమలంబి | 43) సౌమ్య | 55) దుర్మతి |
| 08) భావ | 20) వ్యయ | 32) విళంబి | 44) సాధారణ | 56) దుందుభి |
| 09) యువ | 21) సర్వజిత్ | 33) వికారి | 45) విరోధకృత్ | 57) రుధిరోద్గారి |
| 10) ధాత | 22) సర్వధారి | 34) శార్వరి | 46) పరీధావి | 58) రక్తాక్షి |
| 11) ఈశ్వర | 23) విరోధి | 35) ప్లవ | 47) ప్రమాదీ | 59) క్రోధన |
| 12) బహుధాన్య | 24) వికృతి | 36) శుభకృత్ | 48) ఆనంద | 60) క్షయ |




జవాబు: శివుని ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు

## పదాల 'సందడి'

క్రింది ఆధారాలతో జవాబులు చెప్పుకోండి?


1) దుకాణం ○○డి
2) బంగారం ○○డి
3) కలిసి ఉండటం ○○○డి
4) పుష్పంలోని భాగం ○○డి
5) శబ్దం ○○డి



జవాబు: 1)అంగడి 2)పసిడి 3)కలివిడి 4)పుప్పొడి 5)సందడి

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...





ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...


Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

**రథసప్తమి (08-02-2022) పర్వదినాన తిరుమలలో శ్రీమలయప్పస్వామివారు సప్తవాహనాలపై ఊరేగిన దృశ్యాలు.**

**ఈ వాహనసేవలు... మొదట శ్రీవారి అంతరాలయంలో, ఆ తర్వాత కల్యాణమండపంలో జరిగాయి.**

















SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-03-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

